

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 243 పేజీలు: 10+4 వెల: 6.50



టొమాటో వైరస్.. మధ్యప్రదేశ్‌లో వెలుగులోకి 5

నేడు తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి అంత్యక్రియలు 6


# త్వరలో ఆపరేషన్ సిందూర్-2

## ఈసారి ప్రపంచపటంలో పాక్ ఉండదు..

## ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరిక



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరికలు చేశారు. "సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపకపోతే, ప్రపంచ పటం నుంచి పాకిస్తాన్‌ను లేకుండా చేస్తాం. దేవుడి అనుమతి ఉంటే అలాంటి అవకాశం త్వరలోనే లభిస్తుంది. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌లో చూపించిన సంయమనాన్ని ప్రతిసారీ చూపించలేవు. ఈసారి నిర్ణయాత్మక, అత్యంత శక్తివంతమైన సమాధానం ఇస్తాం" అని హెచ్చరించారు. తక్షణమే పాక్ గడ్డపై ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని ఆపేయాలని హితువు పలికారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లా అనుప్‌గఢ్‌లో సైనికులతో ఆర్మీ చీఫ్ మాట్లాడుతూ, భవిష్యత్ ఘర్షణల్లో భారత్ విధానం 'ఆపరేషన్ సిందూర్' కంటే చాలా దూకుడుగా >>2

# లొంగుబాటలో మావోయిస్టు నేతలు

## రూ. 50 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు సీనియర్‌నేత మల్లోజుల పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం



మల్లోజుల వేణుగోపాల్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మావోయిస్టు సీనియర్ నేత, ఆ పార్టీ మిలటరీ కమిషన్ బాస్‌గా వున్న మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ తెలంగాణ పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోతున్నట్లు, కేంద్రంతో చర్చలకు సిద్ధమవుతున్నట్లు ఇటీవల అభయ్ పేరిట ప్రకటన విడుదలవడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. అయితే అభయ్ విడుదల చేసిన లేఖను మావోయిస్టు పార్టీ ఖండించడంతో పాటు ఆయన చర్యలను వ్యతిరేకించింది. అభయ్ వెంటనే ఆయుధాలు >>2

బీజాపూర్ ఎస్పీ ఎదుట 103 మంది లొంగుబాటు 2లో

# ఉగ్రవాదంపై రాజీపడం



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'జీటో కనెక్ట్ 2025'లో పాల్గొన్న రక్షణమంత్రి రాజ్‌నాథ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

## మతం పేరు అడిగి పాక్‌లో దాడులు చేయలేదు: రక్షణ మంత్రి రాజ్‌నాథ్

## విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్ తెలంగాణ: మంత్రి శ్రీధర్ బాబు

### ఘనంగా 'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవం

### పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాందేవ్ బాబా ప్రభృతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు3:** భారత గౌరవం,భూభాగ విషయంలో తామెప్పుడూ రాజీ పడలేదని, పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా దాడులు చేసినప్పుడు ఉగ్రవాదుల మతం ఏమిటో తాము అడగలేదని, సాధారణ ప్రజలను, సైనిక స్థావరాలను ఉగ్రవాదులను మాత్రమే టార్గెట్ చేశామని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిఐటిఒ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జీటో కనెక్ట్ 2025 ప్రారంభ సెషన్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రారంభించారు. 2016 సర్జికల్ స్ట్రైక్, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్, 2025లో ఆపరేషన్ సింధూర్ సమయంలోనైనా మరెప్పుడైనా ఇదేవిధానంలో మనవిధానం ఉంటుందన్నారు. భారతదేశం తన సైనిక,ఆర్థిక శక్తిని పెంచుకోవడం ఇతరులపై ఆధిపత్యం చెలాయించడానికి కాదని, దేశ సాంస్కృతిక విలువలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు,మహవీరుడు బోధించిన మానవీయ ఆదర్శాలను కాపాడుకోవడానికేనని మంత్రి స్పష్టం చేశారు. ఈరోజు భారత్ బొమ్మల నుంచి ట్యాంకుల వరకు అన్నీ >>2



# రోడ్లపై 'కోడ్'లు!

## ప్రయాణికులకు కీలక సమాచారం లభ్యం

## ఆసుపత్రులు, పెట్రోల్ బంక్‌లు చిటికెలో చూడొచ్చు

## టోల్‌ప్లాజాలు, రెస్ట్ ఏరియాలవద్ద ఏర్పాటు

**హైదరాబాద్,అక్టోబరు 3,ప్రభాతవార్త:** జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆసుపత్రులు, పెట్రోల్ బంకుల వంటి కనీస అవసరాల సమాచారంతో కూడిన క్యూఆర్ కోడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని దీనితో ప్రయాణికుల సౌకర్యం భద్రత పెంచాలని యోచిస్తోంది. టోల్ ప్లాజా, రెస్ట్ ఏరియాలలో క్యూఆర్ కోడ్లతో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌హెచ్ఎఐ శుక్రవారం ప్రకటించింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం ద్వారా ప్రయాణికులు రహదారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, అత్యవసర సేవలను సులభంగా పొందవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ >>2



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అలయ్, బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

# స్నేహ వారధి అలయ్, బలయ్

## హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ కుమార్తె నిర్వహించిన వేడుకకు హాజరై అభినందించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సిజెఐ ఎన్‌వి రమణ సహా పలువురు ప్రముఖులు

### పాల్గొన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, అర్జున్ మేఘవాల్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి, వివేక్, మాజీ గవర్నర్ విద్యాసాగర్, ముహేష్ కుమార్ గౌడ్, ఈటల, విహెచ్, నాగార్జున, బ్రహ్మానందం ప్రభృతులు

**హైదరాబాద్ (గోషామహాల్),అక్టోబరు 3 ప్రభాతవార్త:** తెలంగాణలో అలయ్,బలయ్ గొప్ప అద్భుతమైన సంస్కృతి స ంప్రదాయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు.దత్తన్న కుమార్తె విజయలక్ష్మి, నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన అలయ్, బలయ్ కార్యక్రమానికి కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి,అర్జున్‌మేఘవాల్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్.విరమణ, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముదిరాజ, విశ్వేశ్వరరెడ్డి, డి,కె.అరుణ, రఘు నందన్‌రావు, సుజనాచౌదరి,మాజీ వి.హనుమంత్‌రావు, కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి,అజీజ్‌పాషా,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ, పిసిసి >>2



# స్థానిక ఎన్నికలు కాంగ్రెస్, సిపిఎంతో సిపిఐ సర్దుబాటు

## బిసి రిజర్వేషన్లపై 5న నిర్ణయం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 3:** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్, సిపిఎంతోపాటు వామపక్ష పార్టీలతో సీట్ల సర్దుబాటు విషయంలో కలిసి ముందుకెళ్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ఈ నెల 8న వెలువడనున్న కోర్టు తీర్పు ఆధారంగా, ఆ కేసులో సిపిఐ కూడా ఇప్లిండ్ అయ్యే విషయంలో, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల అంశంపైన ఈ నెల 5న జరిగే సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్‌తో కలిసి కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ..బిసిల రిజర్వేషన్ల విషయంలో అందరూ కలిసి కృషి చేద్దామని చెప్పకుండా, రిజర్వేషన్లు సాధ్యమా? అంటూ బిసిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రిజర్వేషన్ల అంశంలో చాలామంది 'డబల్ డ్రామాలు' ఆడుతున్నారని దుయ్యబట్టారు. బిసి రిజర్వేషన్ల బిల్లులు చెల్లుబాటు అవుతాయా?లేదా? అనేచర్చలు జరుగుతున్నాయని, ఇటీవల శాసనసభలో ఆ బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు అమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఇడబ్ల్యుఎస్ 10 శాతం రిజర్వేషన్లను పెంచడంతో రిజర్వేషన్లపైన ఉన్న 50 శాతం పరిమితి ఎప్పుడో దాటిందన్నారు. రాష్ట్రంలో బలమైన జెడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచ్ స్థానాలను గుర్తించి, ఆ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవ్వాలని పార్టీ శ్రేణులకు ఇది వరకే పిలుపు నిచ్చినట్టు కూనంనేని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రస్తావించిన సామా జిక కార్యకర్త సోనంను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నిరంకుశత్వంగా పరిపాలించాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశ ప్రజలను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ని దేశ ప్రధాని నరేంద్రమోడీ పల్లెత్తుమాట కూడా అనడం లేదని మండిపడ్డారు. ట్రంప్ చేసే తప్పులను కూడా మోడీ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.



# నేటినుంచి స్కూళ్లు పునఃప్రారంభం

## 6నుంచి కాలేజీలు మొదలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 3:** తెలంగాణలోని పాఠశాలలు దసరా సెలవుల అనంతరం నేటి(శనివారం) నుంచి పునః ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 12 రోజులపాటు దసరా సెలవుల అనంతరం నేడు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులు సెప్టెంబర్ 22 నుంచి ఈ నెల 3 వరకు కొనసాగాయి. పాఠశాల విద్య శాఖ ప్రకటించిన 2025-26 విద్యా సంవత్సరపు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు కొనసాగాయి. తెలంగాణలో పెద్ద పండుగగా జరుపుకునే దసరా పండుగకు పాఠశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు కొనసాగి నేడు తిరిగి ప్రారంభం కానున్నాయి. అయితే నేడు శనివారం కావడం.. రేపు ఆదివారం మళ్లీ సెలవు ఉండటంతో.. చాలా మంది విద్యార్థులు నేడు పాఠశాలలకు హాజరు కాకపోవచ్చనే అభిప్రాయంతో అధికారు >>2



# కరూర్ తొక్కిసలాటపై 'సిట్' దర్యాప్తు

## మద్రాసు హైకోర్టు ఆదేశం

### నేతల ముందస్తు బెయిలు పిటిషన్లు తిరస్కృతి

### దుర్ఘటన తర్వాత నేతలు ఏమయ్యారంటూ కోర్టు ఆగ్రహం

**చెన్నై, అక్టోబరు 3:** తమిళనాడు కరూర్‌లో టివికెపార్టీ చీఫ్ నిర్వహించిన ర్యాలీ తదనంతర పరిణామాలను మద్రాసు హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. అలాగే తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తుకోరుతూ విజయ్‌పార్టీ దాఖలుచేసిన పిటిషన్‌ను కూడా కొట్టివేసింది. టివికె పార్టీ నేతలు దాఖలుచేసుకున్న ముందస్తు బెయిల్ దరఖాస్తులను కూడా హైకోర్టు తిరస్కరించింది. అంతేకాకుండా కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటవల్ల 41 మంది మృతిచెందడం 50 మందికిపైగా తీవ్ర గాయాలు పాలయిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిట్ (ఎస్ఐటి) విచారణకు ఆదేశించింది. ఐపిఎస్ అధికారి అస్రాగార్గ్ నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశాలు ఇచ్చింది. తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో టివికె పార్టీ నేతకు బెయిల్ ఇచ్చేందుకు మద్రాస్ హైకోరు నిరాకరించింది. >>2

ప్రముఖ నవలా రచయిత లల్లాదేవి కన్నుమూత 3లో



# 'సాగునీటి'లో రైతుల పాగా!

## వినియోగదార్ల సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు

## 'స్థానికం' కాకపోయినా ఆ సంఘాలలో చేరికకు అన్నదాతల యత్నాలు

## రాజకీయ నాయకుల కన్ను కూడా అటే..

**హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త:** సాగు నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ప్రణాళికలు సిద్ధం చేస్తుండటంతో రాష్ట్రంలో సందడి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలించకపోయినా సాగునీటి సంఘంలో పాగావేద్దామని కలలు కంటున్నారు. సాగునీటి సంఘాలపై గురిపెట్టి కొంత మంది వ్యవసాయం వృత్తి కలిగిన రాజకీయనాయకలు చూస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదటిసారిగా 1997లో నీటి సంఘాలను ఏర్పాటు చేశారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10748 సాగునీటి సంఘాలు ఉండగా అందులో తెలంగాణలోనే 4690 సాగునీటి సంఘాలు అంటే 43.6శాతం ఉన్నాయి. అందులో మేజర్ సాగునీటి సంఘాలు 601కాగా, మధ్యతరహా సాగునీటి సంఘాలు 166, మైనర్ ఇరిగేషన్‌లో 3923 సాగునీటి సంఘాలు ఉన్నాయి. రాయలసీమలో 245 మేజర్ సాగునీటి సంఘాలు కాగా ఆంధ్ర ప్రాంతంలో 1405 మేజర్ సాగునీటి సంఘాలు ఉండేవి. 2008 సర్వే ప్రమాణికంగా మూడు ప్రాంతాలు కలిపి ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మేజర్ సాగునీటి సంఘాలు 2261 ఉన్నాయి. మీడియంలో రాయలసీమలో 62 సాగునీటి సంఘాలు ఉంటే ఆంధ్రప్రాంతంలో 182 ఉండేవి, మూడు ప్రాంతాలు కలిపి అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 410 మధ్యతరహాప్రాజెక్టులు ఉండేవి. మైనర్‌ఇరిగేషన్ సాగునీటి సంఘాలు 8077మొత్తం రాష్ట్రంలోఉంటే ఆంధ్రప్రాంతంలో 2905,రాయలసీమలో >>2



శుక్రవారం హర్యానాలోని రోహతక్‌లో జరిగిన ఖాదీ మహోత్సవ్‌లో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# ఉగ్రవాదంపై రాజీపడం

>> తయారు చేస్తోంది. వేగంగా ప్రపంచ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఎదుగుతున్నాం. ఆ రోజు దూరంలో లేదు, భారత్ ఫ్యాక్టరీ ఆఫ్ ది వరల్డ్‌గా నిలుస్తుంది. వోకల్ ఫర్ లోకల్ నుంచి ఇప్పుడు లోకల్ టు గ్లోబల్పై దృష్టి సారించాం. మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు స్థానిక వ్యాపారాలను బలోపేతం చేయడంతో పాటు, భారత ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చాయి అని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి జిడిపి 7.3 ట్రిలియన్ డాలర్లను దాటి మూడో స్థానంలోకి వస్తుందని తెలిపారు. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2038 నాటికి కొనుగోలు శక్తి సమానత (పిపిపి) ప్రాతిపదికన భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా మనం అసాధారణ విజయాలు సాధించామని... పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ దృఢ సంకల్ప నాయకత్వం వల్ల భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. భారత జనాభాలో 0.5 శాతం కన్నా తక్కువే ఉన్నప్పటికీ, దేశ పన్ను వసూళ్లలో జైన్స్ సహకారం 24శాతం వరకూ ఉంది. జైనిజం. భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని బలోపేతం చేస్తూ, ఆర్థిక పురోగతికి మార్గం సుగమం చేస్తోంది అని రాజ్నాథ్‌సింగ్ అన్నారు. డా. విక్రమ్ సారాభాయి, డా.డి.ఎస్. కోఠారి, డా. జగదీశ్ చంద్ర జైన్, మీనాక్షి జైన్ వంటి మహనీయులను ఆయన గుర్తుచేసుకున్నారు.

విదేశాలనుంచి దొంగిలించబడిన 200 పైగా జైన తీర్థంకర విగ్రహాలను తిరిగి తెప్పించడం, జైన్ గ్రంథాల్లో ఉపయోగించే ప్రాకృత భాషను క్లాసికల్ లాంగ్వేజ్ ఆఫ్ ఇండియాగా గుర్తించడం వంటి ప్రభుత్వ కృషిని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. మహావీరుడు బోధించిన అహింస, సత్యం, అపరిగ్రహం వంటి విలువలు భారత్ అభివృద్ధి దిశలో మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో ఈ ఆధ్యాత్మిక సూత్రాలు పునాది అవుతాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. కాగా, జీటో కనెక్ట్ సదస్సులో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్‌గా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందని పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పరిశ్రామికవేత్తలనుకోరారు. ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అడుగు ముందుకేస్తున్నారన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తోందన్నారు. తెలంగాణ అవకాశాల ఖని, పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే ముందు ఒక్కసారి తెలంగాణలో పర్యటించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. జైన సమాజం సేవా స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృత మవుతుందని పేర్కొన్నారు. నిజమైన యూనికార్న్ అంటే బిలియన్ డాలర్ల విలువ కాదని, లక్షలాది మంది జీవితాలను ప్రభావితంచ చేయడమని యువపారిశ్రామిక వేత్తలకు, ఆవిష్కర్తలకు సూచించారు. ఈ కార్య క్రమంలో యోగా గురువు రాందేవ్‌బాబా, బిజెపి రాష్ట్రఅధ్యక్షుడు రామచందర్‌రావు, జీటో హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు రోహిత్ కోఠారి, లలిత్‌చోప్రా, విశాల్ అంచాలియా, బిఎల్ భండారీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహ వారధి అలయ్, బలయ్

అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, శాసనసభ్యులు కూనం సాంబశివరావు, గొరెంటి వెంకన్న, కె.కవిత, కోదండరామ్, ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున, ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం, వందే మాతరం శ్రీనివాస్, విమలక్క, మంగిలిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలుగా హర్యానా గవర్నర్ దత్తాత్రేయ విజయ దశమి మరుసటి రోజు నిర్వహించే అలయ్, బలయ్ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతకంగారావడం పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు రావడం సంతోషం వ్యక్తం చేశారు. ప్రేమ, సౌభ్రాతృత్వాన్ని పంచే అద్భుతమైన గొప్ప కార్యక్రమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన కళాకారులు తమ ఆట పాటలతో అలరించారు. ముందుగా అలయ్, బలయ్ కార్యక్రమానికి ముందు అంబాళీ సేవించారు ప్రజా సంఘాల నాయకులను కండు వాలను కప్పి ఘనంగా సన్మానించారు. గ్రేటర్‌హైదరాబాద్ బిజెపి ఫ్లోర్ లీడర్ గొంటి శంకర్ యాదవ్, బిజెపి నాయకులు నర్సింహ్మకురుమ తదితరులు పాల్గొన్నారు.

**భారత దేశం భిన్న సంస్కృతులకు నిలయం, అందులో తెలంగాణకు ప్రత్యేక స్థానం: గవర్నరు జిష్ణుదేవ్ వర్మ...**

భారత దేశం భిన్నసంస్కృతులకు నిలయం కాగా అందులో తెలంగాణ రాష్ట్రానికి సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విజయదశమి మరుసటి రోజు దత్తన్న ఆలయ్-బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించి అందులో రాజకీయాలకు, కులమతాలకు అతీతకంగా మంత్రులను, అధికారులను, కళాకారులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి సన్మానించడం పట్ల అభినందించారు. అదే విధంగా భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు మానవ, విలువలను కాపాడాలన్నారు.

**దేశ సంప్రదాయాలను కాపాడాలి: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు**

దత్తన్న 20 యేళ్లుగా ఆలయ్-బలయ్ ద్వారా సోదరుల మాదిరిగా ఒక వేదికపైకి తీసుకు వచ్చి సన్మానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దేశ సమగ్రతను కాపాడాలన్నారు. కుల, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టే వారి ఆటలకు చెల్లు అన్నారు. చిన్న, చిన్న విభేదాలు వచ్చినా భారతీయులం అంతా ఒక్కటే అనే భావనతో అందరూ కలిసి ముందుకు వెళ్తుంటారు. ఈకార్యక్రమంలో ఐక్యతా సందేశాన్ని అందించడం మహానందంగా ఉందన్నారు.

**సంప్రదాయాలను గుర్తు చేస్తుంది: మాజీ సిజెఐ ఎన్.వి రమణ**

భారత దేశం అనేక సంస్కృతులకు నిలయమన్నారు. ముఖ్యంగా సంస్కృతి, సంప్రదాయాలతో దత్తన్న చేసే ఆలయ్-బలయ్ ద్వారా ఆహార ఆలవాట్లను గుర్తు చేస్తుందన్నారు. 20 ఏళ్లుగా ఆలయ్, బలయ్‌ను నిర్వహించడం పట్ల అభినందిస్తున్నట్లు చెప్పారు. అందరిన్ని ఒక చోటచేర్చి ఐక్యత తేచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు.

**అజాతశత్రువు దత్తన్న : మంత్రి కొమటిరెడ్డి**

మాజీ గవర్నర్ దత్తన్న ఆజాత శత్రువని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్డుభవనాలశాఖ మంత్రి కోమటి ఒడ్డి వెంకటరెడ్డి అన్నారు. అందుకే పార్టీలకు అతీతకంగా పెద్ద ఎత్తున్న ఇక్కడికి వచ్చారన్నారు. 20ఏళ్లుగా నిర్వహించడం గొప్పవిషయమన్నారు.

**ఎంతో సంతోషంగా ఉంది: అక్కినేని నాగార్జున**

దాదాపు 20 సంవత్సరాలుగా దసరా మరుసటి రోజు దత్తన్న అలయ్-బలయ్ కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతకంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మొట్ట మొదటి సారిగా దత్తన్న ఆధ్వర్యంలో నిర్వహించే ఆలయ్-బలయ్ వేదికపైన తనను సన్మానించడం గొప్ప ఆనందం కలుగుతుందన్నారు.

**సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న దత్తన్న: హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందం**

గత 20 ఏళ్లుగా విజయ దశమి మరుసటి రోజు దత్తన్న ఆలయ్-బలయ్ కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతకంగా వేధిక ద్వారా అందరిన్ని ఒక వేదికపైన హృదపూర్వకంగా అలింగనం చేసుకోవడం ద్వారా అని మర్చిపోయి ప్రేమ, అనురాగం పంచుకోవడమే ఆలయ్-బలయ్ వేధిక అన్నారు. అంతేకాకుండా శ్రీరాముడు హానుమంతున్ని ఆలింగనం చేసుకున్నట్లు గుర్తు చేశారు. ఆ సంప్రదాయాన్ని ప్రతియేటా దత్తన్న కొనసాగించడం పట్ల ఆనంద వ్యక్తం చేశారు.

# లొంగుబాటలో మావోయిస్టు నేతలు

>> అప్పగించాలని పార్టీ కోరింది. దీని తరువాత వారం రోజులుగా పోలీసులతో అభయ్‌తో పోలీసులు చర్చలు జరిపి లొంగిపోయేందుకు ఆయనను ఒప్పించినట్లుగా వార్తలు వస్తున్నాయి. 65 యేళ్ల పైబడి వున్న అభయ్‌పై 50 లక్షల రూపాయల రివార్డు కూడా వుంది. అభయ్ లొంగుబాటుపై ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన విడుదలయ్యే వీలుంది. కాగా మావోయిస్టు పార్టీకి చెందిన మహిళా నేత పోతుల సుజాత ఇటీవలే పోలీసుల ఎదుట లొంగిపోవడం తెలిసిందే. ఆమె తరువాత మావోయిస్టు పార్టీకి చెందిన సీనియర్ నేత మరొకరు లొంగిపోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తుండడం విదితమే



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అలయ్‌బలయ్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. చిత్రంలో హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ ప్రభృతులు

# రోడ్లపై 'కోడ్'లు!

>> ద్వారా జాతీయ రహదారి నంబర్, ప్రాజెక్ట్ పొడవు, నిర్మాణ, నిర్వహణ కాలం వంటి వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు హైవే పెట్రోలింగ్, టోల్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్ వంటి అధికారుల ఫోన్ నంబర్లు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 1033 కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా, సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజాకు ఉన్న దూరం, ట్రక్కుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, పంక్చర్ షాపులు, వాహన సర్వీస్ స్టేషన్లు, ఈ ఛార్జింగ్ స్టేషన్ల వివరాలను కూడా ఈ కోడ్ ద్వారా పొందవచ్చని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ప్రయాణికులకు సులభంగా కనిపించేలా ఈ బోర్డులను టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాలు, రహదారి ప్రారంభ, ముగింపు పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ విధానం రహదారి భద్రతను పెంచడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందిస్తుందని, జాతీయ రహదారులపై అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్‌హెచ్‌ఏఐ తన ఆస్తుల మానిటైజేషన్ ద్వారా 2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 35,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్ల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ఒక నివేదికలో అంచనా వేసింది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ. 24,399 కోట్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని, బడ్జెట్ లక్ష ్యమైన రూ. 30,000 కోట్లను కూడా అధిగమిస్తుందని తెలిపింది.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. 'అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని కెటిఆర్ డిమాండ్ చేశారు.

# దక్షిణ మధ్య రైల్వేలో సిబిఐ దాడులు

## లంచం డిమాండ్ చేసిన రైల్వే ఆసుపత్రి సూపరింటెండెంట్ అరెస్టు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 3, ప్రభాత వార్త:** దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న అవినీతి అక్రమార్కులపై సిబిఐ మరోసారి పంజా విసిరింది.. దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజన్ లో క్లీనింగ్ పనులకు సంబంధించిన రూ.91,576 రూపాయల బిల్లును మంజూరు చేసేందుకు, ఓ ప్రైవేటు కంపెనీకి హౌస్ కీపింగ్, క్లీనింగ్ పనులకు సంబంధించి రూ.1.25 లక్షల రూపాయల విలువైన పనులనుకు సంబంధించి సదరు ఆఫీసు సూపరింటెండెంట్ పాతికవేల రూపాయలను డిమాండ్ చేయగా బాధితులు 20 వేల రూపాయల లంచాన్ని చెల్లించేందుకు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు.

బాధితులు విషయాన్ని సిబిఐని ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సిబిఐ వర్గాలు దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆఫీసు సూపరింటెండెంట్ తోపాటు మరోకరిని అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి.

## బీజాపూర్ ఎస్పీ ఎదుట 103 మంది లొంగుబాటు

**చర్ల, అక్టోబరు 3, ప్రభాతవార్త:** దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో సామాంతర పాలన చేసిన మావోయిస్టు పార్టీ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఉద్యమానికి ఊతం ఇచ్చిన ప్రాంతంలో నేడు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గడిచిన ఏడాదిన్న కాలంలో మునుపెన్నడూ చవిచూడవి ఎన్ కౌంటర్లు లొంగుబాట్లు ఆపార్టీ కకావికలం చేస్తుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత సమాజాన్ని చూస్తారని ప్రకటించారు. అందుకు అణుగుణంగానే నేటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర కమిటీ సభ్యులను ఐదుగురు పోగొట్టుకున్న పార్టీకి మరో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు సుజాత మల్లోజుల వేణుగోపాలరావు పోలీసుల ఎదుట లొంగిపోయారు. దట్టమైన దండకారణ్యంలో వర్షాకాలంలో సైతం కూబింగ్ చేపడుతున్న భద్రతా బలగాల గాలింపు చర్యలను ఎదుర్కోవడం మావోయిస్టులకు పెను సవాల్‌గా మారింది. భద్రాతా బలగాల దాటికి తట్టుకోలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉద్యమాన్ని ముందుకు సాగిస్తున్నారు కొందరు. మరికొందరు పార్టీలో ఉండి ప్రాణాలు పోగొట్టుకోవడం కన్నా లొంగిపోయి ప్రజా జీవనంలో కలవడమే మంచిది అన్న అలోచనతో లొంగుబాట్లకు శ్రీకారం చుట్టారు. నెలరోజుల క్రితం బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ ఎదుట 80 మంది మావోయిస్టులు లొంగిపోగా తాజాగా గురువారం 103 మంది మావోయిస్టులు లొంగిపోవడం సంచలనం కలిగించింది. లొంగిపోయిన వారిలో ఇరవై మంది మహిళలు ఉన్నారు. మరో 49 మందిపై సుమారు కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ పరిహారం ఒక్కొక్కరికి యాభై వేల రూపాయల నగదును అందజేసారు. మావోయిస్టు ఉద్యమంలో ఉండి సాదించేది ఏమి లేదని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని జనజీవన స్రవంతిలో కలిసిపోయి ప్రశాంత జీవనం గడపాలని ప్రభుత్వం లోన్ వర్కట్ (ఇంటికి రండి) కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోతున్నారని ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు.

# రైతుల పాగా!

>> 1252 మాత్రమే ఉండేవి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత వీటిని ఏర్పాటు చేస్తామని, కన్వీనర్లుగా నీటి పారుదల శాఖ అధికారులు వ్యవహరిస్తారని ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సంఘాలకే వారి మండలం, గ్రామాల్లో చెరువులు, కుంటలు ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను అప్పగించనుండటంతో పలువురు చిన్న స్థాయి నాయకులు వీటిపై దృష్టిసారిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుల నీటిపారుదల వ్యవస్థల నిర్వహణ చట్టం -1997 నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక మైలురాయి లాంటిది. నీటిపారుదల నిర్వహణలో రైతులను భాగస్వామ్యం చేయడంతోపాటు ప్రభుత్వం తరహాలో వాటిని నియంత్రణను చేయడానికి నీటి వినియోగదారులైన రైతులను బలోపేతం చేయడానికి నీటివనరుల సమర్థవంతంగా నిర్వహించడం సమాన స్థాయిలో పంపిణీ చేసుకోవాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టింది. మూడు అంచెల వ్యవస్థను ఏర్పాటు చేసింది, నీటిపారుదల వ్యవస్థలను నిర్వహించడానికి, నిర్వహించడానికి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్ట్ కమిటీలతో పాటు చిన్న కాలువ స్థాయిలో స్వతంత్ర నీటి వినియోగదారుల సంఘాలను సృష్టించింది. నీటిపారుదల శాఖ పర్యవేక్షణలో ఆయా చెరువులు, ప్రాజెక్టుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితితో వీటి ఛైర్మన్ ల పదవీ కాలాన్ని కొనసాగించారు. తెలంగాణలో నాలుగువేల వరకునీటి సంఘాలు ఉండేవి. ఇప్పుడు పెరిగే అవకాశం ఉందంటున్నారు. 2012లో ఈ సంఘాలను అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటి నుంచి అనేక గ్రామాల్లో చెరువులు, కుంటల శిఖం భూములు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో పట్టాలు కూడా చేసుకున్నారు. పంట కాల్వల మరమ్మతులు. చెరువులకు పడిన గండ్లు పూడ్చకపోవడంతో రైతులకు సాగునీటి సమస్య ఎదురవుతోంది. ప్రభుత్వ నిధులతో నిర్వహించే పనుల్లో రైతుల భాగస్వామ్యం, పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు తూతూమంత్రంగా కానిచ్చేస్తున్నారు.

# పునఃప్రారంభం

>> లున్నారు. దసరాసెలవుల అనంతరం రాష్ట్రంలోని సుమారు 4వేల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు సెప్టెంబరు 27 నుంచి ఈ నెల 5 వరకు దసరా సెలవులు కొనసాగనుండగా.. సోమవారం తిరిగి జూనియర్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీలు కూడా సోమవారం నుంచే ప్రారంభం కానున్నాయి.

## వారం - వర్జ్యం

04-10-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
ద్వాదశి సా.5.03
ధనిష్ఠ ఉ.9.06
వర్జ్యం : మ.3.58-సా.5.30
దు.తె.5.59-ఉ.7.35
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**వృషభం :** ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందాయి. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి.

**మిథునం:** ఎంతటి కార్యాన్నైనా దీక్ష పట్టుదలతో సాధిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**కర్కాటకం :** జీవితభాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**సింహం:** అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. ప్రయాణాలు.

**కన్య :** నూతనవ్యక్తులతో పరిచయాలు. మిత్రత్వానికి దారితీస్తాయి.

**తుల :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ధన లాభం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వస్తు లాభం.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీ కారం చుడతారు.

**కుంభం:** రాజకీయ, కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మీనం :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా పూర్తి వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అరేబియా సముద్రంలో 'సైక్లోన్ శక్తి'

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** దేశ పశ్చిమ తీరంలో 'సైక్లోన్ శక్తి' మంచుకొస్తోంది. ఈ యేడాది అరేబియా సముద్రంలో తొలి తుపాను ఏర్పడనుందని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ద్వారకకు నైరుతి దిశగా 240 కిలోమీటర్లు పోర్‌బందర్‌కు పశ్చిమం వైపు 270 కి.మీ.దూరంలో అరేబియా సముద్రంలో ఈ అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కి.మీ. వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. మరో మూడుగంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారవచ్చని అంచనా వేసింది. ఈ తుపానుకు 'శక్తి' అని పేరు పెట్టారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు తుపాను పేర్లను నిర్ణయిస్తాయి. భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్తాన్, ఖతార్ సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యుఎఇ, యెమెన్ ఆ దేశాలు. కొన్ని తుపానుల ప్రభావం వారం కన్నా ఎక్కువ రోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుపాను వస్తే ఎలా అని ఆలోచించి వాటికి పేర్లు పెట్టడం ప్రారంభించారు. ఈసారి శక్తి పేరును శ్రీలంక పెట్టింది. ఒక్కో తుపానుకు ఒక్కో పేరు పెడితే డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుపాను అని గుర్తుండిపోతుంది. అంతేకాకుండా ఆ పేరుతో ప్రజలను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుంది. ఈపేర్లు వీలయినంత చిన్నగా సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుపాను హెచ్చరిక కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలు తుపానుల గురించి సలహాలు, సమాచారం ఇస్తుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణశాఖ ఒకటిగా పనిచేస్తోంది. ఇది ఉత్తర హిందూ మహా సముద్రంపై గరిష్టంగా గంటలకు 60 కిలోమీటర్ల ఉపరితల వేగంతో గాలులు వీచే తుపాన్లకు పేర్లు పెడుతుంది.

# ఆపరేషన్ సిందూర్-2

>> ఉంటుందని అన్నారు. ఈసారి తాము గతంలోలా సంయమనం పాటించబోమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ 1.0లో ఉన్నట్లుగా కాకుండా, ఆపరేషన్ సిందూర్ 2.0లో పాకిస్థాన్‌పై మరింత తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో తాము తీసుకునే చర్యలు, పాకిస్థాన్ తన ఉనికి గురించి ఆలోచించేలా చేస్తాయని జనరల్ ద్వివేది వ్యాఖ్యానించారు. భూమిపై ఉండాలనుకుంటే పాకిస్థాన్ తక్షణమే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపాలని గట్టిగా హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా సైనికులు ఎలాంటి పరిస్థితులకైనా సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. బికనీర్ మిలట్రీ స్టేషన్‌తోపాటు పలు ఫార్వార్డ్ ఏరియాల్లో ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పర్యటించారు.

బలగాల సన్నద్ధతను అంచనా వేసేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. మిలట్రీ సీనియర్ అధికారులు, వెటరన్స్, సివిల్ డిగ్నటరీలతో ఆయన సమావేశమయ్యారు. ఆధునీకరణ, యుద్ధ సన్నాహకాలు, అడ్వాన్సింగ్ టెక్నలాజికల్ సామర్థ్యాలు, ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు ఆర్మీ కృతనిశ్చయంతో ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు.

# ఎఫ్16, ఎఫ్17 యుద్ధ విమానాలు నేలకూల్చాం: ఐఎఎఫ్ చీఫ్



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌తెలిపారు. స్పష్టమైన లక్ష్యంతో ఆపరేషన్ సిందూర్‌ను భారత్ ప్రారంభించిందని, లక్ష్యం నెరవేరిన తర్వాత త్వరగా యుద్ధాన్ని ముగించిందని వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఎలా ముగించాలో భారత్‌ను చూసి ప్రపంచం నేర్చుకోవాలని సూచించారు. భారత్ దాడుల్లో పాక్‌కు చెందిన ఎఫ్16, ఎఫ్17 యుద్ధ విమానాలు నేలకూలినట్లు తెలిపారు. సుదర్శన్ చక్ర గగనతల రక్షణ వ్యవస్థ కోసం త్రివిధ దళాలు పని చేయడం మొదలుపెట్టినట్లు తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్ చరిత్రలో నిలిచిపోయే ఒక పాఠంలా నిలుస్తుంది. ఈ యుద్ధం స్పష్టమైన లక్ష్యంతో ప్రారంభించాం. దానిని దీర్ఘకాలం పొడిగించకుండా త్వరగా ముగించాం. ప్రస్తుతం ప్రపంచంలో ఏం జరుగుతుందో మనం చూస్తున్నాం. రెండు యుద్ధాలు (గాజాఇజ్రాయెల్, రష్యా ఉక్రెయిన్) ముగింపు గురించి అసలు ఎలాంటి చర్చలు లేవు. కానీ మేం త్వరగా పాకిస్తాన్ కాల్పుల విరమణకోసం అడిగేలాచేశాం. నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరినందున ఆ శత్రుత్వాలను ముగించాలని మేంకూడా నిర్ణయించాం. ఈ విషయాన్ని ప్రపంచం మనల్ని చూసి నేర్చుకోవలసిన అంశంగా నేను భావిస్తున్నా' అని ఎపి సింగ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు చెందిన 5 యుద్ధ విమానాలను, త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వాటిలో ఎఫ్16, ఎఫ్17 యుద్ధ విమానాలు ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల స్థావరాలను గురిచూసి కొట్టడంతో పాక్‌లోని ఉగ్రస్థావరాలతో పాటు రాడార్ వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రన్‌వేలు, హ్యాంగర్‌లు, యుద్ధ విమానాలు, ధ్వంసమయ్యాయని వివరించారు. దీంతో కాల్పుల విరమణపై పాక్ కాళ్ల బేరానికి వచ్చిందన్నారు. ఈ విషయంలో మరెవరి జోక్యం లేదని, ఇస్లామాబాద్ కోరడంతోనే తాము కాల్పుల విరమణకు అంగీకరించామని తెలిపారు. భవిష్యత్తు భద్రతా సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొనేందుకు రక్షణ రంగంలో స్వావలంబన ముఖ్యమని ఏపీ సింగ్ స్పష్టం చేశారు. సుదర్శన్ చక్ర గగనతల రక్షణ వ్యవస్థ కోసం త్రివిధ దళాలు పని చేయడం మొదలుపెట్టినట్లు తెలిపారు.

# తొక్కిసలాటపై 'సిట్' దర్యాప్తు

>> ముందస్తు బెయిల్ కోరుతూ టీవీకే నామక్కల్ జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ర్యాలీసమయంలో జన సమూహాన్ని నియంత్రించడంలో పార్టీ ఎందుకు విఫలమైందని కోర్టు ప్రశ్నించింది. ఘటన తర్వాత టివికె నేతలు ఎక్కడికి వెళ్లారని, బాధితులను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించింది. అంతేకాదు టివికెచీఫ్ వాహనాన్ని ఎందుకు సీజ్ చేయలేదనికూడా ప్రశ్నించింది. ఈ మేరకు ఘటనపై సిట్ విచారణకు ఆదేశించింది. ఇదిలావుంటే తొక్కిసలాట బాధితులకు అదనపు పరిహారం కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై కూడా హైకోర్టు విచారణ జరిపింది. పరిహారం కోరుతూ దాఖలైన పిటిషన్‌పై మీ స్పందన తెలియజేయాలని ఆదేశిస్తూ కోర్టు తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

తమిళనాడులోని కరూర్‌లో టివికె నిర్వహించిన ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తు కోరుతూ సినీ నటుడు విజయ్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మదురై బెంచ్ విచారణ జరిపింది. ధర్మాసనం విజయ్ మరియు ఆయన పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభ దశలోనే ఉందని గుర్తు చేసింది. ఈ సమయంలోనే సిబిఐ దర్యాప్తు కోరడం సముచితం కాదని పేర్కొంది. కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని హితవు పలికింది. ఇదే అంశంపై సిబిఐ దర్యాప్తు కోరుతూ బిజెపి న్యాయవాది జిఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు వంటి ప్రాథమిక సౌకర్యాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతి ఇవ్వరని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది. ర్యాలీ సమయంలో జనసమూహాన్ని నియంత్రించడంలో పార్టీ ఎందుకు విఫలమైందని న్యాయమూర్తి ప్రశ్నించారు. తొక్కిసలాట బాధితులకు అదనపు పరిహారం కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# హైదరాబాద్‌లోని రక్షణ భూములను ప్రభుత్వానికి ఇవ్వాలి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి పొన్నం లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని కొన్ని రక్షణ భూములను ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వా లని కోరుతూ రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు లేఖ రాశారు. శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రికి జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయ లక్ష్మి ్మ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సంతకాలతో లేఖ రాశారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంతోపాటు సికిందరాబాద్‌లో నివసిస్తున్న ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడంలో, పౌర సౌకర్యాలను మెరుగుపరచడంలో రక్షణ శాఖ భూములు ఎంతగానో ఉపయోగపడతాయని లేఖలో పేర్కొ న్నారు. కంటోన్మెంట్ నుండి తెలంగాణ ప్రభు త్వానికి యూజర్ ఛార్జీల భాగం కింద దాదాపు రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బకాయిలను సకాలంలో క్లియరెన్స్ చేయడం వలన రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజా మౌలిక సదుపాయాలు కల్పిం చడం వారికి అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వా నికి మద్దతు లభిస్తుందన్నారు. ప్రజా వినియోగం కోసం కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తు న్నామన్నారు. అయితే ఆయా భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని, నగర అభివృద్ధికి ప్రజా సౌకర్యానికి అధిక ప్రాముఖ్యతలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులను అమలు చేయడానికి ఈ భూమార్పిడి కీలకంగా మారుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగడం లేదని ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. ప్రజా స్వామ్య పాలన, స్థానిక ప్రాతినిధ్యం దృష్ట్యా, ఈ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహిం చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు



లల్లాదేవి

# ప్రముఖ నవలా రచయిత లల్లాదేవి కన్నుమూత

**విజయవాడ, అక్టోబరు 3, ప్రభాతవార్త ప్రతినిధి:** లల్లాదేవిగా తెలుగు పాఠకులకు సుపరిచితులైన నప్రముఖ నవలా రచయిత పరుచూరి నారాయణ చార్యులు(82) శుక్రవారం వేకువజామున కన్ను మూశారు. ఆయన 150పైగా నవలలు రాశారు. 150కిపైగా నవలలు, కొన్ని నాటకాలు.. చారిత్రక ప్రాధాన్యత కలిగిన రచనలు.. ఆమ్రపాలి, మహామంత్రి తిమ్మరుసు, వైద్య విజ్ఞానం పంచే రచనలు ఎయిడ్స్, వాత్సాయన కామసూత్రాలు వగైరా.. ఇలా బహుముఖీనమైన ప్రతిభతో రచనా వ్యాసాంగం ద్వారా తెలుగు సాహి త్యాన్ని పరిపుష్టం చేశారు. లల్లాదేవి శ్వేతనాగు గత శతాబ్దంలో అంటే 1980–90వ దశకంలో ఒక సంచలనం. వేలకొలది కాపీలు అమ్ముడు పోవడమేకాక కీర్తిప్రఖ్యాతలు తెచ్చిన నవల. ఆ నవలను సినిమా కూడా తీశారు. 1982లో యార్లగడ్డ రాజ్యలక్ష్మీవెంకన్నచౌదరి కళాపీఠం అవార్డు, యల్లాప్రగడ సుబ్బారావు మెమోరియల్ పురస్కారం, డా. పఠాభి కళాపీఠం విజయవాడవారిచే ఉత్తమ నవలారచయితగా ఎంపికై 'గోల్డ్ మెడల్', ప్రశంసా పత్రం, లైఫ్‌టైమ్ ఎచీవ్ మెంట్ అవార్డు, గుంటూరు జిల్లా ఉగాది పురస్కా రాలు మూడుసార్లు, 1985 ప్రపంచ తెలుగు మహాసభల సావనీర్‌కు ఎం పికై, కథ ప్రచురితమైంది. 14 నవలలు కన్నడంలోకి అనువాదమై, వివిధ కన్నడ పత్రికల్లో ధారావాహికంగాను, నవలలుగాను వెలువడ్డాయి. ఆయన తిరుచరణాలు చారిత్రక నవల 'శ్రీచరణ్'గా హిందీలోకి అనువాదమై వెలువడింది. ఇక తిరుమల తిరుపతి దేవస్థానంలో, ధర్మప్రచార పరిషత్ (గుంటూరు) పురాణ పండిట్‌గాను, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్‌లోను, ఎపి ఆస్థాన పౌరాణిక ప్రవచకారునిగాను, స్వగ్రామంలో వైష్ణవ అర్చకస్వామిగాను, కొన్ని ఛానల్స్‌లో ఆస్ట్రాలజీ ప్రోగ్రామర్‌గా పనిచేసారు. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లల్లాదేవి మృతి పట్ల విచారం వ్యక్తం చేసారు.

# గూఢచర్యం చేస్తూ హార్యానాలో పట్టుబడిన మరో యూట్యూబర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 3 :** పాకిస్థాన్ తరఫున గూఢచర్యం చేస్తూ మరో యూట్యూబర్ అడ్డంగా దొరికిపోయాడు. ఇటీవలే హార్యానాలోనే గూఢచర్యం కేసులో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా అదే హార్యానాకు చెందిన మరో యూట్యూబర్ వసీం అక్రమ్ కూడా పాకిస్తాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ తరఫున గూఢచర్యం చేస్తున్నాడనే ఆరోపణలతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేవాట్ హిస్టరీపై యూట్యూబ్‌లో వీడియోలు చేసిన అక్రమ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పాల్వాల్ జిల్లాలోని కోట్ గ్రామానికి చెందిన వసీం అక్రమ్ గత మూడేండ్ల నుంచి పాకిస్తాన్ ఏజెంట్లతో సంబంధాలు కొనసాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అక్రమ్ వాట్సాప్‌ను పరిశీలించగా, నేరపూరిత సందేశాలను గుర్తించామన్నారు. అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. త్వరలోనే అక్రమ్ గూఢచర్యానికి సంబంధించి మరిన్ని వివరాలను వెల్లడిస్తామన్నారు.

# జుబీన్‌గార్గ్ మృతి కేసు.. మరో ఇద్దరు అరెస్టు

**గువహటి, అక్టోబరు 3 :** ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. గార్గ్ సహ సంగీతకారుడు శేఖర్ జ్యోతి గోస్వామి, గాయకురాలు అమృతప్రభ మహంతలను పోలీసులు అరెస్టు చేశారు.



సింగపూర్‌లో గార్గ్ మరణించిన సమయంలో వీరిద్దరూ కూడా ఆయన వెంటే ఉన్నారు. అయితే వీరిద్దరూ గార్గ్‌కు అత్యంత సన్నిహితులు కావడంతో.. అదుపులోకి తీసుకుని విచారి స్తున్నట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు గార్గ్ మృతిపై జుడీషియల్ విచారణ జరిపించాలని కోరుతూ ఫెస్టివల్ ఆర్గనైజర్ శ్యామ్‌కను మహంత సుప్రీంకోర్టు పిటిషన్‌లో దాఖలు చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో న్యాయవిచారణ జరగాలని మహంత తన పిటిషన్‌లో కోరారు.

# పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ పేరిట నుంచి పోలీసులకు ఎలాంటి హెచ్చరికలు రాలేదు

### ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టీకరణ

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ తెలంగాణ పోలీసులకు హెచ్చరించినట్లు మీడియాలో వచ్చిన వార్తలను రాష్ట్ర ప్రభు త్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఖండించింది. ఇది అవాస్తవమని ఈ మేరకు ఫ్యాక్ట్‌చెక్ విభాగం శుక్రవారం నాడు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది, పలు మీడి యా, సోషల్ మీడియాలో ఈ మేరకు నాలుగైదు రోజులుగా కథనాలు రావడం తెలిసిందే. దీంతో పాటు సినిమా పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామని బెదరించినట్లు కూడా ఆ కథనాల్లో వుంది. వాస్తవానికి ఈ వార్తలు 2023 నాటివిగా ఫ్యాక్ట్‌చెక్ విభాగం పేర్కొంది. ఇది పోలీసులను ఉద్దేశిం చినవి కావని, తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించినవని ఫ్యాక్ట్‌చెక్ విభా గం తెలిపింది. తెలంగాణ పోలీసులకు ఎలాంటి బెదిరింపులు రాలేదని ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ఏదైనా అంశం పోస్ట్ చేసే సమయంలో షేర్ చేసే సమయంలో జాగ్రత్తగా అందరు ఉండాలని ఫ్యాక్ట్‌చెక్ విభాగం కోరింది.

# 'శాంతి' కోసం ట్రంప్‌లో టెన్షన్




### 10న నోబెల్ పురస్కార విజేత పేరు ప్రకటన

**వాషింగ్టన్, అక్టోబరు 3:** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైనప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పలుమార్లు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ట్రంప్ ఆరాటాన్ని గమనించిన పాక్ సైన్యాధిపతి మునీర్ దానిని తమకు అనుకూలంగా మల్చుకొన్నారు. ట్రంప్ కోసం నోబెల్ బహుమతికి నామినేషన్ పంపారు. భారత్‌పాక్ మధ్య ట్రంప్ మధ్యవర్తిత్వం వహిం చారంటూ ఆయనకు సర్టిఫికెట్ ఇచ్చేశారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గాజాలో అవసరానికి మించి కఠినంగా వ్యవహరించి ప్రపంచవ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొన్నారు. గతంలో బైడెన్ యంత్రాంగం ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయగా, ట్రంప్ వచ్చాక వాటిని పునరుద్ధరించారు. ఇరాన్, హమాస్‌ను అణిచివేసేందుకు సహకరించారు. ట్రంప్ అభిమానం చూరగొనేందుకు నెతన్యాహు కూడా నోబెల్ రాగం అందుకొన్నారు. అమెరికా వెళ్లిన సందర్భంగా ఇజ్రాయెల్ నుంచి వెళ్లిన నోబెల్ నామి నేషన్ పత్రాన్ని నెతన్యాహు స్వయంగా ట్రంప్‌నకు అందించారు. శాంతి బహుమతికి సమస్య రాకూడదని భావించిన నెతన్యాహు ఖతార్‌కు మొక్కుబడిగా క్షమాపణలు చెప్పి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకున్నారు. అయితే తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగిన దేశాల నేతలే ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసిన వారిలో ఎక్కువగా ఉన్నారు. కంబోడియా, అర్మేనియా, అజర్ బైజాన్, రువాండ వంటి దేశాధినేతలు వీరిలో ఉన్నారు. అయితే జనవరి 31లోపు వచ్చిన దరఖాస్తులనే నోబెల్ శాంతి బహుమతి కోసం పరిశీలిస్తారని నోబెల్‌కమిటీ కూడా స్పష్టంచేసింది. ఇదే నిజమైతే పాక్ సహా పలు దేశాలు పంపిన నామినేషన్లతో ప్రయోజనం ఉండదు. మరోవైపు ఇతర దేశాల వారు తనకు మద్దతు ఇవ్వడం లేదని ట్రంప్ అంటున్నారు. టంప్‌నకు శాంతి బహుమతి విషయంలో స్వదేశంలోనూ అనుకూల వాతావరణం లేదు. ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడు కాదని 76శాతం అమెరికన్లు అనుకుంటున్నారు. వాషింగ్టన్ పోస్టు పోల్ ప్యానెల్‌లో 22 శాతం మాత్రమే ఆయనకు మద్దతు ఇచ్చారు. ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్లలో 49 శాతం మంది మాత్రమే మద్దతు ఇవ్వగా మరో 49 శాతం మంది వ్యతిరేకించారు. ట్రంప్ నోబెల్ కోసం పరితపించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సెటైర్లు కూడా వేశారు. నోబెల్ శాంతి బహుమతి కావాలంటే ముందు ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాలన్నారు. గాజా యుద్ధాన్ని ఆపితేనే నోబెల్ సాధ్యమని తేల్చి చెప్పారు. ఈనెల 10న శాంతి బహుమతి ప్రకటించనుండగా ట్రంప్‌లో టెన్షన్ పెరిగిపోతోంది. గాజాపై అత్యవసరంగా సంధి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ఇజ్రాయెల్, అరబ్ దేశాలతో ఆమోదముద్ర వేయించారు. మరోవైపు ట్రంప్ కార్యవర్గం శాంతి బహుమతి కోసం లాబీయింగ్ వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో నార్వేకు చెందిన నోబెల్ కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హార్ప్వికెన్ స్పందించారు. ప్రతి నామినీకి ప్రత్యేకమైన అర్హతలు ఉన్నాయని మీడియా లేదా బహిరంగ ప్రచారాలు తమపై ప్రభావం చూపబోవని చెప్పారు. ఏ అభ్యర్థి తరఫున మీడియాలో ప్రచారం జరుగుతోందో కూడా గమనిస్తామన్నారు. నార్వే పార్లమెంట్ నియమించిన ఐదుగురు సభ్యులు నామి నేషన్లను పరిశీలిస్తారు. వీరు పూర్తి స్వతంత్రంగా వ్యవహరిస్తారు. ఈనెల 10న శాంతి బహుమతి విజేతను ప్రకటిస్తారు. నోబెల్ తనకు రాకుంటే అది అమెరికాకే అవమానం అని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

# రాష్ట్రంలో రెండు రోజుల్లో రూ.697 కోట్ల మద్యం అమ్మకాలు

### గాంధీజయంతి డ్రైడే కారణంగా మూడు రోజులముందే పోటెత్తిన జనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 3:** దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో తెలంగాణలో మద్యం అమ్మకాలు సరికొద్ద రికార్డులు సృష్టించాయి. పండుగకు ముందు రోజు కేవలం మూడు రోజుల్లోనే ఏకంగా రూ. 697 కోట్ల విలువైన మద్యం అమ్ముడు పోయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులో పోలిస్తే ఇది భారీ పెరుగుదల అని వారు తెలిపారు. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 29న రూ.278 కోట్లు, సెప్టెంబర్ 30న అత్యధికంగా రూ. 333 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీన మరో రూ. 86 కోట్ల 23లక్షల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ మూడు రోజుల్లోనే 60 నుంచి 80 శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ యేడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వాస్తవానికి సెప్టెంబర్ 26 నుంచే రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు రెట్టింపైనట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ యేడాది ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 29.92లక్షల కేసుల లిక్కర్.36.36 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గత ఏడాదితో పోలిస్తే 7శాతానికి పైగా మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది. గాంధీ జయంతి (అక్టో బర్ 2)సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకా ణాలకు సెలవు ప్రకటించింది. అదే రోజు దసరా పండుగ కూడా ఉండటంతో, మందు బాబులు మూడు రోజుల ముందుగానే పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు. అక్టోబర్ 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైన్ షాపులు, లిక్కర్ మార్ట్‌ల వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. పలుచోట్ల మద్యం కోసం జనం బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. పండుగ సీజన్‌తోపాటు డ్రైడే కూడా కలిసి రావడమే ఈ భారీ అమ్మకాలకు ప్రధానకారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# కెనడాలో థియేటర్లపై దాడి

### భారతీయ సినిమాల ప్రదర్శన నిలిపివేత




**ఒట్టావో, అక్టోబరు 3 :** కెనడాలో భారతీయ సినిమాలు ప్రదర్శిస్తున్న థియేటర్లపై దుండగులు దాడులకు పాల్పడ్డారు. అంటారియో ప్రావిన్స్‌లోని ఒక్‌విల్ నగరంలో కాంతార, వీబి నడుస్తున్న థియేటర్లపై పెట్రోల్ బాంబులు దాడుల చేస్తూ కాల్పులకు పాల్పడ్డారు. ముసుగు ధరించిన దుండగులు ఎరుపు రంగు గ్యాస్ క్యాన్‌లతో లోపలికి చొరబడి.. థియేటర్ ప్రధాన ద్వారం వద్ద మండే ద్రవాన్ని పోసి నిప్పంటించారు. వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు దాడులు చేశారు. ఈ నేపథ్యంలోనే తమ సిబ్బంది, ప్రేక్షకుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ఆ థియేటర్ యాజమాన్యం భారతీయ చలన చిత్రాల ప్రదర్శనను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దాడికి గురైన ఫిల్మ్.సి.ఎ థియేటర్ అధికారులు.. తమ సౌత్ ఏషియన్ సినిమాల ప్రదర్శన కారణంగానే ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రిషబ్‌శెట్టి నటిం చిన కాంతార–1, పవన్ కల్యాణ్ నటించిన ఓజీ చిత్రాల ప్రదర్శనను రద్దు చేశారు. అయితే దాడుల్లో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. ఆస్తినష్టం మాత్రం జరిగిందని పోలీసులు వెల్లడించారు. థియేటర్ యాజమాన్యం ఈ దాడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని సోషల్ మీడి యాలో విడుదల చేసింది. భారతీయ సినిమాల ప్రదర్శనకు సంబంధించి బెదిరింపులు వచ్చాయని చెప్పారు. అలాగే దాడి జరగడం కూడా ఇదే తొలిసారేమీ కాదని వెల్లడిం చారు. ఈ పునరావృత చర్యలు కలవర పెడుతు న్నప్పటికీ.. తమ కమ్యూనిటీతో కలిసి సినిమాలు ఆస్వాదించడానికి సురక్షి తమైన, స్వాగతించే వాతావరణాన్ని అందించకుండా మమ్మల్ని నిరోధించలేవని థియేటర్ యాజమాన్యం ప్రకటించింది. పోలీసులు ఈ దాడులకు గల కారణాలను అధికారికంగా ప్రకటించ నప్పటికీ.. ఈ విధ్వంసక చర్యల వెనుక ఖలిస్థాన్ తీవ్రవాదుల హస్తం ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గలగలా గోదారి కదలిపోతోంది.. బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతోంది

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మహారాష్ట్ర కర్నాటకలో కురుస్తున్న వర్షాలతో గలగలా గోదారి కదిలిపోతుంటే బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతోంది. మెదక్ జిల్లా ఏడుపాయలలో మంజీరా నది ఉధృతి కొనసాగుతోంది. దీంతో వన దుర్గామాత ఆలయాన్ని తీసుకుని భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట నుంచి 1.09లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు .గోదావరి బేసిన్‌లోని మొగలి గుండ్ల బాగారెడ్డి సింగూర్ ప్రాజెక్టులో నీటి మట్టం 18.48 టిఎంసిలకు చేరుకోగా 88827 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి ఎగువనుంచి వస్తోంది. బయటకు 97361 క్యూసెక్కులు వదులుతున్నారు. నిజామ్‌సాగర్‌కు 108774 క్యూసెక్కుల వరద వస్తుంటే బయటకలు 126640 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆప్రాజెక్టులో 14.63 టిఎంసిలు నీరు ప్రస్తుతం నిలిచిఉంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టులో 70 టిఎంసిల నీరు నిండివుండగా 2,40,000 క్యూసెక్కుల నీరు పైనుంచి వరదగా వస్తుంటే బయటకుల109394క్యూసెక్కుల నీరు కింది వదులుతున్నారు. ఆదినారాయణరెడ్డి కడెం ప్రాజెక్టులో 4.7 టిఎంసిలు నీరు ఉంది ఇక్కడ పెద్దగా వరదరాకడ,పోకడలు లేవు.గోదావరికి అడ్డంగా కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి మాత్రం 20.18టిఎంసిల నీటిని నింపుకొని నిండుకుండలా కనపడుతోంది. 2,58,332క్యూసెక్కుల వరద నీరు ఎగువనుంచి వస్తుంటే దిగువకు 242915 క్యూసెక్కులు వదులుతున్నారు. పార్వతి 550750 క్యూసెక్కుల వరదజలాలు చేరుకొని బయటకు అంతేమొత్తం దిగువకు వెళ్ళుతున్నాయి. సరస్వతి బ్యారేజికి కూడా 4,06,724క్యూసెక్కుల వరదనీరు చేరుకొని అంతే మొత్తం కిందికి పోతున్నది. లక్ష్మీబ్యారేజి నుంచి 6,07,700 క్యూసెక్కుల వరదనీరు వెళ్ళుతోన్నది. సమ్మక్క సాగర్‌కు వచ్చిన 5,54490 క్యూసెక్కుల వరద నీరును కూడా అంతే మొత్తం కిందికి వదులు తున్నారు. సీతమ్మసాగర్ కు 8,85,673 క్యూసెక్కులు వరదనీరు రాగా అంతే మొత్తం కిందికి వదులుతున్నారు. అల్మట్టిలో 126.72 టిఎంసిల నీరు ఉండగా 56121క్యూసెక్కులు వరదగా వస్తోంది బయటకలు 44385 క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్‌లో 37.64టిఎంసిలు నీరు నిల్వఉండగా 56423క్యూసెక్కులు వరదగా వస్తుంటే కిందికి 46244క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. తుంగభద్రలో 80.79 టిఎంసిల నీరు వచ్చిచేరి నిల్వ ఉండగా ఇంకా పైనుంచి13411క్యూసెక్కుల వరద వస్తుండగా కిందికి అంతే మొత్తం వదులుతున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో9.11 టిఎంసిల నీరు ఉంది. ప్రియదర్శిని జూరాలకు 2.87లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి వస్తోంది. దిగువకు 2.77లక్షల క్యూసెక్కుల వరద వదులుతున్నారు.కృష్ణా నది జూరాల నుంచి ఉధృతంగా ప్రవహిస్తూనే ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు స్థిరంగా వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుంది. శ్రీశైలం ప్రాజెక్టులోపలికి 2,95,563 క్యూసెక్కులు వరద వస్తుంటే , ఔట్ ఫ్లో 3,46,374 క్యూసెక్కులుగా ఉంది. శ్రీశైలం 10 స్పిల్ వే గేట్లు ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తి సామర్థం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 209.15 టిఎంసిలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం సామర్థ్యం 312.04 టిఎంసి లు కాగా, ప్రస్తుతం 302.91 టిఎంసిలు ఉంది జలాశయం నిండుకుండలా మారింది. దీంతో సాగర్ 22 గేట్లు ఎత్తి దిగువకు 1.7 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ఇన్‌ఫ్లో 2.94 లక్షల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2.22 లక్షల క్యూసెక్కులుగా ఉంది. పులిచింతలలో 40.73 టిఎంసిల నీరు నిలిచి ఉండగా రెండులక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తున్నది. బయటకు 2.15లక్షల క్యూసెక్కుల వరద బయటకు పంపుతున్నారు.

# గంజాయి స్మగ్లర్‌గా మారిన 26/11 నాటి ఎన్ఎస్‌జి కమాండో

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** యావత్ దేశం ఉలిక్కిపడేలా చేసిన 26/11 ముంబయి తాజ్ హోటల్‌పై పాక్ ముష్క రుల దాడిని తిప్పి కొట్టేం దుకు జరిగిన ఆపరేష న్‌లో పాల్గొన్న ఎన్ఎస్‌జి కమాండో ఒకరు గంజా యి స్మగ్లర్‌గా మారి రాజస్థాన్ పోలీసులకు పట్టు బడ్డాడు. ఎపి, ఒడిషా నుంచి తెలంగాణ మీదుగా ఇతను తరచూ రాజస్థాన్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న విషయాన్ని రాజస్థాన్ యాంటి టెర్రరిస్ట్ పోలీసు విభాగం పక్కా సమాచారం సేకరించి దాడి చేయగా ఇతగాడు దొరికిపోయాడు. రాజస్తాన్‌కు చెందిన బజరంగ్ సింగ్ (43) ఏడవ తరగతి వరకు చదువు కున్నాడు. అయితే బిఎస్ఎఫ్‌లో వై కేటగిరిలో కాని స్టేబుల్‌గా చేరి అక్కడ కొంతకాలం విధులు నిర్వహించాక దేహ దారుఢ్య, క్రీడాంశాల పరీక్షల్లో నెగ్గి ఏకంగా జాతీయ భద్రతాదళం (ఎన్ఎస్‌జి) కమాండోగా ఎంపికయ్యాడు. ఇందులో ఏడేళ్ల పాటు పని చేశాడు. ఇతను ఎన్ఎస్‌జి కమాండోగా వున్న సమయం లోనే 2008లో ముంబయి తాజ్ హోటల్‌లో 26/11 ఉగ్రవాదుల దాడులు జరిగాయి. ఈ సమయంలో ఎన్ఎస్‌జి కమాండోలు ఉగ్రవాదులపై దాడులకు రాగా అందులో బజరంగ్‌సింగ్ కూడా వున్నాడు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌జి కమాండోలకు అవార్డులు రాగా ఇందులో బజరంగ్‌సింగ్ కూడా వున్నాడు. దీని తరువాత ఇతను రాజకీయంగా ఎదగాలని భావించి రాజస్థాన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తన భార్యను పోటీచేయించాడు. ఈ ఎన్నికల్లో ఆమె ఓడి పోయింది. దీని తరువాత బజరంగ్ సింగ్ ఎన్ఎస్‌జి నుంచి తిరిగి బిఎస్ఎఫ్‌లో మారాడు. అయితే తన భార్యను ఎన్నికల్లో పోటీ చేయించిన సందర్భంగా ఏర్పడ్డ పరిచయాలు బజరంగ్ సింగ్‌ను గంజాయి స్మగ్లర్‌గా మార్చాయి. రాజస్థాన్‌కు చెందిన కొందరు స్మగ్లర్లతో కలిసి ఒడిషా, ఎపి నుంచి గంజాయి సేకరించి దీనిని తెలంగాణ మీదుగా రాజస్థాన్‌కు స్మగ్లింగ్ చేసేవాడు. చాలా కాలంగా ఈ దందాను సాగిస్తున్న బజరంగ్‌సింగ్‌పై రాజస్తాన్ పోలీసులకు ఇటీవలే అనుమానం వచ్చింది. దీని తరువాత పక్కాగా నిఘా వుంచగా బుధవారంరాత్రి ఇతన్ని రాజస్థాన్‌లో 200 కిలోల గంజాయితో పట్టు కున్నారు. బజరంగ్‌సింగ్ ఎక్కడకు వెళ్లినా ఒక వంటవాడిని తీసుకుపోవడం అలవాటు. ఈ అలవాటే ఇతన్ని పట్టించిందని పోలీసులు తెలిపారు. నిందితుడిపై 25 వేల రూపాయల రివార్డు వుంది.



గంజాయితో పట్టుబడిన 26/11 ఎన్ఎస్‌జి కమాండో

# సంక్షేమ పథకాలు వివరిస్తూ స్థానికంలో జయకేతనం ఎగురవేయాలి

### మంత్రులు, కరీంనగర్ కాంగ్రెస్ నేతలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి అభివృద్ధిలో సంక్షేమంలో దూసుకుపోతున్నదని ఇదే విషయాన్ని ప్రజల్లో వివరించి స్థానకి సంస్థల ఎన్నికలలో జయకేతనం ఎగువరవేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన కరీంనగర్‌జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జి కెకెమహేందర్ రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితల ప్రణవ్, నరేందర్ రెడ్డి ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యవహరించాల్సి న తీరుపై తుమ్మల సుదర్ఘీంగా మార్గనిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపిక, అభ్యర్థులు విజయం సాధించడానికి తీసుకోవాల్సి న వ్యూహాలు, నియోజకవర్గ ఇంచార్జి అభ్యర్థుల బాధ్యత తదితర అంశాలపై చర్చించారు.

# ఎస్టీ నేతకు జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు3:** తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్టీ నేత ఎల్.రూప్ సింగ్ నాయక్‌ను సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారు. విజయ దశమి సందర్భంగా గురువారం రెండో విడత రాష్ట్ర కమిటీని కవిత ప్రకటించారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యవర్గంలో 80 శాతానికిపైగా పదవులను బడుగు బలహీన వర్గాలకు కట్టబెట్టారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యవర్గాన్ని సామాజిక కోణంలో ప్రకటించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా కల్వకుంట్ల కవిత పర్యటించనున్నారు.

జిల్లా పర్యటనల్లో మేధావులు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులతో సమావేశం కానున్నారు. ప్రజలతో పాటు ఆయా రంగాల ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు త్వరలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యవర్గం మూడో విడత ప్రకటన ఉంటుందని కల్వకుంట్ల కవిత తెలిపారు. జాగృతిలో కొత్త బాధ్యతలు అప్పగించిన వారు సంస్థ ఆశయాలకు అంకితమై పని చేయాలని ఆమె సూచించారు. ఈ నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని కవిత పేర్కొన్నారు.



దసరా వేడుకల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

# పదేళ్లు పోటీ చేయను..

### సంగారెడ్డి నుంచి ఇక నిర్మలాజగ్గారెడ్డి పోటీ

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 3, ప్రభాతవార్త :** రాబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో సంగారెడ్డి నియోజకవర్గం నుండి నిర్మలాజగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తారని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పష్టం చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విషయాన్ని ప్రస్తావిస్తూ నాకు మూడుసార్లు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా స్థానిక ప్రజలు అవకాశం ఇచ్చారని, కానీ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్మలాజగ్గారెడ్డి పోటీలో ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలలో గెలుస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, పది సంవత్సరాల తర్వాత మళ్లీ నేను ఎన్నికలలో పోటీ చేస్తానని ఆయన వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సంగారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధిపనులకు నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. నేను ఎమ్మెల్యేగా పనిచేసిన హయాంలో సంగారెడ్డి నియోజకవర్గానికి నిధులు అధిక సంఖ్యలో తీసుకురావడంతోపాటు ఐఐటిని కూడా తీసుకురాగలరని ఆయన గుర్తు చేశారు.

### తమిళనాడు సిఎం, గవర్నర్, నటుడు విజయ్, నటి త్రిష, బిజెపి కార్యాలయానికి బాంబు బెదిరింపులు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** తమిళనాడులో శుక్రవారం సిఎం స్టాలిన్, గవర్నర్ రవి, నటుడు విజయ్, నటి త్రిష, బిజెపి ప్రధాన కార్యాలయానికి బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. గడచిన కొన్ని వారాలుగా తమిళనాడులో ఎవరో ఒక ప్రముఖుడి ఇల్లు లేదా కార్యాలయంలో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి బెదిరిస్తుండడం పరిపాటి గా మారింది. ఇదే తరహాలో శుక్రవారం నాడు మ రోసారి ఈ బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీ సులు వెంటనే రంగంలో దిగి స్టాలిన్ నివాసంతోపాటు గవర్నర్ కార్యాలయం రాజ్‌భవన్‌లోనూ ముమ్మరంగా సోదాలు చేబట్టారు. అయితే ఎలాంటి అనుమానిత వస్తువులు లేక పోవడంతో పోలీ సులు ఊపిరి పీల్చుకున్నారు. దీని తరువాత న టుడు విజయ్, నటి త్రిష, బిజెపి ప్రధాన కార్యాలయం మరో నటుడు శేఖర్ ఇంటికి కూడా ఇటువంటి బెదిరింపులు వచ్చాయి. అయితే అక్కడ కూడా ఏమీ లభించక పోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. దీని తరువాత ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలోనూ బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. దీంతో తిరుపతి విమానాశ్రయం, రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేబట్టారు.

తాము అజ్ఞానులమని ప్రజలు తెలుసుకోవడం కష్టం. ఎందుకంటే ఆ విషయం తెలుసుకోవడానికి విజ్ఞానం ఉండాలి.

-జేమ్స్ థైల్

# కాటేస్తున్న కాలుష్యం


కాలుష్య నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యం కాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటి కంటే ముఖ్యంగా పాలకులు కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలు, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనేక వ్యాధులకు లోనవుతున్నారు. మరెందరో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికే పరిమితమై అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్యమేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. అన్నింటికంటే ముఖ్యంగా దేశంలోని అనేక నగరాల్లో పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతున్నది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం అదుపు తప్పిపోతున్నది. దీపావళి పండుగ వస్తున్నదంటేనే సామాన్యుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పండుగ సందర్భంగా విధించిన నిబంధనలు కొందరు పాటించకపోవడం, ఇష్టానుసారంగా దీపావళి మందులు కాల్చడంతో ప్రతిసారి పరిస్థితి అదుపు తప్పుతున్నది. ఈయేడాది ఢిల్లీలో రాబోయే దీపావళి సందర్భంగా మందులు కాల్చడం నిషేధించారు. అయితే ఒక్క ఢిల్లీలోనే కాలుష్యం వెదజల్లే ఈ దీపావళి మందులను నియంత్రించడం ఏమిటని, మిగిలిన ప్రాంతాల్లో ఎందుకు కట్టడి చేయలేరని న్యాయస్థానాలు కూడా ప్రశ్నిస్తున్నాయి. గత రెండు, మూడేళ్లుగా ఇష్టానుసారంగా దీపావళి మందులు కాల్చడంతో పరిస్థితి అదుపు తప్పిపోయింది. దీంతో ఏకంగా కేవలం కాలుష్యం కారణంగానే అక్కడ పదిరోజులపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీనికితోడుఎందరో ఈ కాలుష్య భూతానికి భయపడి చలికాలంలో ఢిల్లీవదలి కుటుంబ సమేతంగా సుదూర ప్రాంతాలకు వెళ్లి కాలుష్య భూతం శాంతించిన తర్వాతనే ఢిల్లీకి చేరుకుంటున్నారు. ఇలా వెళ్లే వారి సంఖ్య రానురాను పెరిగిపోతున్నది. ఢిల్లీలోనే కాదు దేశంలో అనేక నగరాలలో కాలుష్య పరిస్థితి ప్రమాదస్థాయికి చేరుకుంటున్నదనే వార్తలు అందుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా, ముంబయి నగరాలతోపాటు దక్షిణాదిన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో వాయు నాణ్యత క్షీణిస్తున్నది. మరోకపక్క ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా ఈ కాలుష్య భూతం విస్తరిస్తూనే ఉన్నది. ఆప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాలను కాల్చడంతో దట్టమైన పొగలు వ్యాపించి కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇది ప్రతియేడాది జరుగుతున్నా, అధికారులు నియంత్రిస్తున్నట్లు చెప్తున్నా ఆచరణకు నోచుకోవడంలేదు. కొన్నినగరాల్లో వాయు కాలుష్యం ప్రజారోగ్యాన్ని పట్టిపీడిస్తుంటే మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం తీవ్రస్థాయిలో ఉన్నట్లు వెలుగు చూసింది. హైదరాబాద్ నగరంలో నీటికాలుష్యంతోపాటు నిర్మాణ రంగంవల్ల వచ్చే గాలిని పీల్చడంవల్ల ధూళికణాలతో ఆరోగ్యం దెబ్బతింటున్నట్లు వైద్యనిపుణులే చెబుతున్నారు. ఇక గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోవడంతో ఒక క్రమపద్ధతి ప్రణాళిక లేకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా కాలనీలను నెలకొల్పుకుంటున్నారు. కొన్నిప్రాంతాల్లో చిన్ననీటి వనరులను ఆక్రమించుకొని నిర్మాణాలు జరగడంవల్ల వర్షాకాలంలో ఆ కాలనీల్లో నీరు బయటకు వెళ్లడం గగనమైపోతున్నది. మురికినీరు బయటకు వెళ్లే మార్గాలు లేక దోమల్లాంటి క్రిమికీటకాలకు స్థావరాలై రకరకాల వ్యాధులను విస్తరింపచేస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేకకార్యక్రమం చేపడుతున్నా ఈవలసలతో అవి ఎక్కడికక్కడ పెరిగిపోతున్నాయి. కాలుష్యం తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. 2019లో భారత్‌లో ఎంపిక చేసిన 102నగరాల్లో ధూళికణాలు ముప్పును ఇరవైశాతం వరకు తగ్గించేందుకు జాతీయ వాయుశుద్ధి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆతర్వాత క్రమేపీ దాన్ని మరో ముప్పైనగరాలకు విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మకణాలను యాభైశాతం వరకు నియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాదాపు ఏడువేల కోట్ల రూపాయ లకుపైగా వెచ్చించినా పరిస్థితుల్లో పెద్దగా మార్పురావడం లేదు. పశ్చిమ బెంగాల్, యూపి, తదితర రాష్ట్రాల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకు పైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు ఆ దేశం దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టించింది. అడవుల సంరక్షణకు ప్రత్యేకదృష్టిసారించింది. భారత్‌లో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించిన పొగను వదులుతున్న వాహనాలసంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకుఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. అయినా ఇది ఏమాత్రం ఆగడంలేదు. చాలావరకు చట్టం కాగితాలకే పరిమితం అవుతున్నది. భారత్‌లో ధూళికణాలుండాల్సిన స్థాయికన్నా ఐదురెట్లు అధికంగా ఉండి శ్వాసకోశ సమస్యల నుంచి కేన్సర్‌దాకా రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్న ఈకాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణంపట్ల సామాన్యుల్లో సైతం అవగాహన పెంచేందుకు కృషి జరగాలి.

ఆలోచన వికసించే పుష్పం వంటిదైతే, ఆలాపన దాని అంకురం, ఆచరణ ఫలం.



ఎమర్సన్

అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.



ఆస్కార్‌వైల్డ్

# జారుడు మాటలతో దిగజారుతున్న ప్రతిష్ట

**పథకాలన్నింటికి తమ పార్టీ పేరో, లేక నేతల పేరో ఉండేలా ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఒక ముఖ్యమంత్రి దాదాపు రెండు డజన్లకుపైగా పథకాలకు తన పేరేపెట్టుకున్నారు. కానీ ఆయన దిగిపోయిన తర్వాత ఆయన పేరును దుర్భిణి పెట్టి వెతికినా రాష్ట్రంలో ఎక్కడా కన్పించకుండా పోయింది. ఇక కొందరైతే ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పథకాలకు, ప్రాజెక్టులకు పోటీపడి వారి పేర్లనే పెట్టారు. అవకాశం లేకనో, ఆలోచన రాకనో ఏమోకానీ కృష్ణా, గోదావరి లాంటి జీవన నదుల పేర్లు మార్చి ఆ పెద్దల పేర్లుపెట్టి తమ స్వామిభక్తిని ప్రదర్శించుకోకపోవడం మన అదృష్టం. ఏదిఏమైనా అందరికి ఆదర్శంగా అనుకరణీయంగా ఉండాల్సిన నేతల్లో కొందరు నాయకులు ఇలా వ్యవహరించడం వల్ల తమ ప్రతిష్టను తామే దిగజార్చుకొంటున్నారు.**

దామెర్ల సాయిబాబ

కాలు జారితే వెనక్కి తీసుకోవచ్చు. ఒకవేళ విరిగినా ఆస్పత్రికి వెళ్లి అతికించుకోవచ్చు. కానీ మాట జారితే వెనక్కి తీసుకోలేం, ఆ తర్వాత చేయగలిగిందేమీ ఉండదు. కీలక పదవుల్లో ఉన్నవారు ప్రతి విషయంలోనూ ఆచితూచి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాధ్యతలు, అంతస్తులు, అధికారాలు పెరిగే కొద్దీ మాటలకు విలువ పెరుగుతుంది. వారు మాట్లాడే ప్రతి మాటకు ఎంతో గౌరవం ఉంటుంది. అందుకే ఎవరు ఎంత రెచ్చగొట్టినా ఎంత విపత్కర పరిస్థితులు ఎదురైనా కీలకబాధ్యతలు నిర్వహించే వ్యక్తులు ఎంతో సంయమనంతో వ్యవహరించాలి. బాధ్యతాయుతంగా మాట్లాడాలి. ఎందుకో కానీ ఇటీవల కొందరు నాయకుల మాటలకు అదుపు లేకుండాపోతున్నది. ఏం మాట్లాడుతున్నారో, ఎలాంటి భాషవాడుతున్నారో వారికే తెలియకుండా పోతున్నది. కీలక పదవుల్లో ఉన్నవారు సైతం రెచ్చగొట్టే విధంగా కొన్నిసందర్భాల్లో బూతులు మాట్లాడటానికి కూడా వెనుకాడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ సంస్కృతి విస్తరించిపోతున్నది. కొందరు నేతలు మాట్లాడుతున్న భాష సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్నది. పత్రికల్లో రాయలేని భాష మాట్లాడుతున్నారు. అయితే గతంలో అలాంటి వారు వాడిన భాషను పత్రికలు ప్రచురించకపోవడంతో ప్రజలకు అంతగా తెలిసే అవకాశం లేకపోయేది. కానీ ఎలక్ట్రానిక్ మీడియా ముఖ్యంగా యూట్యూబ్ వచ్చిన తర్వాత యధాతథంగా ప్రసారం అవుతున్నాయి. కుటుంబ సభ్యులందరూ ఇంట్లో కూర్చొని టీవీల్లో చూడలేని, వినలేని దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. వీరా మన ప్రజాప్రతినిధులు? అంటూ ముక్కున వేలేసుకుంటున్నవారెందరో ఉన్నారు. అసలు రాజకీయంగా బూతులు మాట్లాడకపోతే నాయకులం కాలేమన్న భావన పెరిగిపోతుందేమోననిపిస్తున్నది. వ్యక్తిగత ధూషణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా ఒకరినొకరు తీవ్ర పదజాలంతో ధూషించుకోవడం ఆ తర్వాత ఏదో సందర్భంలో కలుసుకున్నప్పుడు ఆప్యాయంగా, ఆహ్లాదకరంగా నవ్వుతూ మాట్లాడుకోవడాన్ని చూస్తున్నవారు ఏమనుకుంటారో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయంగా వేసే అడుగులు, విమర్శలు రాజకీయాలకే పరిమితం కావాలి. రాజకీయాలు ఎప్పుడు ఎలా ఉంటాయన్నది, సమీకరణలు ఎలా మారుతాయో, ఎప్పుడు ఏ పార్టీకి కప్పదాట్లకు పాల్పడతారో ఊహకందని పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా కూడా నెలకొన్న పరిస్థితులు ఏ పార్టీతో ఎవరు పొత్తుపెట్టుకుంటారో, ఎవరెవరు లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటారో చెప్పలేని పరిస్థితి. కత్తులు దూసుకున్నవారే కలిసిపోతున్నారు. ఎన్నికలు దగ్గరకు వచ్చే కొద్దీ కప్పదాట్లు పెరిగిపోతున్నాయి. చొక్కాలు మార్చినట్లుగా పార్టీలు మారుస్తున్న ఈ రోజుల్లో పార్టీ నేతలు కూడా దీన్ని ప్రోత్సహిస్తున్నారు. గతంలో పార్టీలు మారే సంప్రదాయం లేదని చెప్పడం లేదు. అప్పుడు కూడా ఈ సంస్కృతి కొద్దో గొప్పో ఉంది. ఆనాడు పార్టీలు మార్చాలనుకుంటే ప్రజలు ఏమనుకుంటారో? తమను భుజాన పెట్టుకొని మోసిన పార్టీ కార్యకర్తలకు ఏమని సమాధానం చెప్పాలనే జంకు, భయం, బిడియం ఉండేవి. సిద్ధాంతపరంగా విభేదాలు ఏర్పడినప్పుడు పార్టీలు మార్చిన వారు సైతం కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారితో చర్చించి తాము ఎందుకు పార్టీలు మార్చాల్సి వచ్చిందో వివరించి తామున్న పార్టీ ద్వారా వచ్చిన పదవులను, హోదాలను తృణప్రాయంగా త్యజించి పార్టీలు మార్చేవారు. ఇప్పుడు వేళ్ల మీద లెక్కపెట్టినవారు మాత్రమే ఇలాంటి సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఇక ఒకపార్టీలో ఉన్నప్పుడు ప్రత్యర్థి

## ఒక్క మాట

పార్టీని, అందులోని నేతలను ఇష్టానుసారంగా హద్దుపద్దు లేకుండా ఆరోపణలు, విమర్శలు చేసి మరుసటి రోజు మళ్లీ అదే ప్రత్యర్థి పార్టీలోకి మారిపోయి గతంలో తమకు రాజకీయ భిక్ష పెట్టిన పార్టీని, పార్టీ నేతలపై విమర్శనాస్త్రాలు, వ్యక్తిగత ఆరోపణలు గుప్పిస్తున్నారంటే ఏమనుకోవాలి. ఇదేదో ఎవరినో విమర్శించడానికి రాయడం లేదు. ఎవరికివారే ఆత్మపరిశీలన చేసుకోవాలి. అందుకే పెద్దలన్నారు విడిపోయేటప్పుడు మళ్లీ కలుసుకుంటామని విడిపోవాలి. అలాగే కలుసుకునేటప్పుడు మళ్లీ విడిపోతామని కలుసుకోవాలి. ఈ సూత్రాన్ని గుర్తుంచుకొని పాటిస్తే ఎవరి పరిధిలో వారుంటారు. ఇది పార్టీ నేతలకే కాదు, కుటుంబాలకు, స్నేహితులకుకూడా వర్తిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో పొల్లుమాటలతో తమ ప్రతిష్టను తామే దిగజార్చుకుంటున్నారు. ఈ పార్టీ, ఆపార్టీ అని కాదు. అందరూ కాకపోయినా కొందరు నేతల మాటలకు అదుపులేకుండాపోతున్నది. ఎవరిపై విమర్శలు గుప్పిస్తున్నా గౌరవమైన ఉన్నత పదవుల్లో ఉన్నవారిని కూడా ఏకవచనంతో సంభోదించి వ్యక్తిగత ధూషణలకు పాల్పడడం ఎంత వరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి. సాక్షాత్తుభారత దేశ ప్రధానమంత్రిని కూడా ఏకవచనంతో సంభోదిస్తూ విమర్శలు చేస్తున్న చోటానాయకులు ఇటీవలకాలంలో పెరిగిపోతున్నారు. ఇందువల్ల వారి గౌరవప్రతిష్టలు వారే దిగజార్చుకుంటున్నారు. ఇలాంటి భాష వాడినప్పుడు బహిరంగ సభల్లో కేరింతలతోపాటు చప్పట్లు కొట్టవచ్చు. ఆ చప్పట్ల కోసమే కొందరు నేతలు అలాంటి భాష మాట్లాడుతుండవచ్చు. అది సభ్యతా సంస్కారం కాదు. ప్రజలకుఆదర్శంగా, అనుకరణీయంగా ఉండాల్సిన నేతలు అలాంటి భాషను మాట్లాడడం ఏరకంగా చూసినా సమర్థనీయం కాదు. అలాంటి భాష మాట్లాడిన వారినెందరినో తెలుగు రాష్ట్రాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మూలన కూర్చో పెట్టారు. ఇప్పుడు ఈదుస్సంస్కృతి గ్రామాలకు కూడావిస్తరిస్తే మాటలకే కాక, చేతల యుద్ధాలుగా మారుతాయి. ఇక ప్రతీకార రాజకీయాల పర్వం కూడా తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్నది. ఇది ఏమాత్రం వాంఛనీయం కాదు. అధికారంలోఉన్నప్పుడు తప్పులుచేస్తే చట్టాలున్నాయి. న్యాయస్థానాలున్నాయి. వ్యక్తిగతంగా కక్షలు తీర్చుకునేందుకు అధికారాన్ని వినియోగించడం సమంజసంకాదు. గతంలో ఇలా వ్యవహరించిన నాయకులు ఫలితాలను చవిచూస్తున్నారు. అసలు ఈ వ్యక్తిగత ప్రతీకారకక్షలు తీర్చుకునే సంస్కృతి ఒకనాడు పొరుగునున్న తమిళనాడు పతాకస్థాయిలోఉండేది. ఇప్పుడు అక్కడ మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. పొగడ్తలు, వ్యక్తిగతవిమర్శలన్నింటిని నియంత్రించేందుకు అక్కడ ముఖ్యమంత్రి స్టాలిన్ శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. అసలు పొగడ్తలకు తల వంచని మనిషి అంటూ ఉండడు. ఒకసారి పొగడ్తలకు అలవాటుపడితే వదిలిపెట్టడం సులువు కాదంటారు. పూర్వం రాజుల కాలంలో వారిసభల్లో కేవలం పొగడ్తల కోసమే కొందరు ఉండేవారు. పొగిడించుకోవడం కోసమే వారికి జీత భత్యాలతోపాటు భూములు, మాన్యాలిచ్చి రాజులు పోషించేవారు. పొగిడేవారికి ఎలాఉన్నా పొగడ్తలు ఎంత కమ్మగా, ఆనందంగా, తీయగా ఉంటాయో పొగిడించుకునే వారికే తెలుస్తుదంటారు. రాజులు, రాజ్యాలు పోయాయి. ప్రజాప్రభువులు వచ్చారు. ప్రజాప్రభువుల్లో పొగిడించుకునేందుకు పోటీపడేవారు ఎక్కువైపోతున్నారు. అలాంటిది మొన్న ఆ మధ్య తమిళనాడు శాసనసభలో తమ పార్టీ సభ్యులు పొగడ్తలతో ముంచెత్తుతుంటే ఆ రాష్ట్రముఖ్యమంత్రి స్టాలిన్ అడ్డుకొని ప్రజాధనంతో నిర్వహిస్తున్న శాసనసభలో ముఖ్యమంత్రిని పొగడడం ఏమాత్రం సమంజసంకాదంటూ, అలా ఎవరైనా ఇకనుంచి పొగిడితే వారిపై చర్యలు తీసుకుంటామని సభాముఖంగా ప్రకటించారు. అలాగే గతప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మ క్యాంటీన్' లాంటి పథకాలు యధాతథంగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పేరుతోనే కొనసాగించాలన్నారు. ప్రతి పక్షనేతల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు లేకుండా ప్రభుత్వ ముద్రకే పరిమితం చేశారు. ఇలాంటి చర్యలెన్నో తీసుకుంటూ రాజకీయ హుందాతనాన్నిపాటిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆ పరిస్థితి కన్పించడం లేదు. పథకాలన్నింటికి తమ పార్టీ పేరో, లేక నేతల పేరో ఉండేలా ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఒక ముఖ్యమంత్రి దాదాపు రెండు డజన్లకుపైగా పథకాలకు తన పేరేపెట్టుకున్నారు. కానీ ఆయన దిగిపోయిన తర్వాతఆయన పేరును దుర్భిణి పెట్టి వెతికినా రాష్ట్రంలో ఎక్కడా కన్పించకుండా పోయింది. ఇక కొందరైతే ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పథకాలకు, ప్రాజెక్టులకు పోటీపడి వారి పేర్లనే పెట్టారు. అవకాశం లేకనో, ఆలోచన రాకనోఏమో కానీ కృష్ణా, గోదావరి లాంటి జీవన నదులపేర్లు మార్చి ఆ పెద్దల పేర్లుపెట్టి తమ స్వామిభక్తిని ప్రదర్శించుకోకపోవడం మన అదృష్టం. ఏదిఏమైనా అందరికి ఆదర్శంగా అనుకరణీయంగా ఉండాల్సిన నేతల్లో కొందరు నాయకులు ఇలా వ్యవహరించడం వల్ల తమ ప్రతిష్టనుతామే దిగజార్చుకొంటున్నారు. ●

# సుస్థిర అభివృద్ధితోనే వికసిత భారత్ సాధ్యం

ఐ.ప్రసాద రావు

నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ప్రజలందరినీ పండుగల పేరుతో మతం మత్తులో ముంచి తేలిస్తున్నారు. సహజంగా మన దేశంలో ప్రజలకు దైవభక్తి ఎక్కువ. దీనిని ఆసరాగా చేసుకుని భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసిన పాలకులు, ఆ ప్రమాణాలను, రాజ్యాంగ లక్ష్యాలను పక్కన బెట్టి, సెక్యులర్ అనే భావన పాటించకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మత క్రతువుల్లో పాల్గొంటూ, ప్రజలను కూడా వీటిలో భాగస్వామ్యం చేయడం జరుగుతుంది. దీంతో దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మానవ అభివృద్ధి వంటి అంశాలు పక్కదోవ పట్టిస్తూ, ప్రజలను మభ్య పెడుతున్నారు. ప్రజలు కూడా ఇటువంటి అంశాలను సీరియస్‌గా ఆలోచించకుండా పండుగలు జరుపుకుంటూ కాలం వెలిబుచ్చుతున్నారు. ఈ మత మైకంలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోకపోవడం బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా, నేటికీ మన అక్షరాస్యత 74 శాతంగా ఉంది. ఇది కూడా కేవలం సంతకాలు చేసిన వారినికలుపుకుంటే. లేదంటే అరవై శాతం లోపే. దీనివల్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన లేకపోవడం వల్ల అసలు సమస్యలు, దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం అధిక ధరలు ప్రైవేటీకరణ వంటి అంశాలు అర్థం చేసుకోలేకపోవడంతో పాలకులు చెప్పే మాటల గారడీలో పడిపోతున్నారు. అందుచేతనే వారి జీవితాలు అన్నిరకాలుగా అంతంత మాత్రంగానేఉన్నాయి. నేటికీ దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ పథకం, సంక్షేమ పథకాలు, ఉచిత పథకాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని వివిధ రకాల పండుగలు మనదేశంలో ఉన్నాయి. పూర్వకాలంలో పండుగ కార్యక్రమాలు జరుపుకుని, వారి దైనందిన జీవితంలో మునిగిపోయే వారు. కానీ నేడు పండుగలను 'పెద్ద పెద్ద ఈవెంట్స్' లాగా ప్రభుత్వాలే జరపటం ఆశ్చర్యంవేస్తుంది. కొద్ది మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చుచేసి, భారీఎత్తున ప్రజల నుంచి ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది. అనగా భక్తిని 'వ్యాపారం'గా మార్చి వేసారు. ప్రజల నుంచి కొన్ని కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. దేవస్థానాలు, ట్రస్టులు, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు భారీగా ఆర్థికంగా బలపడుతున్న పరిస్థితి. నేటి ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, కనీస అవసరాలు తీర్చడం మానేసి, ప్రజలను మభ్యపెట్టే మత క్రతువుల్లో పాల్గనేటట్లు ప్రోత్సహిస్తున్నాయి. ఇవా ప్రభుత్వాలు చేసే పనులు అని ఆలోచన చేయాలి. అసలు ఈ ఆధునిక కాలంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే వివిధ రంగాల్లో అనగా అక్షరాస్యత, ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి విషయంలో, సంతోష సూచిలో, మానవ అభివృద్ధి సూచికల్లో మనం ఎక్కడ ఉన్నాం?అని ప్రశ్నించుకుని, ప్రభుత్వాలు పని చేయాలి. కొంతమంది చేతిలోనే దేశ సంపద కేంద్రీకృతమై, కొద్దిమంది బిలియనీర్ల సంపద పెరుగుదల చూసి దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుంది అని మురిసి పోవడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఎందుచేతనంటే దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలతోనే జీవితాలు గడుపుతున్నారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం నిరంతరం వెంటాడుతూనే ఉంది అనే వాస్తవాన్ని మరువరాదు. కావున ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల వాస్తవ జీవన ప్రమాణాలు ఎలా పెంచాలి అనే అంశంపై దృష్టి సారించాలి. అంతర్జాతీయ స్థాయిలో వివిధరంగాల్లో మనదేశం గర్వించదగ్గ స్థాయిలో ఉండే విధంగా చూసుకోవాలి. ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలను దృష్టిలో ఉంచుకుని మన దేశాన్ని నడిపించాలి. వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. అవినీతిని నిర్మూలించాలి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, క్యూబా వంటి దేశాలు ఉత్పత్తి రంగంలో ఎలా అభివృద్ధి చెందుతున్నాయో చూసి, మన దేశంలో అమలు చేయాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి. 'ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా' అనే కార్యక్రమాలు మొదలు పెట్టి దాదాపు దశాబ్దం కాలం గడిచినా ఏమేరకు ఆ లక్ష్యం చేరేమో ఈ ప్రభుత్వాలు పునఃసమీక్ష చేసారా? ఇటువంటి అంశాలపై దృష్టిసారించడంమాని వేసి, కేవలం మత క్రతువులకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తే ఎలా? ప్రపంచ దేశాలు అన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాకెట్లు స్పీడ్‌తో ముందుకు సాగుతుంటే, మన విద్యాలయాల్లో తిరిగి వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన అంశాలువంటివి ప్రవేశపెడుతుంటే, ఇక మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యార్థిగా ఎలా మారతాడో ప్రభుత్వాలు చెప్పాలి? ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమాలు విడనాడాలి. ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవాలి. ●

## ప్రజావాక్కు



### మాటే మంత్రం

మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఓ రోజు ప్రముఖ సినీ నటుడు, ఎన్.టి.ఆర్. తనయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బావమరిది, హిందూపురం శాసన సభ్యుడు అయిన నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ కొంతమంది వ్యక్తుల మీదనోచ్చుకునే పదజాలాన్ని వాడారు. అందులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అయిన జగన్ మోహన్ రెడ్డినిఅనకూడని మాటలనడం, ప్రముఖ నటుడు, మెగాస్టార్ చిరంజీవి మీద తెచ్చిన ప్రస్తావన సభలోని వారికి, టి.వి. ముందు కూర్చుని యీ భాషణ విన్నవారికి బాధ కలిగించింది. ఆ రోజు అనారోగ్యంతో పవన్ కల్యాణ్, సభలో లేకపోవడం కాకతాళీయం. రాష్ట్రం మొత్తం ఆందోళనలను చేయడానికి సమాయత్తం అవగానే చిరంజీవి తన అభిమానులను వారించి కొత్త సమస్యలను తలెత్తకుండా ప్రశాంతతను కలిగించారు. మనుషుల మధ్య ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే మాటే మంత్రంగా పనిచేయాలి.

- ఎన్. రామలక్ష్మి సికింద్రాబాద్

### బాలల అక్రమ రవాణాకు పరిష్కారమేది?

మన దేశంలో బాలల అక్రమ రవాణా ఇంకా ఒక తీవ్రమైన, పరిష్కరించబడని సమస్యగా మిగిలిపోతోంది. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక బాలుడు లేదా బాలిక గల్లంతవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, స్వాతంత్ర్యం నుండి ఇప్పటివరకు కేంద్రం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని ఈసమస్యకు తగిన ప్రాధాన్యతను చూపలేదు. లక్షల సంఖ్యలో గల్లంతైన పిల్లల వివరాలు ఇంకా చీకటిలో మిగిలిపోవడం మన సమాజానికి బాధాకరం. పోలీస్ శాఖలు, బాలల సంక్షేమ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం ఈ ప్రయత్నాన్ని తక్కువ ప్రభావవంతంగా మార్చింది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### యుద్ధాన్ని ఆపలేరా?

ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో-పాక్‌ల మధ్య జరిగిన యుద్ధాన్ని నాలుగు రోజులలోనే ఆపేశానని చెప్పుకుంటున్న ట్రంప్ ఉక్రెయిన్, రష్యాఔ మధ్యయుద్ధాన్ని ఆపలేకపోయాడు. ఏ యుద్ధం జరిగినా ప్రపంచదేశాలన్నిమూల్యం చెల్లించుకోవాలి.

- ఎన్.రామారావు, నల్గొండ జిల్లా

### హింసను ఆపలేమా?

కర్నూలు జిల్లా దేవరగట్టులో ప్రతి సంవత్సరం దసరా రోజున జరిగే బన్నీ ఉత్సవం చారిత్రాత్మకమైనది. శక్తి, ఉత్సాహానికి ప్రతీకగా వందలాది మంది గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు కర్రలతో దాడిచేసుకోవడం ఈ ఉత్సవం ప్రత్యేకత. కానీ కాలక్రమేణా ఇది సాంప్రదాయ క్రీడగా కాకుండా ప్రమాదకర హింసగామారింది. ప్రతిసంవత్సరం డజన్లకొద్దీ గాయాలు, మరణాలు సంభవించడం దురదృష్టకరం. సాంప్రదాయం పేరుతో ప్రాణాలకు ముప్పు కలిగించే ఆచారం కొనసాగడమే విచారకరం. సాంస్కృతిక వైభవాన్ని కాపాడుకుంటూనే ప్రజల భద్రతను కూడా కాపాడడం అవసరం. పోలీసు, వైద్యసిబ్బంది నియామకం, అవగాహనకార్యక్రమాలు, ప్రత్యామ్నాయ పద్ధతులలో ఉత్సవాన్ని నిర్వహించే చర్యలుతీసుకోవాలి. యువతలో సహకారం, క్రమశిక్షణ పెరిగితే ఈ ఉత్సవం హింసాత్మక రూపం తగ్గుతుంది. ఆచారాన్ని గౌరవించడం తప్పు కాదు. కానీ దాని కోసం మానవ ప్రాణాలు బలవ్వకూడదు.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### సంస్థ నడవడికలో మార్పు అవసరం

ప్రపంచ దేశాల మధ్య శాంతి సౌభ్రాతృత్వం విలసిల్లేలా చేయడానికి వారధిలాగా ఉండే ఐక్యరాజ్యసమితి తన ప్రాసంగికతను కోల్పోతుంది. దానికి ప్రత్యక్ష ఉదాహరణే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కావొచ్చు, గాజా మారణకాండ కావొచ్చు, అయితే వీటి వెనుక అమెరికా ఉందని తెలిసిన సంస్థ నిస్సహాయంగా ఉండిపోయింది. మరోవైపు శాశ్వత సభ్యత్వ దేశాలు వర్ధమాన దేశాలకు ఇంచు మందం సందు ఇవ్వకుండా వాటికి శాశ్వత సభ్యత్వం రాకుండా అడ్డుకుంటున్నాయి. ఇది ఎంత మాత్రం కూడా ప్రపంచ దేశాల మధ్య సమిష్టి తత్వంను ఇచ్చేదిగా ఉండదు. మరి ఆఫ్రికన్ దేశాల నుండి ప్రధాన కార్యదర్శిని చేస్తే అయిన సంస్థ నడవడికలో మార్పు ఉంటుందా చూడాలి.

-భారత అవినాష్, జనగామ

### కాలనీ బోర్డులు అవసరం

తెలంగాణ రాష్ట్రంలో పట్టణాలు నగరాలలో కాలనీలకు జాతీయ నాయకుల పేర్లు పెట్టడం జరిగింది. అట్టి కాలనీలకు ప్రవేశద్వారం వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి. కాలనీ ప్రజల ఆర్థిక సహాయంతో బోర్డులు ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థల గ్రామ పంచాయతీల వద్ద నమోదు చేసుకోవాలి. ఈ విధానం వలన అడ్రస్ సులువుగా దొరుకుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

# జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహ నిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతు జాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో జంతువుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్నిరకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంతు సంక్షేమ సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోని యెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి. మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనప్పుడు మనిషి వద్ద ఎన్నిఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడగక ముందే తనకు కావలసిన కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డను ఇస్తున్న జంతువుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసీ ఫీస్ట్ డే" రోజు ప్రతి ఏటా 04 అక్టోబర్ ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం లేదా వరల్డ్ ఆనిమల్ వెల్ఫేర్ డే' నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80శాతం ఉభయచర జాతులు, 75శాతం పక్షిజాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి. నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని



భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలపడంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు, పునర్నిర్మాణానికి ప్రతి ఏటా 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో జంతు సంక్షేమ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. ప్రపంచ జంతు సంక్షేమ దినం 2025 ఇతివృత్తంగా జంతు సంరక్షణతో భూగృహ పరిరక్షణ (సేవ్ ఆనిమల్స్, సేవ్ ది ప్లానెట్) అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతోపాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచదేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది. ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించేకార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవ వైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టివిధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని చక్కదిద్దుకుందాం. ●


మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## భారత్‌పై ఒత్తిడితెస్తే
# అమెరికాకే నష్టం
### వాణిజ్యసదస్సులో పుతిన్ హెచ్చరిక



**మాస్కో, అక్టోబరు 3:** రష్యాతో ఇంధన వాణిజ్యం తగ్గించుకోవాలంటూ భారత్‌పై అమెరికా తెస్తున్న ఒత్తిడిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భారత్ ఎన్నటికీ బయటి శక్తుల ఒత్తిళ్లకు తలొగ్గదని, అలాంటి అవమానాన్ని ఎప్పటికీ సహించదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో అమెరికా వెనక్కి తగ్గకపోతే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకే భారీ నష్టం తప్పదని గట్టిగా హెచ్చరించారు. రష్యాలోని సోచి నగరంలో జరిగిన వాల్డాయ్ అంతర్జాతీయ చర్చా వేదికలో పుతిన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి భారత్ సహా 140 దేశాల నుంచి భద్రతా, భౌగోళిక రాజకీయ నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ భారత్‌తో మాకు ఎలాంటి సమస్యలు లేవు, ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తలేదు. ప్రధాని నరేంద్ర మోదీ నా స్నేహితుడు. ఆయన నాయకత్వంలో భారత్ ఎవరి ఒత్తిళ్లకూ లొంగదు. అమెరికా మాట విని రష్యా నుంచి ఇంధనం కొనడం ఆపేస్తే భారత్ దాదాపు 9 నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. అమెరికా చర్యలు ఆ దేశానికే నష్టం కలిగిస్తాయని పుతిన్ హెచ్చరించారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగిపోతాయని అన్నారు. ఇది అమెరికా ఫెడరల్ రిజర్వ్‌పై ఒత్తిడి పెంచి, వడ్డీ రేట్లను అధికంగా ఉంచేలా చేస్తుందని, తద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందని విశ్లేషించారు. భారత్ భారీగా ముడి చమురును దిగుమతి చేసుకోవడం వల్ల ఏర్పడిన వాణిజ్య అసమతుల్యతను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని పుతిన్ హామీ ఇచ్చారు. భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలను అధికంగా కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. డిసెంబర్ నెలలో జరగనున్న తన భారత పర్యటన కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పుతిన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ నీతిని పుతిన్ ఎండగట్టారు. అణు విద్యుత్ కోసం అమెరికాకు పెద్ద మొత్తంలో ఇంధనం అవసరం. వారికి యురేనియం సరఫరా చేస్తున్న దేశాల్లో రష్యా రెండో స్థానంలో ఉంది. ఓ వైపు మా నుంచి యురేనియం కొనుగోలు చేస్తూ, మరోవైపు ఇంధన వాణిజ్యం విషయంలో భారత్‌పై ఒత్తిడి తేవడం అమెరికా ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు.



గాంధీజయంతి సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మునిసమాధివద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము



మాజీప్రధానిలాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిసందర్భంగా ఢిల్లీలోనివిజయ్‌ఘాట్‌వద్ద నివాళులర్పిస్తు ప్రధాని మోడీ

# సర్‌క్రీక్ వైపు కన్నెత్తితే ఖబడ్దార్!

### పాక్‌ను హెచ్చరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
### కరాచీ దద్దరిల్లుతుందని వార్నింగ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** పాకిస్తాన్ సర్ క్రీక్ వద్ద దుస్సాహసాలకు పాల్పడితే కరాచీ ప్రాంతం దద్దరిల్లుతుందని దసరా నాడు రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరించడం సంచలనం సృష్టించింది. రక్షణ మంత్రి వద్ద ఏ సమాచారం లేకుండా అలా మాట్లాడరన్నది సుస్పష్టం. గత చరిత్రను పరిశీలిస్తే పాక్ ఇక్కడ దుస్సాహసాలకు పాల్పడిన చరిత్ర ఉంది. ఇదొక్కటే కాదు గుజరాత్‌లోని జునాగఢ్‌పై కూడా పాక్ కన్నేసింది. పాకిస్తాన్‌కు 1965 నాటికి అమెరికా కూటమి సెంటో ఆశీస్సులతో అత్యాధునిక ఎఫ్ - 86 ఎఫ్ సేబర్ జెట్లు, ఎం47, ఎం48 పట్టాన్ ట్యాంక్‌లు సహా పలు ఆయుధాలను సమకూర్చుకొంది. మరోవైపు భారత్ తీవ్రమైన కరవు, 1962లో చైనాతో యుద్ధంలో ఎదురుదెబ్బలతో ఇబ్బంది పడుతోంది. దీంతో తన అత్యాధునిక ఆయుధాలు వాడి భారత్ భూభాగాలను ఆక్రమించాలనే దుర్బుద్ధి పుట్టింది. తొలుత భారత్ శక్తిని అంచనా వేయడానికి ఓ పరీక్షలాగా 1965 ఏప్రిల్‌లో ఆపరేషన్ డిజర్ట్ హాక్ పేరిట రాణ్ ఆఫ్ కచ్‌లోకి పాక్ దళాలు దూసుకొచ్చాయి. భారత్ సైన్యం భీకరంగా ఎదురు దాడి చేసింది. చివరికి యుకే మధ్యవర్తిత్వంతో యథాతథస్థితిని నెలకొల్పారు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఆపరేషన్ జిబ్రాల్టర్ పేరిట కశ్మీర్‌ను ఆక్రమించుకొనేందుకు దాడి చేసి ఘోరంగా పరాజయం పాలైంది. కానీ ఈ యుద్ధంలో రాణ్ ఆఫ్ కచ్ వద్ద గుజరాత్ ముఖ్య మంత్రి బల్వంత్‌రాయ్ మెహతా ప్రయాణిస్తున్న బీచ్‌క్రాఫ్ట్ విమానాన్ని పాక్ జెట్‌లు కూల్చేశాయి. సర్‌క్రీక్‌పై పాకిస్తాన్ ఎప్పటి నుంచో కన్నేసింది. ఆ దేశ నౌకాదళానికి చెందిన బ్రెగ్వేట్ అట్లాంటిక్ విమానం 1999లో సరిహద్దులు దాటి సర్‌క్రీక్‌పై ప్రయాణించింది. నాడు భారత్‌కు చెందిన మిగ్ - 21 జెట్ దానిని కూల్చేసింది. ఈ ఘటనలో 16 మంది పాక్ నేవీ అధికారులు మరణించారు. కార్గిల్ ముగిసిన కొన్ని నెలల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఆ తర్వాత పాక్ మెరైన్ యూనిట్లను ఇక్కడికి తరలించింది. అదే ఏడాది భారత మిగ్‌పై ఓ క్షిపణిని ప్రయోగించింది. కానీ నాడు మన జెట్ దానిని సురక్షితంగా తప్పించుకొంది. 2020లో గుజరాత్‌లోని జునాగఢ్ కూడా తమదే అంటూ పాక్ కొత్త వాదనను తెర పైకి తెచ్చింది. దీనికి అనుకూలంగా నాటి ఇమ్రాన్ సర్కార్ తమ దేశ మ్యాప్‌లో ఆ ప్రాంతాన్ని చూపించడం మొదలుపెట్టింది. స్వాతంత్ర్యం లభించిన కొత్తల్లో జునాగఢ్ సంస్థానాన్ని తమలో విలీనం చేసుకోవాలని పాక్ తీవ్రంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. 2019 నుంచి పాక్ సర్‌క్రీక్ వద్ద భారీగా సైనిక మోహరింపులు చేపడు తోందని వీటిల్లో ఇన్‌ఫ్రాంటీ, యాంఫిబియస్ బెటాలియన్లు, నిఘా కోసం కోస్టల్ డిఫెన్స్ బోట్లు, ఎయిర్ డిఫెన్స్ యూనిట్లు వంటి వాటిని ఇక్కడికి తరలించింది. గుజరాత్ రాష్ట్రంలో సర్‌క్రీక్ రేఖ 96 కి.మీ. పొడవు, 1 - 3 కిలోమీటర్ల వెడల్పుతో వివాదాస్పద సరిహద్దు రేఖగా ఉంది.

## టొమాటో వైరస్
### మధ్యప్రదేశ్‌లో వెలుగులోకి
### 200పైగా కేసులు నమోదు - బాధితుల్లో చిన్నారులే అధికం



**భోపాల్, అక్టోబర్ 3:** మధ్యప్రదేశ్‌లో టొమాటో వైరస్ అనే కొత్త వ్యాధి వెలుగుచూసింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా కేసులు నమోదయ్యాయి. వైరస్ బాధితుల్లో అత్యధికులు చిన్నారులే కావడంతో ఆందోళనకు గురిచేస్తోంది. తొలుత ఆగస్టులో భోపాల్, ఇండోర్, జబల్‌పూర్‌లో వైరస్ వెలుగుచూడగా, తాజాగా రెండు నెలల్లోనే వందల మందికి వైరస్ సోకినట్లు వైద్యాధికారులు తెలిపారు. వైరస్ సోకిన వారి చేతులు, పాదాలు, అరికాళ్లు, మెడ కింద, నోటిలో ఎర్రటి దద్దుర్లు కనిపిస్తాయి. తర్వాత అవి బొబ్బలుగా మారుతున్నాయి. చిన్నారుల్లో దురద, మంట, నొప్పిగా అనిపించడంతోపాటు జ్వరం, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వైరస్‌ను 'హ్యాండ్ ఫుట్‌మోత్ డిసీజ్' (హెచ్‌ఎఫ్‌ఎండీ) రకంగా గుర్తించారు. ముఖ్యంగా 6 నుంచి 13 సంవత్సరాల వయసున్న పిల్లలలో ఈ వ్యాధి ప్రభావం అధికంగా కనిపిస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా పాఠశాలల్లో క్లస్టర్ కేసులుగా ఇది బయటపడింది. హెచ్‌ఎఫ్‌ఎండీ మామూలు సమస్యేనని, పెద్దగా ఆందోళన పడాల్సిన పనిలేదని వైద్యులు చెబుతున్నారు. వారం, పది రోజుల్లో దానంతటదే తగ్గిపోతుంది. దీనికి కారణమయ్యే వైరస్ చాలా వరకు మల విసర్జన తర్వాత చేతులు సరిగా కడుక్కోకపోవడం, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల వ్యాపిస్తుంది. ఇది సోకినవారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్లతోనూ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. లాలాజలం వంటి శరీర స్రావాలతోనూ సంక్రమిస్తుంది. వైరస్ సోకిన 3-6 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి.

## డ్రగ్‌స్మగ్లర్లను ఉగ్రవాదులుగానే పరిగణిస్తామన్న యుఎస్

**న్యూయార్క్, అక్టోబరు 3:** మాదకద్రవ్యాల ముఠాలతో (డ్రగ్స్ కార్టెల్స్) తాము ఒక అంతర్జాతీయేతర సాయుధ సంఘర్షణలో ఉన్నామని అమెరికా ప్రకటించింది. ఈ మేరకు ట్రంప్ ప్రభుత్వం తమ దేశ కాంగ్రెస్‌కు అధికారికంగా తెలియజేసింది. డ్రగ్స్ ముఠాలను ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తున్నామని, వాటిపై సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం అమెరికాలోనూ, అంతర్జాతీయంగానూ తీవ్ర చర్చకు దారితీసింది. గత నెల కరేబియన్ సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో అమెరికా సైనిక దళాలు మూడు పడవలను ముంచివేశాయి. వెనిజులా నుంచి వస్తున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ పడవలపై జరిపిన దాడిలో 17 మంది మరణించారు. మరణించిన వారిని చట్టవిరుద్ధ పోరాట యోధులుగా అభివర్ణించిన అమెరికా, తమ చర్యలను ఆత్మరక్షణగా సమర్థించుకుంది. వైట్ హౌస్ విడుదల చేసిన ఒక మెమో ప్రకారం, ఈ డ్రగ్స్ ముఠాలు దేశ సరిహద్దులు దాటి పశ్చిమార్ధ గోళం అంతటా అమెరికాపై నిరంతర దాడులకు పాల్పడుతున్నాయని, అందుకే వీటిని ఉగ్రవాద సంస్థలుగా గుర్తించామని పేర్కొంది.

## ఆ కత్తిపై ట్రంప్ కన్ను.. కాదన్నందుకు ఉద్యోగిపై వేటు!

**వాషింగ్టన్, అక్టోబరు 3:** అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి పదవిలోకి వచ్చాక.. తాను అనుకొన్నది జరగకపోతే అస్సలు ఊరుకోవడం లేదు. దీనికి సంబంధించి తాజాగా మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. ఆయన కన్ను ఓ మ్యూజియంలోని పురాతన కత్తిపై పడింది. దానిని ఐరోపాలోని ఓ రాజుకు బహూకరించాలనుకొని.. కత్తి పంపించమని ఆ మ్యూజియంకు కబురుపెట్టారు. ఆ మ్యూజియం నిర్వాహకుడు అది అమెరికా చారిత్రక సంపద అని, తాను ఇవ్వనని తేల్చిచెప్పాడు. అంతే.. ఉద్యోగంలో ఉంటావా.. పీకిపారేయాలా అని ట్రంప్ కార్యవర్గం నుంచి ఫోనొచ్చింది. అయినా సరే నిర్వాహకుడు ఆ కత్తి కోసం తన ఉద్యోగాన్నే వదులుకొన్నాడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెల బ్రిటన్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి రాజు చార్లెస్‌కు బహూకరించేందుకు ప్రెసిడెంట్ డ్వైట్ డి ఐసన్‌హోవర్ లైబ్రరీ అండ్ మ్యూజియంలో పురాతన ఖడ్గాల కలెక్షన్ నుంచి ఒక దానిని రాజుకు ఇవ్వాలని భావించారు. దీంతో విదేశాంగ శాఖ రంగంలోకి దిగి ఆ కత్తిని అప్పగించాలని కోరింది. వాస్తవానికి ఆయన కోరిన ఖడ్గం ఐసన్‌హోవర్‌కు 1947లో బహుమతిగా లభించింది. అప్పట్లో ఆయన అమెరికాకు చీఫ్ ఆఫ్ ది ఆర్మీగా పనిచేసేవారు. అప్పటి హాలెండ్ రాణి విల్‌హెల్మిన దానిని బహూకరించారు. దీంతో ఆ ఖడ్గాన్ని ట్రంప్‌నకు అప్పగించేందుకు లైబ్రరీ నిరాకరించింది. అది అమెరికా ప్రజల ఆస్తి అని తేల్చిచెప్పింది. దీంతో చేసేది లేక.. ట్రంప్ అలాంటి ఖడ్గం నమూనాను బ్రిటన్ రాజు చార్లెస్‌కు బహూకరించారు. ఆ పర్యటనను ముగించి తిరిగివచ్చాక సదరు లైబ్రరీ డైరెక్టర్ టోడ్ ఆరింగ్టన్‌కు వేధింపులు మొదలయ్యాయి. ట్రంప్ కార్యవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు చెలరేగాయి. దీనిని ఆరింగ్టన్ ఖండించారు.

## శబ్దంకంటే ఐదురెట్లు వేగంతో 'ధ్వని' హైపర్‌సోనిక్ క్షిపణి
### డిఆర్‌డిఒ పరీక్షలు విజయవంతం

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** భారత రక్షణ రంగంలో మరో సంచలనం రాబోతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన బ్రహ్మోస్ క్షిపణిని మించిపోయే అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని భారత్ సిద్ధం చేస్తోంది. 'ధ్వని' అనే పేరుతో దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఈ హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) వేగంగా అడుగులు వేస్తోంది. 'ధ్వని' క్షిపణి ధ్వని వేగం కన్నా ఐదారు రెట్లు అధిక వేగంతో ప్రయాణిస్తుంది. దీని వేగం గంటకు సుమారు 7 వేల కిలోమీటర్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ అసాధారణ వేగం 1500 నుంచి 2000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఇది అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. నిమిషాల వ్యవధిలోనే శత్రు స్థావరాలను ధ్వంసం చేసే సత్తా ఈ కొత్త అస్త్రానికి ఉంది. ఈ క్షిపణి ప్రత్యేకత కేవలం దాని వేగమే కాదు, ప్రయాణ మార్గంలో దిశను మార్చుకోగల సామర్థ్యం కూడా వుంది. ఈ కారణంగా శత్రు దేశాల గగనతల రక్షణ వ్యవస్థలు దీనిని గుర్తించి, అడ్డుకోవడం దాదాపు అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. సాధారణ క్రూయిజ్ క్షిపణుల్లా కాకుండా, దీనిని ముందుగా ఒక రాకెట్ బూస్టర్ సాయంతో అత్యంత ఎత్తుకు పంపిస్తారు. అక్కడ బూస్టర్ నుంచి విడిపోయిన ధ్వని గ్లైడ్ వెహికల్, సెమీబాలిస్టిక్ మార్గంలో హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యం వైపు దూసుకెళ్తుంది. ఇది రాడార్ల కంట పడకుండా ఉండేందుకు దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే థర్మల్ మేనేజ్‌మెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు వంటి కీలకమైన ప్రాథమిక పరీక్షలను డీఆర్‌డీఓ ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేసింది. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, హైపర్‌సోనిక్ టెక్నాలజీ కలిగిన అమెరికా, రష్యా, చైనా వంటి అగ్రరాజ్యాల సరసన భారత్ కూడా సగర్వంగా నిలుస్తుంది.

## సంక్షిప్తంగా..

### పిల్లల దగ్గుమందులో కలుషిత ఆనవాళ్లు లేవు: ఔషధ నియంత్రణ సంస్థ

**ఇండోర్, అక్టోబరు 3:** రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పెద్దలకు వాడే దగ్గు సిరప్‌ను ఇవ్వడంతో 11 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. పిల్లలకు ఇచ్చిన దగ్గు మందులో ఎటువంటి కలుషిత ఆనవాళ్లు లేవని ఔషధ నియంత్రణ సంస్థకు చెందిన అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి కలుషిత ఆనవాళ్లు గుర్తించలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో జనరిక్ దగ్గు సిరప్‌ను సరఫరా చేస్తారని, దానిపై తాము తాజాగా పరీక్షలు నిర్వహించామని తెలిపాయి. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఈ సిరప్‌ను జైపూర్‌కు చెందిన కేసన్స్ అనే ఔషధ సంస్థ తయారు చేస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. గత రెండేళ్లుగా ఈ సిరప్‌కు చేసిన నాణ్యతా పరీక్షల్లో 40 నమూనాలు విఫలమైనట్లు గుర్తించిన అధికారులు తాత్కాలికంగా నిషేధం విధించారు.

### అమెరికా వర్సిటీలకు ఇండో అమెరికన్ల విరాళాలు!




**వాషింగ్టన్, అక్టోబరు 3:** ఇండోఅమెరికన్లు అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు భారీగా విరాళాలు అందచేస్తున్నారు. విదేశీ విద్యార్థులను చేర్చుకోవడంపై అమెరికా అధ్యక్షుడు అక్కడి వర్సిటీలపై విధిస్తున్న ఆంక్షలకు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇండియాస్పోరా సంస్థ, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సంయుక్తంగా 2024 ఇంపాక్ట్ రిపోర్ట్ పేరుతో ఈ నివేదికను రూపొందించాయి. అమెరికా ఉన్నత విద్యావ్యవస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో భారతీయుల విరాళాలు ఏ విధంగా తోడ్పడుతున్నాయో ఈ నివేదిక వివరిస్తుంది. తమ కెరీర్ ప్రారంభానికి తోడ్పాటునందించిన కళాశాలల అభివృద్ధికి అనేకమంది ఇండోఅమెరికన్లు విరాళాల రూపంలో సహాయం చేస్తున్నారని ఇండియాస్పోరా ఛైర్మన్ ఎంఆర్ రంగస్వామి తెలిపారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో వారు విరాళాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి వచ్చేవారం భారత్ రాక

**కాబూల్, అక్టోబరు 3:** అఫ్ఘానిస్థాన్ విదేశాంగ మంత్రి అమిర్‌ఖాన్ ముత్తఖీ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయనపై ఉన్న అంతర్జాతీయ ప్రయాణ నిషేధం మినహాయింపునకు యుఎన్ ఆంక్షల కమిటీ అంగీకారం తెలపడంతో.. వచ్చే వారమే ముత్తఖీ భారత్‌కు రానున్నట్లు తెలిసింది. 2021లో అఫ్ఘానిస్థాన్‌లో అధికారం చేపట్టిన తర్వాత తాలిబన్ మంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. కాగా, ముత్తఖీ గత నెలలోనే భారత్‌లో పర్యటించాలని అనుకున్నారు. అయితే, ఆయనపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి విధించిన ఆంక్షలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఆయన విదేశీ పర్యటనలపూ కూడా నిషేధం ఉంది. విదేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక మినహాయింపులు అవసరం. దీంతో భారత్ పర్యటనకు తనకు మినహాయింపు ఇవ్వాలని కోరగా.. అందుకు ఆంక్షల కమిటీ ఒప్పుకోలేదు. దీంతో ఆ పర్యటన రద్దయింది. ఇప్పుడు ఆయన విజ్ఞప్తి మేరకు అంతర్జాతీయ ప్రయాణ ఆంక్షల నుంచి తాత్కాలిక మినహాయింపునకు అంగీకారం లభించినట్లు యుఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రకటించింది.

### ఇటలీలో రోడ్డుప్రమాదం, ఇద్దరు భారతీయులు మృతి



**రోమ్, అక్టోబరు 3:** ఇటలీలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. గ్రోసెటో పట్టణ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అవసరమైన సహాయం అందిస్తున్నామని ఇటలీలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. గురువారం ఆసియా పర్యాటకులతో వెళుతున్న తొమ్మిది సీట్ల మినీబస్సు, ఎదురుగా వస్తున్న ఒక వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, వారిలో ఇద్దరు భారతీయులు ఉన్నట్లు తెలిపారు.

## దుర్గామాత విగ్రహ నిమజ్జనంలో అపశ్రుతి
### ప్రమాదంలో 11 మంది దుర్మరణం

**భోపాల్; అక్టోబరు 3:** మధ్యప్రదేశ్‌లో దుర్గామాత విగ్రహ నిమజ్జన వేడుకల సందర్భంగా జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో 8 మంది చిన్నారులతో సహా మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గల్లంతయ్యారు. పండుగ పూట జరిగిన ఈ దుర్ఘటనతో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఖండ్వా జిల్లాలోని పంధానా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జమ్లి గ్రామంలో అత్యంత దారుణమైన ప్రమాదం చోటుచేసుకుంది. అర్దా, జమ్లి గ్రామాలకు చెందిన సుమారు 25 మంది భక్తులు దుర్గామాత విగ్రహంతో ట్రాక్టర్‌ట్రాలీలో నిమజ్జనం కోసం బయలుదేరారు. మార్గ మధ్యంలో ఓ ఇరుకైన కల్వర్టును దాటు తుండగా, అధిక బరువు కారణంగా ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీయగా, వారిలో 8 మంది చిన్నారులే ఉండటం అందరినీ కలచివేసింది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. చెరువులో మునిగిపోయిన ట్రాలీని బయటకు తీసేందుకు పొక్లెయిన్‌ను ఉపయోగించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## రాహుల్ వ్యాఖ్యలు భారత్ ప్రజాస్వామ్యంపై దాడి వంటివే!
### తీవ్రస్థాయిలో విరుచుకుపడిన బిజెపి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విదేశీ పర్యటన మరోసారి రాజకీయ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. కొలంబియాలో ఆయన చేసిన వ్యాఖ్యలు భారత ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నమని బిజెపి తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అధికారం చేజిక్కించుకోలేకపోతున్నామన్న నైరాశ్యంతోనే రాహుల్ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తింది. కొలంబియా పర్యటనలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ బ్రిటిషర్లు దేశభక్తుల ప్రాణాలు తీసినా, భారత స్వాతంత్ర్య సమరయోధులు హింసాత్మకంగా స్పందించలేదు అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యను బిజెపి తీవ్రంగా తప్పుపట్టింది. ఇలాంటి మాటలతో మంగళ్‌పాండే, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి విప్లవ వీరుల త్యాగాలను రాహుల్ అవమానించారని కమలం నేతలు మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలర్పించిన యోధులను కించపరచడం సరికాదని హితవు పలికారు. బిజెపి సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఈ విషయంపై ఘాటుగా స్పందించారు. 'భారత్‌లో సంపూర్ణ ప్రజాస్వామ్యం ఉంది. అందుకే మీరు దేశమంతా తిరుగుతూ ప్రధాని మోడీపై తప్పుడు ఆరోపణలు చేయగలుగుతున్నారు. కానీ విదేశాలకు వెళ్లి ప్రజాస్వామ్యం లేదనడం సిగ్గుచేటు. దేశాన్ని అవమానిస్తే, ఇప్పుడున్న సీట్లు కూడా ప్రజలు గెలిపించరనే విషయాన్ని రాహుల్ గుర్తుంచుకోవాలి అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీకి అధికారం కావాలని, ఓట్లు రావడం లేదనే అక్కసుతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బిజెపి శాఖ కూడా రాహుల్ వ్యాఖ్యలను ఖండించింది.

## యూట్యూబర్ ముసుగులో పాక్‌కు రహస్యాలు చేరవేత



### అదుపులోకి తీసుకున్న హర్యానా పోలీసులు

**చండీగఢ్, అక్టోబరు 3:** యూట్యూబర్ ముసుగులో దేశ రహస్యాలను శత్రుదేశానికి చేరవేస్తున్నాడనే సంచలన ఆరోపణలతో ఒక వ్యక్తిని హర్యానా పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి కీలక సమాచారం అందిస్తున్నాడనే పక్కా ఆధారాలతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఇదే తరహా ఆరోపణలతో మరో వ్యక్తిని అరెస్ట్ చేయగా, విచారణలో ఈ యూట్యూబర్ పేరు బయటకు రావడం కలకలం రేపుతోంది. హర్యానాలోని పల్వల్ జిల్లా, హథిన్ ప్రాంతంలోని కోట్ గ్రామానికి చెందిన వసీం అక్రమ్ అనే వ్యక్తి ఈ గూఢచర్యానికి పాల్పడ్డాడు. స్థానికంగా తన తండ్రికి ఆసుపత్రి నిర్వహణలో సాయం చేస్తూ, మేవాత్ ప్రాంత చరిత్ర, సంస్కృతిపై ఒక యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నాడు. ఇదే కేసులో సెప్టెంబర్ 26న అరెస్టయిన తౌఫీక్ అనే మరో నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా సీఐఏ పోలీసులు వసీంను అరెస్ట్ చేశారు. 2021లో పాకిస్థాన్ వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఢిల్లీలోని పాక్ హై కమిషన్ సిబ్బందితో వసీంకు పరిచయం ఏర్పడినట్లు దర్యాప్తులో తేలింది. అప్పటి నుంచి డానిష్ అనే పాక్ అధికారితో వాట్సాప్, ఇతర ఇంటర్నెట్ కాలింగ్ యాప్‌ల ద్వారా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు నాలుగేళ్లుగా ఐఎస్ఐ ఏజెంట్లతో టచ్‌లో ఉంటూ సున్నితమైన సమాచారాన్ని చేరవేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఒక పర్యటనలో వారికి సిమ్ కార్డును కూడా అందించినట్లు తేలింది. వసీం ఫోన్‌ను తనిఖీ చేయగా, పాక్ అధికారులతో జరిపిన వాట్సాప్ చాటింగులు లభించాయి. డిలీట్ చేసిన కొన్ని మెసేజ్‌లను తిరిగి పొందేందుకు సైబర్ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలను వసీం కుటుంబ సభ్యులు ఖండిస్తున్నారు. తమ కుమారుడు ఎప్పుడూ పాకిస్థాన్‌కు వెళ్లలేదని, కేవలం యూట్యూబ్ ఛానల్, ఆసుపత్రి పనులు మాత్రమే చూసుకుంటాడన్నారు.



గురువారం గాంధీభవన్‌లో మహాత్మాగాంధీ, లాల్‌బహద్దూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

## గాంధీ సత్యాగ్రహం, శాస్త్రి పోరాట పటిమ మనకు ఆదర్శం

### నివాళులు అర్పించిన పిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** దేశంలోనెలకొన్న విభజన రాజకీయాలను ఎదుర్కొనడానికి గాంధీ సత్యాగ్రహంను ఎల్‌బిశాస్త్రీ పోరాట పటిమను మనం ఆదర్శంగా తీసుకోవాలని పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం గాంధీభవన్‌లో మహాత్మా గాంధీ 156వ జయంతి, సర్గీయ ప్రధాని లాల్‌బహద్దూర్‌శాస్త్రీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి ఎల్‌బిశాస్త్రీ చిత్రపటానలికి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పూలతో నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా గాంధీజీ చూపించిన అహింసా మార్గం, సత్యాగ్రహ స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకం అని మహేష్ పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో గాంధీ ఆలోచనలు నిత్యం వెలుగు నిస్తాయని, ఆయన ఆశయాల సాధనకై అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కష్టాల్లో మొన్నజొన్న రైతు

### అడ్రసులేని కొనుగోలు కేంద్రాలు

### ప్రైవేటు వ్యాపారులదే ఇష్టారాజ్యం

### భారీగా నష్టపోతున్న రైతాంగం

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వివిధ పంటలకు మద్దతు ధర నీటి మూటే అయింది. ఇప్పటికే మండీల్లో పత్తి ధరల్లో వ్యాపారులు కోత పెడుతూ రైతులను దోపిడీ చేస్తుండగా, తాజాగా అదే పరిస్థితి మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోని రైతులు మొక్కజొన్నకు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తుంది. దీనికి తగినట్లుగా వర్షాల నుంచి మొక్కజొన్నను కాపాడుకోవడం కత్తిమీద సామే అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 5,73,648 ఎకరాలు కాగా, ఈ ఖరీఫ్ సీజనులో 118.79 శాతం మేర 6,81,432 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది ఇదే సీజనులో 5,69,305 ఎకరాల్లో సాగు కాగా, అంతకన్నా ఈసారి 1.12 లక్షల ఎకరాల్లో ఎక్కువగా మొక్కజొన్న సాగు చేయడం విశేషం. అత్యధికంగా రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లాలో 96,882 ఎకరాల్లో, రంగారెడ్డిలో 68,654 ఎకరాల్లో, మహబూబాబాద్ 62,566 ఎకరాలు, నాగర్ కర్నూలులో 56,906 ఎకరాలు, నిజామాబాద్ 52,093 ఎకరాల్లో, కామారెడ్డిలో 50,728 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో 37,700 ఎకరాలు, జగిత్యాలలో 32,463 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు, అయితే ఇటీవల కాలంలో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు నిజామాబాద్, కామారెడ్డి, కొత్తగూడెం తదితర జిల్లాలో మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది. వర్షాలతో ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసి ముద్దైంది. దీంతో మొక్కజొన్న పంట రంగు మారుతుంది. గింజ ఆరక ముందే నానడంతో గింజలకు మొలకలొచ్చే ప్రమాదం ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో దళారుల ఆధిపత్యం కొనసాగుతోంది. సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యతను బూచీగా చూపించి దళారులు క్వింటాకు రూ.1,600ల నుంచి రూ.1,900 ల వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం మొక్క జొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.2,400 లు ప్రక టించింది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు మాత్రం తమ ఇష్టానుసారంగా మొక్కజొన్నకు ధర డిసైడ్ చేసి వారు అనుకున్న రేట్లకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. నిజామాబాద్ తదితర జిల్లాల్లో రైతులు పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చి దాదాపు కోతలు కూడా పూర్తి కావస్తున్నాయి. అయినా ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. కోతలు కోసి గింజను రోడ్లపై ఆరబెట్టుకున్న రైతులు వర్షాల భయంతో దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కూడా మొక్కజొన్న కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రభుత్వం ప్రారం భించే కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవు తాయో గ్యారంటీ లేదనే అభిప్రాయంతో తక్కువ ధరకైనా అమ్ముకునేందుకు రైతులు దళారుల వైపే మొగ్గు చూపుతున్నారు.



మహాత్మాగాంధీ సమాధికి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర నాయకులు.

### జాతిపిత మహాత్ముడికి

## గవర్నర్, ముఖ్యమంత్రి ప్రత్యేక నివాళులు

**హైదరాబాద్ (మెహిదీపట్నం), అక్టోబరు 3, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మా గాంధీ 156 జయంతి సందర్భంగా బాపూఘాట్ లో బాపు సమాధి వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ప్రత్యేక నివాళులర్పించిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు తదితరులు మహాత్మా గాంధీ సమాధికి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ మ్యూజియం హాల్లో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. గాంధీ విగ్రహం వద్ద కూడా పుష్పగుచ్చాలు చల్లి నివాళులర్పించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, సిపి సజ్జనార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు

### భౌతికకాయానికి సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి, మండలి చైర్మన్, మంత్రులు, కూనంనేని నివాళులు



శుక్రవారం జూబ్లీహిల్స్‌లో మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 3:** మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం దామోదర్ రెడ్డి మృతి చెందారు. శుక్రవారం ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కూడా నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డి పార్థివ దేహానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్‌రెడ్డి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఉమ్మడి నల్లగొండ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప నాయకులు దామోదర్‌రెడ్డి అన్నారు. దామోదర్‌రెడ్డి మరణం వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీకి సైతం తీరని లోటని పేర్కొన్నారు. అంతకు ముందు కోదండరెడ్డి మాట్లాడుతూ, దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టామని అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఆయనకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, కోలుకుని తిరిగి పార్టీలో క్రియాశీలకంగా ఉంటారని తాము భావించామని అన్నారు. ఆయన మృతి నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ నివాళులర్పించారు. దామన్న నాకు అత్యంత సన్నిహితుడని., కాంగ్రెస్ పార్టీలో సాధారణ కార్యకర్త నుండి మంత్రి వరకు ఎదిగినా.. ఒదిగి ఉన్న నేత అని మంత్రి పొన్నం అన్నారు. 5 సార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. నేడు రాజకీయాల్లోకి వచ్చే యువతకి ఆయన జీవితం ఆదర్శమని, వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు ప్రగడ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి పట్ల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. .నల్గొండ జిల్లాలో నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజలకు అంకితభావంతో సేవలందించిన దామోదర్‌రెడ్డి సూర్యాపేట, తుంగతుర్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. 1985 నుండి 2009 వరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం ఆయన ప్రజాభిమానానికి నిదర్శనమని అన్నారు. నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రిగా రాష్ట్రానికి నూతన దిశ చూపారని తెలిపారు. దామోదర్‌రెడ్డి పార్థివ దేహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డైరీ దెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి నివాళులు అర్పించారు. రామిరెడ్డి దామోదర్ రెడ్డి భౌతిక కాయానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ, సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి సయ్యద్ అజిత్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేవిఎల్ నివాళులర్పించారు. రామిరెడ్డికి మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ నివాళులు అర్పించారు. కాగా, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం తుంగ తుర్తిలో ఉదయం 11 గంటలకు జరుగనున్నాయి. కుటుంబ సభ్యులు ఆయన పార్థివదేహాన్ని హైదరాబాద్ నుంచి శుక్రవారం రాత్రి తుంగతుర్తికి తరలించారు.

## మహాత్మాగాంధీ, జూబ్లీబస్‌స్టేషన్లను సందర్శించిన ఆర్టీసి ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), అక్టోబరు 3, ప్రభాతవార్త:** ప్రయాణికులకు మరింత సౌకర్యవంతైమన వాతావరణం కల్పించేందుకుగాను టి.జి.ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది కృషి చేయాల్సి న అవసరం,భాద్యత ఎంతైనా ఉందని టి.జి.ఆర్.టి.సి మేనేజిండ్ డైరెక్టర్ నాగిరెడ్డి(ఐపిఎస్)అన్నారు. ఈమేరకు నూతనంగా ఆర్.టి.సి ఎండిగా బాధ్యతలు చేపట్టిన మొట్ట మొదటిసారిగా ఆయన ఆర్‌టిసి అధికారులతో కలిసిమహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జూబ్లీ బస్ స్టేషన్‌లను సందర్శించారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆర్‌టిసి అధికా రులు సాధారణంగా స్వాగతం పలికారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్ర హానికి పూల మాలవేసి నివాళులు ఆర్పించారు. అనంతరం అధికారులతో కలిసి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోని ప్రధానంగా ప్రయాణికుల సౌకర్యాలను సమ గ్రంగా పరిశీలించారు. శుభ్రత, తాగునీటి సౌకర్యం, కూర్చునే సదు పాయాలు, మరుగుదొడ్లు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను ప్రత్యేకంగా సమీక్షించారు. అక్కడి నుంచి బస్సులో ప్రయాణికులను ఆర్‌టిసి రాక పోకలను అడిగి తెలుసుకున్నారు. టి.జి.ఆర్.టి.సి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి (ఐపిఎస్) అధికారులతో కలిసి సమావేశం నిర్వహించి ప్రయాణికుల సౌకర్యాలను, మెరు గుదల బస్సుల సమయపాలన, సిబ్బంది క్రమశిక్షణ, ప్రయాణికుల సంతృప్తి కోసం తీసుకోవాల్సి న చర్యలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందిం చేందుకు ఆర్‌టిసి ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. సమా వేశంలో ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్) మునిశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీర్) వెంకన్న, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హైదరాబాద్ జోన్) ఖుస్రుషా ఖాన్, జాయింట్ డైరెక్టర్ (విఎస్) నర్మద, సి.టి.ఎం రీజినల్ మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా గాంధీజయంతి వేడుకలు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు గురువారం డిజిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డితోపాటు శాంతిభద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌సహా డిజిపి కార్యాలయ అధికారులు జాతిపిత ఫోటోకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జాతిపిత సేవలను వారు స్మరించుకున్నారు.

## ఇఇఎస్ఎల్ అడ్వయిజర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) జాతీయ సలహాదారునిగా ఎ చంద్రశేఖర్‌రెడ్డిని నియమించింది. ఈ పదవిలో అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో సంస్థ కార్యక్రమాల ప్రచారం, ప్రభుత్వ శాఖలతో సమన్వయం, మీడియా, ప్రజా సంబంధాలను బలోపేతం చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ)కి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మీడియా సలహాదారునిగా పనిచేశారు. ఈఈఎస్ఎల్ సలహాదారునిగా తనకు అవకాశం కల్పించడం పట్ల సంస్థ సిఇఒ అఖిలేశ్‌కుమార్ దీక్షిత్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంధన పొదుపు ప్రాధాన్యతను పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పత్తి కొనుగోళ్లకు మార్గదర్శకాలు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి అమ్మకాలు ప్రారంభమైన నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సీసీఐ ) రైతులకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈసారి పత్తి కొనుగోలుకు సంబంధించి నియమాలను కఠినతరం చేసింది. పత్తిలో తేమ 12 కన్నా ఎక్కువ శాతం ఉంటే కొనుగోళ్లకు అనుమతించబోమని తెలిపింది. ఇదే సమయంలో తేమ శాతం 8 శాతం కన్నా తక్కువ ఉంటే ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేసింది. అదే తేమ శాతం 8 నుండి 12 మధ్య ఉంటే ధర నిష్పత్తి ప్రకారం తగ్గుతుందని తెలిపింది. కనుక రైతులు పత్తి అమ్మే ముందు తగు జాగ్రత్తలు తీసుకుని సీసీఐ నియమాలు పాటించలని తెలిపింది. పోయిన సంవత్సరం ఇలానే తేమ శాతం అంశంలో మధ్యలో మార్పులు చేయడం వల్ల చాలా రాష్ట్రాల్లో ఈ అంశం వివాదాస్పదం అయ్యింది. అందుకే ఈ సంవత్సరం పత్తి అమ్మకాలు ప్రారంభం కావడానికి నెల రోజుల ముందే మార్గదర్శాలు జారీ చేసింది.

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అడ్మిషన్లకు నోటిఫికేషన్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడు స్తున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో ఒకటవ తరగతి నుంచి ఆ రవ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు డిజిపి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. చదువలతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో అత్యుత్తమ బోధన అందించేందుకు ఏర్పాటైన ఈ స్కూల్‌లో పరిమిత సంఖ్యలో సీట్లు వున్నందున ఆసక్తిగల వారు 9059196161 నంబర్‌ను సంప్రదించాలని డిజిపి కార్యాలయం కోరింది. దీంతోపాటు వైపిపి స్కూల్.ఇన్ వెబ్‌సైట్‌లోనూ వివరాలు తెలుసుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మానసిక వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్(పేట్‌బషీరాబాద్), అక్టోబరు 3, ప్రభాతవార్త:** ఇంటర్ చదివే ఓ విద్యా ర్థినిని తన పెదనాన్న పెడుతున్న మానసిక వేధింపులు భరించలేక ఆత్మ హత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుమంది. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భర్త చనిపోయిన ఓ మహిళ తన ఇద్దరు ఆడ పిల్లలతో కలిసి కొంపల్లిలో నివాసం ఉంటున్నది. వారు ఉం టున్న ఇంటిని కాజేయాలని, ఆ మహిళను, తన ఇద్దరు పిల్లలను ఇంటి నుంచి ఎలాగైనా బయటికి పంపించాలని, ఆ మహిళ బావ శీను మానసికంగా వారిని హింసించేవాడు. గురువారం తల్లి ఇంట్లో లేని సమ యంలో శీను తన పెద్దకూతురు (ఇంటర్ విద్యార్థిని) తనపై చేసిన దౌర్జ న్యాన్ని భరించలేక, తన తండ్రి చనిపోయిన తర్వాత అతనికి రావలసిన డబ్బు కోసం, ఇంటి కోసం సొంత పెద్దనాన్న అందరిముందు అవమానపర చాడని మానసికంగా కుంగిపోయింది. ఈ వేధింపులు భరించలేక ఆ విద్యార్థిని సూసైడ్‌నోట్ రాసి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మరణానికి కారణమైన శీనును కఠినంగా శిక్షి ంచాలంటూ మృతురాలి తల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు

## ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

### 6న హెచ్ఎండిఎ కార్యాలయం ముందు నిర్వాసితులతో ధర్నా

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఆలైన్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. 2013 చట్టం ప్రకారం పేద రైతులకు న్యాయం చేయాలని, ఈ నెల 6న తమ పార్టీ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ ముందు నిర్వాసితులతో ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్ఆర్ఆర్ ఆలైన్‌మెంట్ మార్పు, ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలు, ఆరోపణలతో పాటు నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలనీ, 2013 చట్టం ప్రకారం పేద రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులతో మాట్లాడకుండా, గ్రామ సభలు, నిర్వహించకుండా, భూమి సేకరణలో స్పష్టతనివ్వకుండా బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నం చేస్తే రైతుల నుండి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మొత్తం 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో 100 మీటర్ల వెడల్పుతో ఆ రోడ్డును నిర్మించాలని హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు.. దీనికోసం భూములు తీసుకుంటామనీ, రైల్వే ట్రాక్ కోసం మరొక 40 అడుగుల వెడల్పుతో రోడ్డును పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నదని తెలిపారు. ఇంతకు ముందు మొదటి అలైన్ మెంట్ తయారు చేశారనీ, తర్వాత దాన్ని మార్చి రెండోసారి ఆలైన్ మెంట్, ఇప్పుడు మూడో అలైన్‌మెంట్‌ను తయారు చేసి విడుదల చేశారని చెప్పారు. ఇందులో రాజకీయ అండదండలు, డబ్బు, పలుకుబడి ఉన్న వారి భూముల జోలికి వెళ్లకుండా, ఎకరం, రెండు, మూడెకరాలున్న చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన భూములున్న ప్రాంతాన్నే రింగ్ రోడ్డు కోసం తీసుకుంటున్నట్లుగా పెద్దఎత్తున ఆరోపణ లొస్తున్నాయని గుర్తు చేశారు.

## తమిళనాడు జెన్కోకు 2.88 మిలియన్ టన్నుల బొగ్గు

### ఒప్పందం చేసుకున్న సింగరేణి

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** ఒడిశా లోని సింగరేణికి చెందిన నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పోరేషన్‌కు ( తమిళనాడు జెన్కో) బొగ్గును సరఫరా చేసేందుకు రెండు సంస్థల మధ్య అంగీకారం కుదిరింది. నైనీ బ్లాక్ నుంచి ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు గాను తమిళనాడు జెన్కో తో సింగరేణి త్వరలో ఇంధన సరఫరా ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం తమిళనాడు పవర్ జనరేషన్ కార్పోరేషన్ ఎండీ ఎం.గోవిందరావు, సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ మధ్య చర్చలు జరిగాయి. తమిళనాడులోని తుత్తుకూడి జిల్లా ఉడింగిడిలో ఉన్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ప్రతీ ఏడాది 2.88 మిలియన్ టన్నుల జీ11 బొగ్గు అవసరముందని జెన్కో పేర్కొంది. ఇందుకు అవసరమైన బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయాల్సిందిగా కోరారు. దీనికి బలరామ్ స్పందిస్తూ ఒడిశా లోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో రైలు, జల మార్గంలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేయాల్సిందిగా నైనీ అధికారులకు సూచించారు. ఇదే సమయంలో తమిళనాడు జెన్కో తో మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా బొగ్గు రవాణా, మార్కె టింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేంతవరకు పోరాడుతాం

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేంత వరకు పోరాటం కొనసాగుతుందని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు స్పష్టం చేశారు శుక్రవారం ఆయన హైదరాబాదులోని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించి బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి, గవర్నర్‌కి పంపితే ఆరు మాసాలు దాటినప్పటికీ ఆ బిల్లుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడానడరు. 42 శాతం రిజర్వేషన్లను బిసిలకు ఇస్తే ఆ క్రెడిట్ మొత్తం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందనే భయంతో బిజెపి వెనకడుగు వేస్తోందని విమర్శించారు. షెడ్యూల్ 9లో బిసి బిల్లును చేర్చకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డు పడుతుందనే విషయాన్ని బిసిలందరూ గ్రహించారని తగు సమయంలో తగు మూల్యం చెల్లించుకునేందుకు బిజెపి పార్టీ సిద్ధంగా ఉండాలని ధనుంజయ నాయుడు హెచ్చరించారు.. అక్టోబర్ 8న హైకోర్టు తీర్పు తర్వాత బిసి సంఘాలను సమీకరించి భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించి తగు కార్యాచరణ రూపొందిస్తామని ఆయన మీడియాకు తెలిపారు

### సోషల్ మీడియా, వార్తా సంస్థలను ఆదేశించిన బాంబే హైకోర్టు

## 'మలబార్ గోల్డ్ డైమండ్స్'కు పరువు నష్టం కలిగించే కంటెంట్ తొలగించండి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 3:** యునైటెడ్ కింగ్డమ్ (యుకె)లో మలబార్ గోల్డ్ డైమండ్స్ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవానికి సంబంధించి ప్రచురించబడిన పరువు నష్టం కలిగించే అన్ని పోస్ట్‌లు, హానికరమైన కంటెంట్‌ను తొలగించాలని బాంబే హైకోర్టు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను, న్యూస్ ఏజెన్సీలను ఆదేశిం చింది. తమ బ్రాండ్‌లను లండన్‌లో ప్రమోట్ చేయ డానికి, స్థానిక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సేవలను ఉపయోగించుకున్న మలబార్ గోల్డ్ డైమండ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియ ప్లాట్‌ఫామ్స్‌లో ఒక దుర్మార్గపు ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి వ్యతిరేకంగా మలబార్ బ్రాండ్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా, కొన్ని మీడియా గ్రూపులు, సోషల్ మీడియా సంస్థలు వారి ప్లాట్‌ఫామ్స్ వెబ్‌సైట్స్ నుండి అటువంటి పరువు నష్టం కలిగించే వార్తలు, నివేదికలను వెంటనే ఉపసంహరించుకోవాలని, తొలగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. యూకేలోని బర్మింగ్‌హామ్‌లో మలబార్ గోల్డ్ డైమండ్స్ తమ కొత్త షోరూమ్‌ను ప్రారంభించినప్పుడు, మలబార్ ప్రమోషనల్ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ఒక కంపెనీని నియమించుకుంది. బ్రాండ్ ప్రమోషన్ కోసం సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను ఎంపిక చేసే బాధ్యత ఈ స్థానిక కంపెనీదే. కొన్ని స్వార్థపూరిత ఆసక్తిగల గ్రూపులు, మలబార్ బ్రాండ్ విలువను, ఖ్యాతిని దెబ్బతీసేందుకు ఈ పండుగ సీజన్‌లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలు, పరువు నష్టం కలిగించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని కోర్టులో వాదించింది. మలబార్ గోల్డ్ డైమండ్స్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది నౌషాద్ ఇంజనీర్, ఆ జ్యువెలరీ గ్రూప్ బ్రాండ్ ప్రమోషన్ కోసం యుకెకి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ సేవలను ఉపయోగించుకున్నందుకు, మలబార్ సంస్థ పోటీదా రులు అలాంటి దురుద్దేశపూరిత ప్రచారాలకు పూనుకో రాదని వాదించారు. ఈ వాదనలను అంగీకరిస్తూ, అటువంటి చర్యలకు వ్యతిరేకంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ వి మార్నే తీవ్ర హెచ్చరిక జారీ చేశారు, పబ్లిక్ డొమైన్‌లో ప్రచురించబడిన అన్ని పరువు నష్టం కలిగించే వార్తలు, సమాచారం, కంటెంట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తొలగించాలని సంబంధిత మీడియా సంస్థలను ఆదేశించారు. ఈ విషయంలో ఏదైనా ముద్రిత సమాచార ప్రచురణను కూడా హైకోర్టు ఉత్తర్వు నిషేధిం చింది. మీడియా సంస్థలు మెట ప్లాట్‌ఫామ్‌లు (ఫేస్‌బుక్, వాట్సాప్,ఇన్‌స్టాగ్రామ్), గూగుల్ (యూట్యూబ్), ఎక్స్ (గతంలో ట్విట్టర్), న్యూస్ ఏజెన్సీలు ది పాంప్లెట్, ఓన్లీ ఫ్యాక్ట్, లేటెస్ట్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ, ఎబిసి మలయాళం న్యూస్, జబ్ స్టూడియోస్, వ్యక్తులు అశోక్ కుమార్ ఉన్నారు. ఈ కేసు వాదనల్లో మలబార్ గోల్డ్ డైమండ్స్ తరపున సీనియర్ న్యాయవాది నౌషాద్ ఇంజనీర్‌తో పాటు, న్యాయవాదులు అమృత్ జోషి, ప్రేమ్‌లాల్ కృష్ణన్, ఉసాద్ ఉద్వాడియా, రెహమత్ లోఖండ్‌వాలా, అబుజార్ ఖాన్ హాజరయ్యారు. 1993లో స్థాపించబడిన మలబార్ గోల్డ్ డైమండ్స్, ప్రముఖ వైవిధ్యభరితమైన భారతీయ వ్యాపార సమ్మేళన సంస్థ అయిన మలబార్ గ్రూప్ ప్రధాన సంస్థ. 7.36 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్‌తో, ఈ కంపెనీ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 5వ అతిపెద్ద ఆభరణాల రిటైలర్ గా డెలాయిట్ లగ్జరీ గూడ్స్ వరల్డ్ ర్యాంకింగ్‌లో 19వ ర్యాంక్ పొందిన బ్రాండ్ గా ప్రఖ్యాతిగాంచింది. భారతదేశం, మిడిల్ ఈస్ట్, ఫార్ ఈస్ట్, యూఎస్ఏ, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలు, హోల్‌సేల్ యూనిట్లు, కర్మాగారాలతో పాటు, 14 దేశాలలో 400 అవుట్‌లెట్లతో బలమైన రిటైల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఎప్పుడైనా, ఎక్కడి నుండైనా వినియోగదారులు తమకు నచ్చిన ఆభరణాలను సౌకర్యవంతంగా కొనుగోలు చేయడానికి వెబ్ సైట్ బ్రౌజ్ చేసి ఆన్‌లైన్ షాపింగ్ చేసే అవకాశాన్ని కల్పించింది. పర్యావరణ, సామాజిక పాలన (ఈఎస్‌జి) సూత్రాల పట్ల మలబార్ గ్రూప్ స్థాపించినప్పటి నుండి బలమైన ప్రాథమిక నిబద్ధతను కలిగియున్నది. తమ స్థిరమైన వ్యాపార సూత్రా లను ప్రధాన వ్యాపారానికి అనుసంధానిస్తూ, ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఆకలి లేని ప్రపంచం, విద్య, పర్యావరణం మహిళా సాధికారత మొదలగు సామాజిక సేవా కార్యకలాపాల పట్ల మలబార్ గ్రూప్ ముఖ్యంగా దృష్టి సారిస్తోంది.

# మేడిగడ్డ పునరుద్ధరణపై చిగురించిన ఆశలు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ పునరుద్దరణపై ఆశలు చిగురిస్తున్నాయి. మేడిగడ్డ కుంగుబాటు,అన్నారం సుందిళ్ళ బ్యారేజిలకు బుంగలు పడటంతో ఇన్నాళ్ళు ఆ ప్రాజెక్టు భవితవ్యంపై తెలంగాణ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొంది. మేడిగడ్డ బ్యారేజిని పునరుద్దరణకు రూర్కీ ఐఐటి సౌజన్యంతో సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతు చేపడుతామని ఆ బ్యారేజి నిర్మాణ సంస్థ ముందుకు వచ్చినా జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ విముఖత వ్యక్తం చేసింది. బ్యారెజ్ డిజైన్ల విషయంలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సిడిఎస్) తీరును కూడా జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికారసంస్థ వ్యవహారశైలిని కూడా ఎన్‌డిఎస్‌ఏ తన తుదినివేదికలో తీవ్రంగా అభిశంసించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చివరకు సిడివోతోనే బ్యారేజి పునరుద్దరణ చేయడానికి ముందుకు వచ్చినా తమకు తగినంత అనుభవంలేదని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ చేతులు ఎత్తేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు పునరుద్ధరణ పనులకు సంబంధించి డిజైన్లను సమకూర్చేందుకు అనుభవమున్న ఏజెన్సీల నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం ప్రారంభించడంతో వందలాది కోట్లతో కట్టిన నిర్మాణాలు ఇక వృధాకావని భరోసా తెలంగాణ ప్రజలలో నింపుతూ ఒక శుభసంకేతంను ప్రభుత్వం పంపింది.. మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20 పిల్లర్ రెండేళ్ళ క్రితం కుంగిపోయింది. దానిపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే పూర్తిస్థాయి నివేదికను సమర్పించింది. అంతేకాదు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పటిష్టతకు చేపట్టాల్సిన తదుపరి చర్యలను ఇరిగేషన్‌శాఖకు వివిధ రకాలైన సిఫారసులు చేసింది. ఎన్‌డిఎస్‌ఏ సూచనలను అనుసరిస్తూ బరాజ్‌ల నిర్మాణంలో, పునరుద్ధరణ పనుల్లో అనుభవమున్న ఏజెన్సీలను కన్సల్టెన్సీగా ఏర్పాటు చేసుకోవాలని సర్కారు నిర్ణయించింది. అందులో భాగంగా బుధవారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఎన్డీఎస్ఏ సిఫారసుల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ పనులకు డిజైన్లను సమకూర్చేందుకు

## మరమ్మతుతో ప్రయోజన వ్యక్తీకరణ చేసే సంస్థలతో ఒప్పందం

### సిడబ్ల్యుసి ఆమోదంతో మరమ్మతు దిశగా అడుగులు

అనుభవం, ఆసక్తి ఉన్న ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. బ్యారేజిల పటిష్టతపై మదింపు, హైడ్రాలజీ, హైడ్రాలిక్ రివ్యూ, వరదలు, భూకంపాలు వంటి విపత్తులను ఎదుర్కోవడంలో బ్యారేజిల ఉన్న సామర్థ్యం మదింపు చేయడంతో మరమ్మతు వల్ల కలిగే ప్రయోజనాలను కూడా వ్యక్తికరణ చేయాల్సి ఉంటుంది. గేట్లు, పియర్లు, స్టిల్లింగ్ బేసిన్, కటాఫ్ వాల్స్ వంటి బ్యారేజిలోని కీలక విభాగా లను పటిష్టం చేసేందుకు డిజైన్లు అందించడం వంటి సేవలపై ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను 15వ తేదీ నాటికి ఏజన్సీలు ని వెల్లడించాలని, వివరాలకు ఇరిగేషన్ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని తెలిపింది. ఎంపికైన సంస్థ అందించే డిజైన్లు, డ్రాయింగ్స్‌కు కేంద్ర జల సంఘం ఆమోదం తెలపాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మరమ్మతుకు ఆసక్తి చూపే కంపెనీ గత 15 ఏళ్లలో కనీసం ఒకటి రెండు ప్రాజెక్టుల పునరుద్ధరణ కోసం ఇలాంటి పనులు చేసి ఉండాలంటూ అర్హతలను నిర్దేశించింది. ప్రస్తుత బ్యారేజిలోని డిజైన్‌తో పాటు ఎన్‌డిఎస్‌ఎ నివేదికల్లోనిసిఫారసులకు అనుగుణంగా మరమ్మతులు చేపడితే భవిష్యత్‌లో గోదావరి నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి జియోటెక్నికల్, జియోఫిజికల్ వంటి పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణంగా బ్యారేజిని పటిష్టపరిస్తే మిగితా ప్రాజెక్టుల వలె అది కూడా బలోపేతంగా తయావు తుందని ప్రజలు ఆశిస్తున్నారు. డైమాండ్ కట్టింగ్ అను సరించి బ్యారేజిలోని ఏడవ బ్లాక్‌నుపూర్తిగా తొలగించే అవకాశాలు కూడా చర్చించే అవకాశం ఉంది.



## భక్తుల పుణ్యస్నానాలతో ముగిసిన చక్రస్నానమహోత్సవం

**తిరుమల,అక్టోబర్ 3ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరు మలలో తొమ్మిదిరోజులు జరిగిన శ్రీవారి సాలకట్లవార్షిక బ్రహ్మోత్స వాలుచివరిరోజు గురువారం ఉదయం చక్రధారుడి చక్రస్నాన మహోత్సవంతో వైభవంగా ముగి శాయి. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలా చరించారు. ఉద యం 6గంటల నుండి 9గంటల వరకు శ్రీభూవరాహస్వామి ఆలయం ముఖమండపంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారికి శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో ముందుగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ,ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం,రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాదనివేదనలో భాగంగా పాలు,తేనె, కొబ్బరినీళ్ళు ,పసుపు,గంధంతో స్నపనం నిర్వహించారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను పెద్దజియ్యర్‌స్వామి, చిన్నజియ్యర్‌స్వామి పఠించారు. చక్రస్నానంలో శ్రీవారి సుదర్శనచక్రంకు పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు శ్రీభూసమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. చక్రస్నానసమయంలో అర్చకులు కర్పూరహారతులిచ్చారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణిలో గోవిందనామాలతో పుణ్యస్నా నాలాచరించారు. తొలినుండి పక్కాప్రణాళికలతో పోలీసుయంత్రాంగం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరు మల డిఎస్పీ విజయశేఖర్, విజిలెన్స్ వివిఎస్ఓలు తదితర అధికారులు, సిబ్బంది పక్కాప్రణాళికతో భక్తులను క్రమబద్ధీకరించారు. చక్రస్నాన మహోత్సవంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ,సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నరేశ్, శాంతారాం, పనబాకలక్ష్మి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

## మళ్లీ విద్యార్థులను మోసం చేసిన ప్రభుత్వం: కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు3:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను మరోసారి మోసం చేసిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం దసరా పండుగ లోగా ఆరు వందల కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం కళాశాలల యజమాన్యాలకు హామీ ఇచ్చిందని ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు. ఇప్పుడు దీపావళి లోగా రెండో విడత ఎలా విడుదల చేయగలదన్న అనుమానాలు యజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయని ఆయన తెలిపారు. అందుకే కళాశాలల యజమాన్యాలు ఈ నెల పదమూడు నుంచి సమ్మెకు దిగాలని సంకల్పించాలయని ఆయన చెప్పారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేశాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు.

## సమష్టిగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం

### 32 లక్షల లడ్డూలు విక్రయం - టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవా ర్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను సమష్టిగా అందరి సహకారంతో విజయ వంతంగా నిర్వహించామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. తొమ్మిదిరోజులు సామాన్యభక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు, అన్ని శాఖలు సమన్వయంతో సమష్టిగా సేవ లందిం చాయని తెలిపారు. టిటిడి పాలకమండలి,అనుభవజ్ఞులైన అధికారులతో కలసి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంపై మీడియా ప్రతి నిధులతో మాట్లాడారు. ఈ ఏడాది తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మో త్సవాలను దిగ్విజయం చేసిన టిటిడి అర్చకులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం, శ్రీవారి సేవకులు, భక్తులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుండి విచ్చేసిన లక్షలాదిమంది భక్తులకు 16రకాల వాహనసేవలతోబాటు మూల విరాట్టు దర్శనం కల్పించామన్నారు. తొమ్మిదిరోజులు 7.30 లక్షలమంది భక్తులు మూలవిరాట్టును దర్శనం చేసుకున్నారన్నారు.

## హిమాచల్‌లో 83కి పెరిగిన మంచు చిరుతలు



**సిమ్లా, అక్టోబరు 3:** హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌లో మంచు చిరుతల సంఖ్య పెరిగింది. ఎత్తైన గిరిజన ప్రాంతాల్లో అరుదైన మంచు చిరుతల జనాభా గత నాలుగేండ్లలో 62 శాతం పెరిగినట్లు రాష్ట్ర అటవీ శాఖ తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 83 మంచు చిరుతలు ఉన్నట్లు తాజా సర్వేలో తేలింది. 2021లో ఆ సంఖ్య 51గా మాత్రమే ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్ అటవీ శాఖకు చెందిన వైల్డ్ లైఫ్ వింగ్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో భాగంగా రాష్ట్రంలో మంచు చిరుతలు నివసించే 26,000 కి.మీ విస్తీర్ణంలోని ఆరు ప్రదేశాలను కవర్ చేశారు. కొండలు, బండరాళ్లు, పొలాలు, ఎత్తైన ప్రదేశాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి మంచు చిరుతలను లెక్కించారు. ఏడాది కాలంగా నిర్వహించిన ఈ సర్వేలో 83 మంచు చిరుతలు కెమెరాలకు చిక్కాయి. లాహౌల్‌స్పితి, కిన్నౌర్, పాంగి లోయలోని గిరిజన ప్రాంతాల్లో మంచు చిరుతలు, వాటి ఆవాసాలను గుర్తించారు. ఇక స్పితిలోని కిబ్బర్ గ్రామానికి చెందిన స్థానిక యువకులు, మహిళలు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు, డేటా విశ్లేషణకు సాయం చేసినట్లు చెప్పారు. ఫ్రంట్‌లైన్ అటవీ అధికారులు, తదితరులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన కార్యకలాపాలకు మద్దతు ఇచ్చినట్లు వెల్లడించారు. వారి సాయంతో ఈ సర్వేని ఏడాదిలోనే పూర్తి చేసినట్లు వివరించారు. కాగా, గతేడాది 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన శాస్త్రీయ గణనలో దేశంలో మొత్తం 718 మంచు చిరుతలు ఉన్నట్లు తేలిన విషయం తెలిసిందే. దేశంలో మంచు చిరుతలు నివసించే 1.20 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అంటే లఢఖ్, జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ 70 శాతానికి పైగా ప్రదేశాన్ని ఈ శాస్త్రీయ గణన కవర్ చేసిందని కేంద్రం తెలిపింది. 2019 నుంచి 2023 వరకు నాలుగేళ్లపాటు మంచు చిరుతల శాస్త్రీయ గణన జరిగింది. మొత్తం 1971 ప్రాంతాల్లో 1.80 లక్షల ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి మంచు చిరుతలను లెక్కించారు. అందులో అత్యధికంగా లఢఖ్‌లో 447 చిరుతలు ఉన్నట్లు తేలింది. అదేవిధంగా ఉత్తరాఖండ్‌లో 124, హిమాచల్‌ప్రదేశ్‌లో 51, అరుణాచల్‌ప్రదేశ్‌లో 36, సిక్కింలో 21, జమ్ము కశ్మీర్‌లో 9 మంచు చిరుతలు ఉన్నాయి.

# హమాస్‌కు ట్రంప్ తీవ్రస్థాయి హెచ్చరిక

### గడువులోపు ఒప్పందానికి రాకుంటే ఇక నరకమే!



**వాషింగ్టన్, అక్టోబరు 3:** ఉగ్ర సంస్థ హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయి వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్‌తో సంధి కుదుర్చుకునేందుకు ఆదివారం 6 గంటల వరకే సమయం ఉందని అన్నారు. ఈ డెడ్‌లైన్ దాటితే నరకం తప్పదని హెచ్చరిస్తున్నారు. యుద్ధం ముగించేందుకు హమాస్‌కు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో ఏదోక మార్గంలో శాంతిస్థాపన జరిగి తీరుతుందని అన్నారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య సంధి కుదిర్చేందుకు ట్రంప్ చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. యుద్ధం ముగింపునకు 20 అంశాలతో కూడిన ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చారు. యుద్ధం తరువాత గాజాలో పరిపాలన పునరుద్ధరణకు ప్రణాళిక, తక్షణ కాల్పుల విరమణ తదితర ఒప్పందాలను ప్రస్తావించారు. శాంతిస్థాపనకు ఇది రోడ్ మ్యాప్ అని శ్వేత సౌధం తెలిపింది ఇక డెడ్‌లైన్‌పరంగా డొనాల్డ్ ట్రంప్ ఘాటుగా స్పందించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్‌పై జరిపిన దాడిని మారణ హోమంగా ఆయన అభివర్ణించారు. ఆ దాడిలో శిశువులు, మహిళలు మరణించారని అన్నారు. ఇందుకు ప్రతీకారంగా 25 వేల హమాస్ సైనికులు కూడా బలయ్యారని అన్నారు. గాజాలో అనేక మంది అమాయక పాలస్తీనా ప్రజలు దాడుల్లో చిక్కుకున్నారని అన్నారు. గాజాలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. తాను గ్రీన్ సిగ్నల్ ఇస్తే మరింత మంది ఈ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకుం టారని అన్నారు. హమాస్ టెర్రరిస్టులు ఎక్కడ ఉన్నారో తమకు తెలుసని, వాళ్లందరినీ వెంటాడి అంతమొంది స్తామని హెచ్చరించారు. ఇక ట్రంప్ ప్రకటన ప్రకారం, యుద్ధం ముగింపు తరువాత గాజాలో ఓ టెంపరరీ గవర్నింగ్ బోర్డు ఏర్పాటు చేస్తారు. ఈ ప్రతిపాదనలను హమాస్ ప్రస్తుతం పరిశీలిస్తోంది. అయితే, తాము ఆయుధాలను విడిచిపెట్టేందుకు సిద్ధంగా లేమని హమాస్ మొదటి నుంచి చెబుతోంది. ప్రస్తుత ప్రతిపాదనలోని అంశాలన్నీ గతంలో ఏదో ఒక సందర్భంలో చెప్పినవేనని హమాస్ భావిస్తోంది. ఈ డీల్‌తో మిగులున్న హమాస్ ఫైటర్లు ప్రాణాలతో బయటపడతారని ట్రంప్ అన్నారు. ఇది అందరికీ ప్రయోజనకరమైన డీల్ అని చెప్పుకొచ్చారు.



## గాయకుడు పద్మవిభూషణ్ చన్నులాల్‌మిశ్రా కన్నుమూత

**లక్నో, అక్టోబరు 3:** శాస్త్రీయ గాయకుడు, పద్మవిభూషణ్ గ్రహీత చన్నులాల్‌మిశ్రా (89) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చన్నులాల్ తన కుమార్తె నివాసంలో తుదిశ్వాస విడిచారు. చన్నులాల్ మృతిపట్ల ప్రధాని మోడీ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో గురువారం తెల్లవారు జామున చన్నులాల్‌మిశ్రా కన్ను మూసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఇటీవల 18 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. గురువారం తెల్ల వారుజామున 4 గంటలకు కన్ను మూసినట్లు ఆయన కుమార్తె నమ్రత మిశ్రా పేర్కొన్నారు. మిశ్రా అంత్యక్రియలు గురువారం సాయంత్రం 5 గంటలకు వారణాసిలో జరిగాయి. మిశ్రాకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రామ్‌కుమార్‌మిశ్రా తబలా ప్లేయర్‌గా ప్రసిద్ధుడు.

# ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీరం దాటిన తీవ్ర వాయుగుండం

### విద్యుత్ శాఖ అధికారులతో ఏపి మంత్రి గొట్టిపాటి రవికుమార్ టెలికాన్ఫరెన్స్


**విజయవాడ,అక్టోబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయువ్య దిశగా కదిలి బలహీన పడుతున్నట్లు పేర్కొంది. తీరం దాటినా తీవ్ర వాయుగుండం ప్రభావం కొనసాగుతుందని అధికారులు తెలియజేశారు. నేడు ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఒడిశాలో కురిసిన వర్షాల కారణంగా శ్రీకాకుళం జిల్లాలో వరద ఉధృతి పెరిగింది. అటు నుంచి వచ్చిన నీరు వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల్లో ప్రవేశిస్తోంది. దీంతో హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ బ్యారేజీ నుంచి వచ్చిన వంశధార నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. మహేంద్రతనయ నదిలో పెరిగిన నీటి ప్రవాహం కారణంగా శ్రీకాకుళం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్, మహేంద్రనగర్ వీధిలోకి వరద వచ్చి చేరింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేశారు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటించారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అలెర్ట్ అయ్యింది. ఉత్తరాంధ్ర జిల్లా కలెక్టర్లతో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. వాయుగుండం ప్రభావంతో ఈరోజు రాత్రి, రేపు ఉత్తరాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షాలు పడతాయని అంచనా. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాల్లో అతిభారీ వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తీరం వెంట ఈదురుగాలులకు ఆస్కారం ఉంది. ఈ రాత్రికి అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. రోడ్డు మీద పడే చెట్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వంశధార, నాగావళి వరదకు ఛాన్స్ ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఉత్తరాంధ్రలో భారీ వర్షాలపై విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల వల్ల ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని ఎప్పటికప్పుడు పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు కూలి, కొమ్మలు విరిగి తలెత్తే విద్యుత్ అంతరాయం సమస్యలకు యంత్రాంగం తక్షణమే స్పందించాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు ఇప్పటికే 70 శాతం పరిష్కరించామని అధికారులు వివరణ ఇచ్చారు. వచ్చిన ఫిర్యాదుల్ని నిర్ణీత కాలపరిమితి పెట్టుకుని పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

## ఉద్యాన పంటలకు రాయితీలు

### రైతులకు 40 శాతం అమలు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్తగా ఉద్యాన తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాయితీలు నిర్ణయిస్తూ ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. ఉద్యాన పంటల సాగు నిమిత్తం అన్ని విభాగాల్లో 40 శాతం రాయితీని రైతులకు అంద చేయనున్నారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ బాషా ఖరారు చేశారు. ఇందులో భాగంగా 9,902 ఎకరాలకు సంబంధించి మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగుకు రూ.18.48 కోట్లను కేటాయించారు. కూరగాయల సాగుకు 10 వేల ఎకరాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యానికి గాను రూ.9.60 కోట్లు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగు కోసం రూ.2.35 కోట్లు ఖర్చు చేయనునాన్నరు. అలాగే రాష్ట్రంలో 2,549 ఎకరాల్లో పూల సాగుకు రూ.2.06 కోట్లు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు రూ.5.33 కోట్లు కేటాయించారు. అలాగే సేంద్రియ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు తదితర వాటి ఏర్పాటుకు 30 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. వీటితోపాటు, అదనంగా పుట్టగొడుగుల పెంపకం, వాటి యూనిట్లకు రూ.1.08 కోట్లు, పాత తోటల పునరుద్ధరణకు మరో రూ.2 కోట్లు, నీటి వనరుల సృష్టి కోసం రూ.2.73 కోట్లు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం రూ.14.24 కోట్లు కేటాయించారు. వీటికి 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు.

# వాంగ్‌చుక్‌ను విడుదల చేయండి



### సుప్రీంకోర్టులో సోనమ్ భార్య పిటిషన్

### రాష్ట్రపతి, ప్రధాని, అమిత్‌షాకు లేఖలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** లడఖ్‌లో సెప్టెంబర్ 24న చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల తర్వాత జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ), 1980 కింద కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ అతని భార్య డా. గీతాంజలి జె. ఆంగ్మో సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. వాంగ్‌చుక్ ఎక్కడ ఉన్నారో అధికారులు చెప్పడం లేదని, అలాగే తన భర్తతో తనను కూడా మాట్లాడనివ్వట్లేదని.. అతడితో తనను మాట్లాడించాలి, అతడిని వెంటనే విడుదల చేయాలని గీతాంజలి జె. ఆంగ్మో తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయనపై ఎన్ఎస్ఏ వంటి కఠిన చట్టాన్ని ప్రయోగించడాన్ని కూడా ఆమె ప్రశ్నించారు. ఈ పిటిషన్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఇప్పటికీ తన భర్త ఆరోగ్య పరిస్థితి గురించి ఎలాంటి సమాచారం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వాంగ్‌చుక్ ఒక పాకిస్థానీ నిఘా ఆపరేటివ్‌తో టచ్‌లో ఉన్నారన్న ఆరోపణలను ఆంగ్మో పూర్తిగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె లడఖ్ పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేశారు. లడఖ్ పోలీసులు ఒక అజెండాతో పని చేస్తున్నారని గీతాంజలి ఆరోపించారు.

"డీజీపీ చెప్పేదంతా అబద్ధమే. ఆయన ఒక అజెండాతో మాట్లాడుతున్నారు. వారికి రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌ను ఏ పరిస్థితుల్లోనూ అమలు చేయాలని లేదు. అందుకే ఎవరినో ఒకరిని బలిపశువుగా చేయాలని చూస్తున్నారు" అని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, లేహ్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ లేఖ కాపీని కూడా ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

# పెరుగుతున్న డిమాండ్‌తో విద్యుత్ టెర్రర్

### ఈ రంగానికి రూ.33 లక్షల కోట్లు

### 15 శాతం పెరిగిన మార్కెట్, ట్రేడింగ్

### డేటా సెంటర్లు, హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలే కారణం

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** కొత్తగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు పక్కా ప్రణాళికతో కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఏకీకరణ సవాళ్లను అధిగమించడానికి 2032 నాటికి దేశంలోని విద్యుత్ ఉత్పత్తి రంగానికి 33 లక్షల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ఇదే సమయంలో 3.78 మిలియన్ల విద్యుత్ ఉత్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఈఏ) తాజాగా 2022-32 కాలానికి గాను ప్రతిష్టాత్మక జాతీయ విద్యుత్ ప్రణాళిక (ఎన్ఇపి)ను రూపొందించింది. ఈ కాలంలో 378,370 మెగావాట్ల సామర్థ్యానికి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని ఈ ప్రణాళికలో స్పష్టం చేసింది. 2022-27 సంవత్సరాల కాలంలో మొత్తం సామర్థ్యం అదనంగా 211,819 మెగావాట్లు ఉంటుందని అంచనా. ఇందులో పునరుత్పాదక విద్యుత్‌కు సంబంధించి 179,939 మెగావాట్లు, అణు విద్యుత్ 6,300 మెగావాట్లు, థర్మల్ (బొగ్గు, గ్యాస్) ప్రాజెక్టు ద్వారా 25,580 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పెంచాలని నిర్ణయించింది. మరోపక్క అధికంగా డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్, సామర్థ్య మార్కెట్లు వంటి వాటితో వేగంగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మొత్తం విద్యుత్ వినియోగంలో ప్రధానంగా మార్కెట్, స్వల్పకాలిక ట్రేడింగ్ వాల్యూమ్‌ల నుండే 15 శాతానికి పెరిగాయి. అలాగే 8 నుండి 9 శాతం వరకూ విద్యుత్ సరఫరా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా జరుగుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) అధికారవర్గాలు వెల్లడించాయి. డేటా సెంటర్లు నేడు ఒక గిగావాట్ల నుండి తక్కువ వ్యవధిలో 16 గిగావాట్లకు పెరుగుదల చోటు చేసుకుంటోంది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, విద్యుత్ వాహనాలు కూడా గణనీయమైన డిమాండ్‌ను పెంచుతున్నట్లు గుర్తించింది. అంతేకాకుండా ఈ రంగాలు వారం రోజులూ 24 గంటల పాటు విద్యుత్ వినియోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరాన్ని గుర్తించింది.

ఇదే సమయంలో విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును మెరుగుపచే దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టినా, మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని భావిస్తోంది. ఇందుకు రూఫ్‌టాప్ సోలార్, ఇతర పునరుత్పాదక శక్తితో లోడ్ డిస్పాచ్ కేంద్రాలకు ఆటోమేషన్ మద్దతుతో పంపిణీ స్థాయి వరకూ పటిష్ట ఏర్పాట్లు చేయనుంది. డిమాండ్‌తో పాటు, మరోపక్క సైబర్ ప్రమాదం పెరుగుతున్నందున భద్రతపై సైతం దృష్టిసారించింది. ముఖ్యంగా స్మార్ట్ మీటర్లు, ప్రోసుమర్లు గ్రిడ్‌లోకి ప్రవేశించడంతో ముప్పు పెరుగుతోంది. అయితే దీన్ని అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే ఐఐటీ కాన్పూర్ సహకారంతో బెంగుళూరులోని ఐఐఎస్పీలో సైబర్ భద్రతపై ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసింది. కాగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు,


## రాష్ట్రంలో తగ్గిన పప్పుధాన్యాల సాగు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణలో పప్పు ధాన్యాల సాగు తగ్గింది. ప్రస్తుత ఖరీఫ్ పంట సీజనులో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచాలని వ్యవసాయ శాఖ భావించింది. ఈ సీజనులో పప్పు ధాన్యాల సాగును పెంచాలని వ్యవసాయ శాఖ పట్టుదలతో ప్రయత్నం చేసినా రైతాంగంలో స్పందన కనిపించ లేదు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో గత ఏడాది ఇదే సమయంలో సాగైన విస్తీర్ణం కంటే తగ్గింది. గత ఏడాది కంటే పప్పు ధాన్యాల సాగు పెరగాల్సి ఉండగా, మరింత తగ్గదల చోటు చేసుకుంది. వ్యవసాయ అధికారుల నివేదికలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 7,92,517 ఎకరాలు కాగా, ఖరీఫ్ పంట కాలంలో ఇప్పటి వరకూ 73.66 శాతం మేర 5,83,736 ఎకరాల్లో కంది, పెసర, మినుము, ఉలవలు తదితర పప్పు ధాన్యాలను రైతులు సాగు చేశారు.

# తెర

## ఉత్తర పాత్రలో నటి లయ విశ్వరూపం

**శివాజీప్రొడక్షన్ హౌస్‌లో** రానున్న ఈచిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈటీవీ విన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.. దసరా సందర్భంగా అక్టోబర్2న ఈచిత్రానికి సంబంధించినఅప్డేట్ ఇచ్చారు. ఇంకాటైటిల్ ఖరారు చేయని ఈమూవీ నుంచి దసరా స్పెషల్‌గా నటిలయ పోషించిన పాత్రకు సంబంధించిన పరిచ యాన్ని చేశారు. లయ ఈ చిత్రంలో ఉత్తరఅనే గృహిణి పాత్రను పోషిసున్నారు. ఈక్యారెక్టర్‌లో ఎన్నో వేరియేషన్స్ ఉన్నాయని పోస్టర్‌ను చూస్తేనే తెలుస్తోంది. పైకి ఒకలా. లోపల ఇంకోలా ఎమోషన్స్ ను దాచుకునే ఈ పాత్రలో లయ చాలాకొత్తగా, డిఫరెంట్‌గా కనిపించబోతోన్నారనితెలుస్తోంది. బయటకి సాధారణ మహిళగాకనిపిస్తూనే, లోపలక్రిమినల్ నేచర్ నుదాచిఎట్టుకుంటూ, డ్యూయల్ బిహేవియర్‌తో (రెండు రకాల మనస్తత్వాలతో) సాగే ఈ పాత్రలో లయ తన నట విశ్వరూపాన్ని చూపించబోతున్నారని చిత్ర బృందం తెలిపింది.



## మళ్లీ సినిమా చేయాలనే బలాన్ని ఇచ్చింది:పవన్ కళ్యాణ్

**పవర్ స్టార్** పవన్ కళ్యాణ్ ఓజాస్ గంభీరగా గర్జించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్‌దాసరిప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా, భారీ అంచనాల నడుమ సెప్టెంబర్ 25న థియేటర్లలోఅడుగుపెట్టింది. తెలుగు రాష్ట్రాల్లో సెప్టెంబర్ 24 రాత్రి నుంచే ప్రత్యేక షోలు ప్రదర్శించబడ్డాయి. మొదటి షో నుంచే అన్నివర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. . మొదటి వారాంతంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.252 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ఓజీ.. పవన్ కళ్యాణ్ కెరీర్ లో అత్యధిక వసూళ్ళు రాబట్టిన చిత్రంగా నిలవడమే కాకకుండా, తెలుగు సినీ చరిత్రలో సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని ట్రైడెంట్ హోటల్ లో చిత్ర విజయోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు ఈవేడుకలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "ముందుగా ఇక్కడకి వచ్చిన మీడియా వాళ్ళకి, అభిమాను లకి, స్నేహితులకి, సోదర సోదరీమణులు అందరికీ ఓజీ యూనిట్ తరుపున నా హృదయపూర్వక నమస్కారాలు. ఓజీ సినిమా అనేది మా అందరికి చాలా చక్కటి అనుభూతి. .చిత్ర దర్శకుడు సుజీత్ మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్‌తో ఒక సినిమా చేస్తాను అని నేను ఎప్పుడుఅనుకోలేదు. ఒకకథ కూడా రాసుకోలేదు ఆయన కోసం. కానీ ప్రకృతి ఎంత బలమైంది అంటే నన్ను తీసుకు వచ్చి పవన్ తో సినిమా చేసేలాగా చేసింది. త్రివిక్రమ్ వల్ల ఈ అవకాశం రావడం నాకు సంతోషంగా ఉంది. ఆయనే వచ్చి నువ్వు పవన్‌తో ఒక సినిమా చేస్తే బాగుంటుంది అని చెప్పడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. తర్వాత డీవీవీ దానయ్యని కలవడం జరిగింది. ఆయన చెప్పిన ఒకే ఒక్క మాట సినిమా ఎలా అయినా హిట్ అవ్వాలి దానికి నీకు ఏం కావాలి. నేను పవన్ కళ్యాణ్‌కి నా బ్యానర్ లో ఒక హిట్ ఇవ్వాలి అనేసరికి నా నోటి నుంచి మాట రాలేదు. అంతసపోర్ట్ చేశారు సినిమా పూర్తి అయ్యేవరుకు .ఇంకాసినిమాబ్యాక్ బోన్ అనిపంచుకుంటున్న తమన్ అన్న సినిమాకే కాదునాకు కూడా ఒకబ్యాక్‌బోన్‌లా నుంచున్నాడు సినిమా పూర్తి అయ్యేవరుకు. మిగతా తారాగణం అంతాకూడా సినిమాకి చాలా సపోర్టివ్‌గా ఉన్నారు. చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య మాట్లాడుతూ, "నేను ఈ సినిమా చేయడానికి ముఖ్యకారణం, దర్శకుడు త్రివిక్రవ్ ఆయన వల్లే ఈ సినిమా చెయ్యగలిగాను. అలాగే పవన్ కళ్యాణ్ ఈ సినిమా కోసం చాలా కష్టపడి, అలాగే ఇష్టపడి మరీ ఈ సినిమాని చేశారు. అద్భుతంగా నటించారు. సుజిత్ కూడా ఈ సినిమాకోసం చాలా కష్టపడ్డాడు. సోదరుడు తమన్ కూడా బాగా కష్టపడి చేశాడు. ఇంతటి ఘన విజయాన్ని ఇచ్చినందుకుఅందరికి నా ధన్యవాదాలు అన్నారు. సంగీతదర్శకుడు తమన్ మాట్లాడుతూ, "ఓజీ సినిమా మా అందరికీ ఒక మిరాకిల్ లాంటిది. సుజీత్, నాతో సహా అందరూ ఎంతో భయంతో, బాధ్యతతో ఈ సినిమా చేశారు. ఇదిమా విజయం కాదు, పవన్ కళ్యాణ్ అభిమానుల విజయం అన్నారు. కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్ మాట్లాడుతూ, "ఓజీని ఇంత పెద్ద హిట్ చేసినందుకు చాలా థాంక్స్. అలాగే, ఇలాంటి ఒక బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కళ్యాణ్‌కి ఇచ్చినందుకు తమన్‌కి చాలా థాంక్స్. చివరిగా ఒక్కమాట పవన్ కళ్యాణ్ ఎంత బిజీగా ఉన్నా ఏడాదికి ఒకసారి ఓజీ లాంటి సినిమా ఇస్తే సంతోషిస్తాం అన్నారు. ఈ వేడుకలో నటీనటులు శ్రియా రెడ్డి, అర్జున్ దాస్, వెంకట్, ఛాయా గ్రాహకుడు రవి కె చంద్రన్, కళా దర్శకుడు ఏఎస్ ప్రకాష్‌లు పాల్గొని 'ఓజీ' సినిమా ఘన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



## పూర్ణానాయుడు ప్రొడక్షన్స్ పూజా కార్యక్రమాలు ప్రారంభం



**శ్రేయాస్ చిత్ర,** పూర్ణానాయుడు ప్రొడక్షన్స్ బ్యానర్ల మీద చైతన్య రావు మదాడి, ఐరా, సాఖీ హీరో హీరోయిన్లుగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో పూర్ణా నాయుడు, శ్రీకాంత్. వి ప్రొడక్షన్ నెంబర్.5ని ప్రారంభించారు. 'ఓనమాలు' 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' 'వరల్డ్ ఫేమస్ లవర్'అంటూ సెన్సిబుల్ స్టోరీలతో ఆకట్టుకున్న సెన్సిబుల్ డైరెక్టర్ క్రాంతి మాధవ్ ఇప్పుడు మరోయూత్‌ఫుల్‌కథతోఅందరినీ అలరించేందుకు రెడీగా ఉన్నారు. గ్యాప్ తరువాత వస్తున్న క్రాంతి మాధవ్ సరికొత్త ప్రేమకథతో అందరినీ మెప్పిం చేందుకు వస్తున్నారు. దసరా సందర్భంగా ఈమూవీని శుక్రవారం (అక్టోబర్3)నాడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రార ంభించారు. ముహూర్తపు సన్నివేశానికి దేవా కట్టా క్లాప్ కొట్టగా, కెఎల్ దామోదర్ ప్రసాద్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నిర్మాతలు పూర్ణ నాయుడు, శ్రీకాంత్‌స్క్రిప్ట్ అంద జేయగా..తొలి సన్నివేశానికి వర ముళ్ళపూడి గౌరవ దర్శకత్వం వహించారు. ర్శకుడు క్రాంతి మాధవ్ మాట్లాడుతూ, ఇదినాకుఐదో చిత్రం. చైతన్యతో రెండో సినిమా. పూర్ణానాయుడు, శ్రీకాంత్ ఈమూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఐరా తెలుగులోకి హీరోయిన్‌గా పరిచయం కాబోతోన్నారు. సాఖీ బెంగాలీలో సీరియల్స్ చేశారు. ఈ మూవీతో ఆమె కూడా తెలుగులోకి రాబోతోన్నారు. చైతన్య, పూర్ణతో నాది ఎన్నో ఏళ్ల బంధం. మళ్లీ మళ్లీ ఇది రాని రోజు తరువాత పూర్ణతో ఓ మూవీనిచేయాలి. హిట్స్‌లో ఉన్నప్పుడు చేయను.. బాధల్లో ఉన్నప్పుడు చేస్తానుఅని అన్నారు. అలా నా గత చిత్రం ఫ్లాప్ అయినప్పుడు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆ టైంలోనే పూర్ణ వచ్చి సినిమా చేద్దామని అన్నారు. న్యూ ఏజ్ లవ్ స్టోరీగా ఈ చిత్రం రాబోతోంది. అందమైన లొకేషన్లలో భారీగా ఈ మూవీని చిత్రీకరిస్తున్నా మ్మని అన్నారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ, శేయాస్ చిత్ర, పూర్ణానాయుడు బ్యానర్లో పూర్ణా నాయుడు, శ్రీకాంత్ నిర్మాతలుగా క్రాంతి మాధవ్ అన్న దర్శకత్వంలోమూవీని చేస్తున్నాను. క్రాంతి అన్నతో నాది మూడేళ్ల బంధం. ఆయనతో బ్యాక్ టు బ్యాక్ చిత్రాలు చేస్తున్నాను. 2026లోనే ఆయనతో చేస్తున్న రెండు సినిమాలు రిలీజ్ కానున్నాయి. నాకు మళ్లీ మళ్లీ ఇది రాని రోజు చాలా ఇష్టమైన సినిమా. ఆయనకెంతో ఇష్టమైన దర్శకుడు. ఆయనతో వరుసగా రెండు చిత్రాలు చేస్తుండటం ఆనందంగా ఉంది. ఇంత కంటే ఎక్కువగా నేను ఆ దేవుడ్ని ఏదీ కోరుకోను. 'మయసభ 'ఘాటీ తరువాత ఇంత మంచి సినిమాను చేస్తుండటంఅదృష్టంగా భావిస్తున్నాను నేను ఓ సినిమా చేస్తున్నాను అంటే.. ఏదో ఒకటి కొత్తగా ఉంటుందనే ఆడియెన్స్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ఇదొక న్యూ ఏజ్ లవ్ స్టోరీ. క్రాంతి అన్న చెప్పినకథ నాకుచాలా నచ్చింది. ఐరా, సాఖీలకు ఆల్‌ది బెస్ట్. నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్ అని అన్నారు. నిర్మాతపూర్ణనాయుడు మాట్లాడుతూ, క్రాంతిని నేను దర్శకుడిగా పరిచయం చేయాలని అనుకున్నాను. కానీ ఇన్నాళ్లకు మా ఇద్దరికీ సమయం కుదిరింది. క్రాంతి చెప్పే కథలంటే నాకుచాలా ఇష్టం శ్రీకాంత్ నాప్రతీ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అవుతూనే ఉంటారు. త్వరలోనే మరిన్ని వివరాల్నితెలియ జేస్తామని అన్నారు. హీరోయిన్ మాట్లాడుతూ, నాది బెంగళూరు. ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకుంటాం. నేను తెలుగులోనే ఇంట్రడ్యూస్ అవ్వాల్సింది. కానీ తమిళంలో నాపరిచయం జరిగింది. నాకు 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' అనే చిత్రం చాలా ఇష్టం. నేను ఆమూవీని దాదాపు 20సార్లుచూసిఉంటాను. క్రాంతి నుంచి నాకుఫోన్ రావడంతో చాలా సంతోషించాను. కథ నాకు చాలా నచ్చింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగం అవ్వడం నాఅదృష్టం .నాకు అవకాశం ఇచ్చి నిర్మాతలకు థాంక్స్. చైతన్యతో కలిసి నటించడం కోసం ఎదురుచూస్తున్నాను అని అన్నారు.

## దిమంతం"టీజర్ విడుదల

**నూతన చిత్రం** 'దిమంతం" టీజర్‌ను ప్రముఖ దర్శకుడు తేజ విడుదల చేశారు. ఇది ఓ క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. గర్భిణీ మహిళలపై హత్యలుఅనే మూడుతో కథ సాగనుందని టీజర్ సూచిస్తోంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం 'సుధాకర్ పాణి' వహించారు. వజ్రయోగి, శ్రేయ భారతి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత :ప్రశాంత్ టాటా,



సహ నిర్మాత గాయత్రి సౌమ్య గుడిసేవ.

సంగీతాన్ని ఎస్. సుహాస్ సమకూర్చారు. తేజ మాట్లాడుతూ, "బీజీఎం, విజువల్స్ చాలా ఇంటెన్స్‌గా ఉన్నాయి. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలా బాగా ఉన్నాయి అన్నారు. సినిమా త్వరలో విడుదల కానుంది. మూవీ: దిమంతం మూవీ కాన్సెప్ట్ : సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్. తారాగణం హీరో : వజ్రయోగి హీరోయిన్ : శ్రేయ భర్తీ తదితరులు. టెక్నికల్ టీం : డైరెక్టర్ : సుధాకర్ పాణి, బ్యానర్ : టీఅర్ డ్రీమ్ ప్రొడక్షన్స్: ప్రొడ్యూసర్: ప్రశాంత్ టాటా: సహ నిర్మాత: గాయత్రీ సౌమ్య గుడిసెవా, డీఓపీ : శ్రీనివాస్ విన్నకోట ఎడిటర్: అమర్ రెడ్డి, మ్యూజిక్: ఎస్. సుహాస్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: వీరవల్లి శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ : వీరవల్లి మురళి కృష్ణఫైట్ మాస్టర్స్: రామ కృష్ణ, వెంకట్ కొరియోగ్రాఫర్ : దుర్గేష్ మేనేజర్ :

## 'మన శంకర వరప్రసాద్ గారు' ఫస్ట్ సింగిల్ ప్రోమో

మెగాస్టార్ చిరంజీవి తన అప్ కమింగ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్"మనశంకరవప్రసాద్" తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయనతార కథానాయిక. ఈ ప్రాజెక్ట్‌ను షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్‌తో కలిసి గ్రాండ్ కాన్వాస్‌పై నిర్మిస్తున్నారు. అర్చన గర్వంగా సమర్పిస్తున్నారు. దసరా సందర్భంగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ "మీసాల పిల్ల" ప్రోమోను రిలీజ్ చేశారు. ఈ ఆల్బమ్‌ని స్పెషల్ కాన్సెప్ట్ డిజైన్ చేశారు. ప్రతి పాటకీ మెగాఅన్న ప్రిఫిక్స్ జోడించి మెగా గ్రేస్, మెగా స్వాగ్, మెగా మాస్ అంటూ క్యురియాసిటీ క్రియేట్ చేశారు. ఈ ఐడియాఫ్యాన్స్, మ్యూజిక్ లవర్స్‌ని ఆకట్టుకుంది.

ఈ ఏడాది సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం ఆల్బమ్‌తో సంచలనం సృష్టించిన మ్యూజిక్ సెన్సేషన్ భీమ్స్ సిసిరోలియో, ఇప్పుడు మరోసారి పండుగ సందడి క్రియేట్ చేసే చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌తో రాబోతున్నారు. ఈ ఉదయం రిలీజ్ చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో అనిల్ రవిపూడి స్టైల్‌లోని సరదా టచ్, అలాగే లెజెండరీ సింగర్ ఉదిత్ నారాయణ్ పాడిన ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లని పరిచయం చేశారు. వీడియోలోని క్విర్కీ ప్రెజెంటేషన్ నవ్వులు పంచి మ్యూజిక్ ఫీవర్‌కి స్టేజ్ రెడీ చేసింది. మెగా గ్రేస్ ట్రాక్ ప్రోమోగా వచ్చిన మీసాల పిల్ల ఫ్రెష్‌గా, ఎనర్జిటిక్‌గా, ఫస్ట్ బాల్ కే సిక్స్ కొట్టినట్లుగా ఉంది. నాస్టాల్జియా, మెలోడీ, యూనివర్సల్ అపీల్‌ని కలిపిన ఈ సాంగ్ అందరికీ నచ్చే హిట్ ట్యూన్ అవ్వడం ఖాయం. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి సినిమాటో గ్రాఫర్‌గా, తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎఎస్‌ప్రకాష్‌ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి.ఆది నారాయణ సహరచయితలు. ఎస్.కృష్ణఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారువ్యవహరిస్తున్నారు. మనశంకరవరప్రసాద్2026లో సంక్రాంతి పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానుంది. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వీటీవీగణేష్. సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం అనిల్ రావిపూడి నిర్మాతలు : సాహు గారపాటి సుస్మిత, కొణిదెల బ్యానర్లు:షైన్‌స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ అర్చనసంగీతం: భీమ్స్ సిసిరోలియో డీవోపీ :సమీర్ రెడ్డి ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ఎడిటర్ : తమ్మిరాజు, రచయితలు : ఎస్ కృష్ణ, జిఆది నారాయణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎస్ కృష్ణ, సూపర్‌వైజర్ : నరేంద్ర లోగిసా, లైన్ ప్రొడ్యూసం: నవీన్ గారపాటి:ఎడిషినల్, డైలాగ్స్ : అజ్జు మహంకాళి, తిరుమల నాగ్, చీఫ్ కో డైరెక్టర్:సత్యంబెల్లంకొండవంశీశేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా .




## నాని 34.విక్టరీ వెంకటేష్ క్లాప్‌తో లాంచ్



**నేచురల్ స్టార్** నాని, స్టైలిష్ డైరెక్టర్ సుజీత్, వెంకట్ బోయనపల్లి, నిహారిక ఎంటర్టైన్మెంట్, యూనానిమస్ ప్రొడక్షన్స్ ప్రతిష్టాత్మక చిత్రం నాని34, విక్టరీ వెంకటేష్ క్లాప్‌తో గ్రాండ్‌గా లాంచ్ మాన్ ఆఫ్‌ది మొమెంట్, వరుస సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్లతో తెలుగు సినిమా ప్రేక్షకులను అలరిస్తున్న వెర్సటైల్ యాక్టర్ నాని, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తన భారీ చిత్రం 34ని అనౌన్స్ చేశారు. ఇది ఒక అంబిషస్ సినీమాటిక్ జర్నీకి ఆరంభం. ఈ పవర్‌ప్యాక్ ప్రాజెక్ట్‌కి ఓజీ మెగా బ్లాక్‌బస్టర్‌తో భారీ విజయాన్ని అందుకున్న స్టైలిష్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్యాషనేట్ ప్రొడ్యూసర్ వెంకట్ బోయనపల్లి (నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్), అలాగే నాని స్వంత నిర్మాణ సంస్థ యూనానిమస్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ కాంబినేషన్ గ్రాండ్ స్కేల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి గ్యారంటీ ఇస్తోంది. దసరా శుభ సందర్భంగా ఈ సినిమా లాంచ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆ వేడుకకు విక్టరీ వెంకటేష్ హాజరై, ఫస్ట్ క్లాప్ కొట్టి బెస్ట్ విషెష్ అందించారు. నాని తండ్రి రాంబాబు ఘంటా కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నాని, నిర్మాత వెంకట్ బోయనపల్లి కలిసి స్క్రిప్ట్‌ను దర్శకుడు సుజీత్‌కి అందించారు. ఫస్ట్ షాట్ కి దర్శకులు రాహుల్ సంకృత్యాన్, శ్రీకాంత్ ఒదెల, శౌర్యువ్ కలిసి గౌవర దర్శకత్వం వహించారు. ఈ వేడుకకు దర్శకుడు రామ్ జగదీష్, నిర్మాత సుధాకర్ చెరుకూరితో పాటు పరిశ్రమలోని ప్రముఖులు హాజరయ్యారు.

## 'కామ్రేడ్ కళ్యాణ్' గ్లింప్స్ రిలీజ్

**శ్రీవిష్ణు**, జానకి రామ్ మారెళ్ళ, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ 'మూవీ టైటిల్. కామ్రేడ్ కళ్యాణ్', ఇంట్రస్టింగ్ గ్లింప్స్ రిలీజ్ఎంటర్టైన్మెంట్ కింగ్ శ్రీ విష్ణు తన వెర్సటైల్ పెర్ఫార్మెన్స్, యూనిక్ కథలతో అలరిస్తుంటారు. ప్రతి సినిమాలోనూ హ్యూమర్ వుండేలా చూసుకునే ఆయన తాజా ప్రాజెక్ట్ కూడా అదే రీతిలో ఎంటర్ టైన్మెంట్ అందించబోతున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' అనే టైటిల్‌తో వస్తున్న ఈ ఫన్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతాకర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. టైటిల్‌ను పరిచయం చేస్తూ విడుదల చేసిన ప్రోమో ఆసక్తికరంగా ఉంది. 1992లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథ, రేడియోలో నక్సలైట్ ముప్పు పెరుగుతోందని అనౌన్స్‌చేసే సన్నివేశంతో మొదలవుతుంది. ప్రభుత్వం ఆందోళనలోఉండగా, పోలీసులు, గ్రేహౌండ్స్ టీమ్ ఒక నక్సలైట్ లీడర్ కామ్రేడ్ కళ్యాణ్ ను పట్టుకోవడానికి బయలుదేరతారు. కామ్రేడ్ కళ్యాణ్ కోసం విడుదల చేసిన 5లక్షల రివార్డ్ వాంటెడ్ పోస్టర్‌ను అతడే స్వయంగా అతికించడం ట్విస్ట్. చివరగా శ్రీవిష్ణులుక్‌రివీల్ అవుతూ ప్రోమో ఎంటర్టైనింగ్‌గా ముగుస్తుంది సీరియస్ ప్రీమైస్‌తో మొదలైన ఈ కథలో హ్యూమర్ ప్రధాన పాత్ర పోషించనుంది. యాక్షన్, పొలిటికల్ టెన్షన్, పోలీస్ క్రాక్‌డౌన్ మధ్య రొమాన్స్, కామెడీ సన్నివేశాలతో కలిపి కామ్రేడ్ కళ్యాణయాక్షన్‌కామెడీ జానర్‌కు కొత్త టచ్‌ను ఇవ్వనుంది. ఈ సినిమాలో శ్రీ విష్ణు డ్యుయల్ రోల్స్‌లో కనిపించనున్నారు. ఆయనలుక్ స్టైలిష్‌గా, ఇంట్రెస్టింగ్‌గా వుంది. హీరోయిన్‌గా మహిమానంబియర్ నటిస్తుండగా, రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. సాయి శ్రీరామ్‌విజువల్స్ చిత్రానికి ప్రత్యేకతను తీసుకువస్తుంటే, విజయ్ బుల్గానిన్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎమోషన్, యాక్షన్ ని మరింత ఎలివేట్ చేస్తోంది. చోటా కె ప్రసాద్ ఎడిటర్, ప్రస్తుతం చిత్రీకరణ సగానికి చేరుకుంది, టీమ్ ఫుల్ స్పీడ్‌లో ముందుకువెళ్తోంది. తారాగణం: శ్రీవిష్ణు, మహిమానంబియార్, రాధికశరత్ కుమార్, షైన్‌టామ్ చాకో, ఉపేంద్రలిమాయే. సాంకేతికసిబ్బంది:దర్శకత్వం:జానకిరామ్‌మారెళ్లసమర్పణ:కోనవెంకట్‌నిర్మాతలు: వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి.



## ధనుష్ సినిమాకి 2వ రోజు స్ట్రాంగ్ వసూళ్లు!

**కోలీవుడ్** స్టార్ నటుడు ధనుష్ హీరోగా నిత్య మీనన్, షాలిని పాండే హీరోయిన్స్ గా ధనుష్ నే దర్శకత్వంలో తెరకెక్కించిన క్లీన్ ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రమే 'ఇడ్లీ కడై'. తెలుగులో ఇడ్లీ కొట్టుగా రిలీజ్ అయ్యిన ఈ సినిమా మంచి ఎమోషన్స్ తో డీసెంట్ డే 1 ని తెలుగులో అందుకుంది. కానీ తెలుగు కంటే తమిళ్‌లో ఈ సినిమా బాగా పెర్ఫామ్ చేస్తుందని తెలుస్తుంది. డే 1 కే తమిళ నాట 11 కోట్ల మేర గ్రాస్ వస్తే ఇపుడుడే2కిమరింతబెటర్ వసూళ్లు వచ్చినట్టుగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో ఇడ్లీ కడై తమిళ్ వెర్షన్ లో మాత్రం మంచి రన్ నే చూసేలా ఉందని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి జీవీప్రకాష్‌సంగీతంఅందించగాఆకాష్ బాస్కరన్, ధనుష్‌లునిర్మాణం వహించారు. అలాగేఅరుణ్ విజయ్, సత్యరాజ్, రాజ్ కిరణ్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు.




## దసరా సందర్భంగా రామ్ అబ్బరాజు2 అనౌన్స్‌మెంట్..



ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ మరో ఎక్సయిటింగ్ కొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసింది. హిలేరియస్ బ్లాక్‌బస్టర్ సామజవరగమనను అందించిన తర్వాత కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు, దర్శకుడు రామ్‌అబ్బరాజు మరోసారి ఈ వెంచర్ కోసం జతకడుతున్నారు. ఇది మరింత వైల్డ్‌గా, ఫన్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. 'శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు 2' కంప్లీట్ డిఫరెంట్ స్టయిల్‌లో కొత్త కథాంశంతో కూడిన ఫ్రెష్ స్క్రిప్ట్. కాన్సెప్ట్, హైవోల్టేజ్ హ్యూమర్ ఎక్కువగా వుండే కథనంతో, ఈ చిత్రం నాన్‌స్టాప్ వినోదాన్ని అందించబోతోంది .ఈ చిత్రం దసరా శుభ సందర్భంగా ఈరోజు గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ముహూర్తపుసన్నివేశానికి సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్ క్లాప్ కొట్టారు. స్క్రిప్ట్‌ను నారా రోహిత్‌తో కలిసి నిర్మాతలకు అందజేశారు. నరేష్, వెన్నెల కిషోర్, సుదర్శన్, దర్శకులు వివేక్ ఆత్రేయ, హసిత్ గోలి కూడా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. సామజవరగమనకి పని చేసిన రైటర్స్ భాను భోగవరపు, నందు సావిరిగణ మరోసారి స్క్రిప్ట్ రాయడానికి చేతులు కలిపారు. వారి సహకారం మరో మెమరబుల్ మూవీని అందించబోతోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బలమైన తారాగణం, టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. త్వరలో మేకర్స్ మిగతా వివరాలు తెలియజేస్తారు.

## అభిరామ్ చిత్రం ప్రారంభం



**అనురాధ దేవి** సమర్పణలో శ్రీ సాయి శోభనాచల పిక్చర్స్ తొలి చిత్రం షూటింగ్ విజయదశమిరోజు హైదరాబాద్‌లో నిరాడంబరంగా ప్రారంభ మయ్యింది. ఫిలింనగర్‌లోని సంస్థ కార్యాలయంలో దేవుడి పై తీసిన ముహూర్తపు షాట్ కు కళారత్న భగీరథ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా, హీరో అభిరామ్ క్లాప్ ఇచ్చారు, సినిమా స్క్రిప్టును సమర్పకురాలు ఎన్. ఆర్. అనురాధాదేవి అందించారు. పూజా కార్యక్రమాన్ని ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ దీపావళి తరువాత మొదలవుతుందని నిర్మాత అభిరామ్ రెడ్డి దాసరి చెప్పారు. ఈ సినిమా లవ్, థ్రిల్లర్ గా రూపొందుతుందని, ఈ తరానికి నచ్చే కథ తో నిర్మిస్తున్నామని, త్వరలోనే మిగతా నటీనటులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: అభిరామ్ రెడ్డి దాసరి, ఛాయాగ్రహణం: విజయ భాస్కర్ సద్దాల, సహ దర్శకుడు: సాయి, సంగీతం: మంత్ర ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నారాయణ రాజు ఎస్. బి, కూర్పు: కోటగిరి వెంకటేశ్వర రావు, నిర్మాత: అభిరామ్ రెడ్డి దాసరి. ఇంకా పేరు నిర్ణయించని ఈ ప్రేమ కథా చిత్రాన్ని సీనియర్ నిర్మాత అనురాధా దేవి సమర్పిస్తున్నారు.

# ఫొటో అప్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్త !

నానో బనానా ఏఐ శారీ ట్రెండ్.. ఇప్పుడు ఎక్కడ చూసినా దీని గురించిన చర్చ జరుగుతోంది. తమను తాము వింటేజ్ శారీ లుక్‌లో చూసుకోవాలని తమ ఫొటోల్ని ఈ టూల్లో అప్‌లోడ్ చేసేందుకు తెగ ఆరాటపడుతున్న చాలామంది అమ్మాయిలు. ఈ ఆత్రుతతోనే తన ఫొటోనూ అప్‌లోడ్ చేసిన ఓ యువతికి చేదు అనుభవం ఎదురైంది. తను శారీలో ఎంతో అందంగా ఉన్నానంటూ మురిసిపోతోన్న ఆమె తన ఒంటిపై ఉన్న పుట్టుమచ్చను చూసుకొని కంగుతింది. నిజానికి ఆమె అప్‌లోడ్ చేసిన ఫొటోలో ఆ పుట్టుమచ్చ ఆనవాళ్లే లేవు. అలాంటిది ఏఐఐ ఫొటోలో ఎలా వచ్చిందంటూ కంగారు పడిపోయింది. అంతేకాదు.. సోషల్ మీడియా, ఏఐ వేదికల్లో తమ ఫొటోల్ని అప్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలంటూ నేటి యువతకు సూచించే స్వీయానుభవంతో ఆమె పోస్ట్ చేసిన ఇన్‌స్టా వీడియో నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇలాంటి ఆన్‌లైన్ టూల్స్ వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వ్యక్తిగత గోప్యత/ భద్రత గురించి చర్చలు మొదలయ్యాయి.

సోషల్ మీడియా, ఏఐ ప్లాట్‌ఫామ్‌లలో పాపులరయ్యే ట్రెండ్స్‌ను పాటించడానికి చాలామంది ఆసక్తి చూపుతారు. అలా గూగుల్ జెమినీ రూపొందించిన 'నానో బనానా ఏఐ ట్రెండ్' నానో బనానా ఏఐ శారీ, ట్రెండ్ గత కొన్ని రోజులుగా తెగ వైరలవుతున్నాయి. ఇక యువతులు, మహిళలు ఒకరిని చూసి మరొకరు ఈ శారీ ట్రెండ్‌లో భాగమయ్యేందుకు పోటీపడుతున్నారు. అతి తక్కువ సమయంలో తమ ఫొటోను అందమైన 3డీ ఇమేజ్‌లా మార్చుకొనే వీలుండడంతో అందరూ ఈ కొత్త ఫీచర్‌ను ట్రై చేస్తున్నారు.

చీరకట్టును ప్రతి అమ్మాయీ ఇష్టపడుతుంటుంది. అందులోనూ వింటేజ్ స్టైల్ సారీలో మెరిసిపోవాలని కోరుకునే వారూ ఎంతోమంది. క్షణాల్లో అలా మెరిసిపోయే అవకాశాన్ని గూగుల్ జెమినీ రూపొందించిన 'నానోబనానా ఏఐ టూల్' ఇందులో భాగంగా మన ఫొటోను అప్‌లోడ్ చేసి.. శారీలుక్‌లో నేనెలా ఉంటానో చూపించమని ప్రాంప్ట్ ఇస్తే చాలు.. చీరకట్టులోకి మారిన మన ఫొటో కళ్ల ముందుకొచ్చేస్తుంది. ఇలా మనం ఇచ్చే ప్రాంప్ట్‌ని బట్టి వింటేజ్ లుక్, రెట్రో స్టైల్, అలనాటి బాలీవుడ్ దివాల మాదిరిగా క్షణాల్లో అందమైన ఫొటోను పొందచ్చు. ఇలా క్షణాల్లో తమ లుక్‌ని తీర్చిదిద్దుకోవచ్చన్న ఉద్దేశంతో చాలామంది అమ్మాయిలు ఈ ట్రెండ్‌ని ఫాలో అవుతున్నారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి!** " ఈ నేపథ్యంలో తమ వ్యక్తిగత ఫొటోలు, సోషల్ మీడియా/ఆన్‌లైన్/ఏఐఐ టూల్స్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని, తగిన జాగ్రత్తలు నిపుణులు సూచిస్తున్నారు.



✦ "సున్నితమైన, మనకు మాత్రమే వ్యక్తిగతమైన ఫొటోల్ని అప్‌లోడ్ చేయకపోవడమే మంచిది. లేదంటే సైబర్ నేరగాళ్లు వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం లేకపోలేదు. ✦. అప్‌లోడ్ చేసే ఫొటోల పైన వ్యక్తిగత సమాచారం (పేరు, ప్రదేశం, మొబైల్ నంబర్.. ఏదైనా ఉంటే వాటిని తొలగించాకే.. ఆ ఫొటో అప్‌లోడ్ చేయడం మంచిదట! ✦ సోషల్ మీడియా ఖాతాల్లో ప్రైవసీ సెట్టింగ్‌లను మరింత కఠినతరం చేయాలి. ఉదాహరణకు కఠినమైన పాస్‌వర్డ్స్ పెట్టుకోవడం, మీ ఫొటోలు-సమాచారం మీకు నమ్మకమైన వ్యక్తులు మాత్రమే చేసేలా సెట్టింగ్స్ చేసుకోవాలి. ✦ కొత్త ట్రెండ్స్ పేరుతో విచ్చలవిడిగా ఇలా ఫొటోల్ని ఆన్‌లైన్ చేయడం కూడా సరికాదు. దీనివల్ల మీ ఫొటోలు, సమాచారం, దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే అసలు ఇది ఉత్తమం. ✦ ఇదేవిధంగా ఏఐతో జనరేట్ చేసిన ఫొటోలను పరిశీలించాలి. ✦ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే ముందు దానికి సంబంధం చేయడంతో పాటు ఫొటోలను స్టోర్ చేసే పద్ధతులు కూడా .. ఏఐ జనరేట్ చేసిన ఫొటోలు, వెరిఫై చేసుకోగల విశ్వసనీయ టూల్స్‌ని మాత్రమే ఉపయోగించాలి.✦. ఈ నానో బనానా ట్రెండ్ మాయలో పడి ఓ వ్యక్తి రూ.70 వేలు కోల్పోవడం సైబర్ నేరాలకు తాజా ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ పరిశీలన ప్రస్తావిస్తూ ఇలాంటి ఆన్‌లైన్ ట్రెండ్‌లతో జాగ్రత్తగా ఉండాలని, లేదంటే నేరగాళ్ల మాయలో పడే ప్రమాదం ఉందంటూ ఐపీఎస్ ఆఫీసర్ సజ్జనార్ తాజాగా పెట్టిన ఎక్స్ పోస్ట్ ఎంతోమందిని ఆలోచింపజేస్తోంది. ◻

# మహిళా రైతులకు శిక్షణ ఇస్తూ..



**గ్రామీణుల జీవనాధారం ప్రధానంగా వ్యవసాయమే. అందులోనూ మహిళలదే కీలకపాత్ర. సాగులో మెలకువలు నేర్పినప్పుడే వాళ్లు సరైన ఆదాయం పొందగలరని నమ్మారు ఒడిశాకు చెందిన స్వర్ణలతా సాహు. ఆ లక్ష్యంతోనే మహిళా రైతులకు పర్యావరణహిత సాగు పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారు. వరి సాగులో సరికొత్త విధానాన్ని పరిచయం చేసి, మార్పు తీసుకొస్తున్నారు.**

రోజూ ఏదో ఒక గ్రామం వెళ్లటం, మోకాళ్లలోతు నీళ్లున్న వారి పొలాల్లోకి దిగి పరిశీలించడం, పంట గురించిన సలహాలివ్వటం... ఇదే స్వర్ణలత దినచర్య. దీనికి కారణం పర్యావరణంపై తన కున్న ప్రేమే. ఒంటరిగా ఏదీ చేయలేం... అనుకున్న ఆమె.. గ్రామంలోని లిపికా ఎన్జీవో సాయంతో ఎనోహాన్సింగ్ క్లైమేట్ రిజీలియన్స్ ఆఫ్ ఇండియాస్ కోస్టల్ కమ్యూనిటీ (ఈసీఆర్ఐసీసీ)లో చేరారు. తీరప్రాంతాలే లక్ష్యంగా అక్కడి మహిళలకు సాగుపై శిక్షణ ఇచ్చే సంస్థ ఇది. అందులో క్లైమేట్ ఛాంపియన్‌గా శిక్షణ పొందారు. ఆపై ఒడిశాలోని గంజాం జిల్లా బహుడా నుంచి తన పని కోసం స్వర్ణ. ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవించే ప్రాంతమది. అక్కడి ఆడవాళ్లకు వారి ఉత్పాదకత పెంచేందుకు సాయపడే సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ (ఎస్ఆర్ఎ)ను పరిచయం చేశారు. దీనిద్వారా నీరు, విత్తనాలు, ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చు. ముఖ్యంగా మీథేన్ వాయు ఉద్గారాలు తగ్గి,



పర్యావరణానికి హాని కలగదు. ఇందులో భాగంగా కమ్యూనిటీ సమావేశాలను ఏర్పాటు చేయ డం, ఫార్మర్ ఫీల్డ్ స్కూల్స్, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహిస్తున్నారు. అక్కడి చిన్న, సన్నకారు రైతులకు ఈ విధానం ఎంతగానో తోడ్పడుతోంది. మొదట్లో స్వర్ణ నిర్వహించే ఈ అవగాహన కార్య క్రమాలకు హాజరు కావటానికి మహిళలకు సమయం ఉండేది కాదు. కానీ, ఈ ఆర్ఐ పద్ధతి గురించి తెలుసుకునే చాలా మంది మహిళలు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. కుటుంబాన్ని కూడా ఆ విధానాన్ని పాటించేందుకు ఒప్పించారు. పెళ్లయ్యాకే ఇంటర్ పూర్తి చేశారు స్వర్ణ. అయితే, 2023లో భర్త చనిపోయారు. తన ఇద్దరు పిల్లలు, అత్త మామల్ని చూసుకుంటూనే రైతులకోసమూ పనిచేస్తున్నారు. జీవితానికి అర్థమే లేదనుకున్నప్పుడు నాకు ఈ బాధ్యత దక్కింది. పర్యావరణ పరిరక్షణ, రైతుల కోసం పనిచేస్తున్నందుకు ఆనందంగా ఉంది అంటారు స్వర్ణ. ◻



పట్టు లేని పండగలను మనం ఊహించగలమా? చూపులకు రాయల్ లుక్‌నీ.. కట్టుకుంటే శరీరానికి హాయినీ ఇస్తుంది. అందుకే పట్టు అంటే మన ఆడవాళ్లకి అంత ప్రేమ. పండగల సందడంతా మనదే! ఈ ఆటపాటకి మనతోపాటుగా దుస్తుల మెరుపూ నృత్యం చేసున తన్నట్టుగా ఉంటే చూడటానికి కళ్లు మాత్రం ఏం సరిపోతాయి. ఇవన్నీ సాధ్యమవ్వాలంటే మరి పట్టు ఉండాలిగా! అలాగని చీర, పట్టు పరికిణీ ప్రతి పండగకీ అదేనా అనిపిస్తే.. ఈ సారి లాంగ్ ఫ్రాక్‌లు ఎంచుకోండి. చిన్న చిన్న ఫ్రిల్స్‌తో వస్తున్న

# అందమైన పట్టు అనార్కలీ

అనార్కలీ, లాంగ్‌ఫ్రాక్‌లు ఇప్పుడు తెగ సందడి చేస్తున్నాయి. ఒవైపు చేత్తో పట్టుకుని అలా అలా కాలు కదిపితే ఫ్రిల్స్ అలల్లా ఎగిసిపడుతున్నట్టే కనిపిస్తాయి. బనారసీ, టస్సర్, చందేరీ, నారాయణపేట, కాంచీపురం, పైథానీ.. ఒకటా రెండా కోరుకున్న పట్టు చక్కని డ్రెస్‌గా కళ్లముందుకు వచ్చేస్తుంది. చీరనే కుట్టించేసుకోవచ్చు. సమయం లేదా రెడీమేడ్‌వీ దొరికేస్తున్నాయి కోరుకున్న రంగుల్లో.. నచ్చిన కలంకారీ, పిచ్‌వాయీ, నెమళ్లు మొదలైన డిజైన్లలో మీకు నచ్చిందేదో ఎంచుకోవమే తరవాయి. ఆధునిక లుక్‌తో అదిరిపోయే పట్టులో

# పిప్పర్‌మెంట్ క్యాండీలివి !

వారానికో రకమైన క్యాండీ చేయడం నేర్చుకుంటున్నారు కదా! ఈసారి పిప్పర్మెంట్ క్యాండీలెలా చేయాలో చూడండి. ఇవెంత బాగుంటాయంటే పిల్లలకే కాదు పెద్దవాళ్లకే తినాలనిపిస్తుంది.



**పిప్పర్మెంట్ క్యాండీల కోసం..** పంచదార 2 కప్పులు, పంచదార పొడి 3 చెంచాలు, కార్న్ సిరప్ ముప్పావు కప్పు, పిప్పర్మెంట్ ఎక్స్‌ట్రాక్ట్ అర చెంచా, ఫుడ్ కలర్ ఒక చుక్క, ఆలివ్ నూనె 2 చెంచాలు, వెన్న చెంచా తీసు కోవాలి.

ఎలా చేయాలంటే. తొమ్మిదంగుళాల వెడల్పయిన ప్యాన్లకు ఆలివ్ నూనె, బేకింగ్ షీటి కి వెన్న రాయాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, కప్పు నీళ్లు, కార్న్ సిరప్ వేసి సన్న సెగ మీదుంచి కలియతిప్పుతుండాలి. చిక్కగా అయ్యాక దించేసి.. పిప్పర్మెంట్ ఎక్స్‌ట్రాక్ట్, ఫుడ్ కలర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు ప్యాన్లలోకి సమంగా తీసి.. ఆ ప్యాన్లను ఓ పావుగంట నీళ్లలో ఉంచాలి. చల్లారగానే అంగుళం సైజు ముక్కలుగా కోసి బేకింగ్ షీట్ మీద వేయాలి. వాటి మీద పంచదార పొడి చల్లి అన్నిటికీ పట్టేలా కలపాలి. ఇలా చేయడం వల్ల ఒకదానికొకటి అంటుకోవు. ◻

ఆరోగ్య భాగ్యం

# చుక్కకూర ప్రయోజనం -2



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**జీర్ణక్రియ :** చుక్కకూరలోని అధిక ఫైబర్ తిన్న తర్వాత భోజనం అరుగుదలకి, కడుపుబ్బరానికి మంచిది. ఆహారం తెలికగా జీర్ణమై శరీరానికి ఆరోగ్యాని స్తుంది. నోటిలో అధిక లాలాజలం ఊరేవారికి మంచిది. ఆకలిని కల్గిస్తుంది. స్కర్వీ వంటి జీర్ణకోశ సమస్యల్ని వేడిని, మంటని తగ్గిస్తుంది. అరుచిని తొలగించి రుచిని పుట్టిస్తుంది. అనారోగ్యాలతో బాధపడి కోలుకునేవారికిది పథ్యంగా పనిచేస్తుంది. **ఎముకలు:** చుక్క కూరలోని కాల్షియం వల్ల ఎముకలు పటిష్టంగా తయారవుతాయి. ఇది ఎదిగే పిల్లలకి చాలా మంచిది. పిప్పిపళ్ళురావు. పాలదంతాలు, శాశ్వత దంతాలు వచ్చేటప్పుడు పిల్లలకి మంచిది ఎత్తు పెరుగుతారు. వయస్సుపెరిగే కొద్దీ వచ్చే సమస్యల్ని కీళ్ళనొప్పులు మెడ, నడుంనొప్పి, ఎముకల పెళుసుదనాన్ని తగ్గించి ఆస్టియోఫారోసి వ్యాధి రాకుండా కాపాడుతుంది. **గుండె..** చుక్కకూరలోని పారీఫినాల్స్ వల్ల గుండెలో బ్లాక్స్ రాకుండా చేస్తుంది. రక్తనాళాల్లో క్రొవ్వు పేరుకోకుండా బి.పిని కంట్రోల్ చేస్తుంది రక్తనాళాల్లో నైట్రిక్ ఆక్సైడ్ సెల్ బాగా పెరిగేట్లు చేస్తుంది. దీని వల్ల రక్తనాళాలు వ్యాకోచం చెందుతాయి. హార్ట్ఎటాక్, స్ట్రోక్, పక్షవాతం, గుండె జబ్బులు రావు. రక్తప్రసరణ మెరుగవుతుంది. ఎనర్జీలెవల్స్ పెరుగుతాయి.

**జుట్టు :** జుట్టు రాలడం, చుండ్రు, తెల్లవెంట్రుకలు రావడం వంటి సమస్యలు రాకుండా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. స్కాల్ప్‌కి మంచిది. కేశ సౌందర్యం మెరుగుపడుతుంది.
**చర్మం:** చుక్కకూరలోని విటమిన్ ఎ,సి వల్ల గజ్జి, తామరపొక్కలు, గుల్లలు, పుండ్లు, చర్మ సమస్యలు తగ్గిపోతాయి. గాయాలు, పుండ్లపై చుక్కాకు రసం రాస్తే త్వరగా మానుతుంది.
**ఇమ్యూనిటీ :** చుక్కకూరలోని విటమిన్ సి, ఆంటీ ఆక్సిడెంట్స్ వల్ల తరుచు రోగాల బారిన పడకుండా చేస్తుంది. జ్వరాలు, ఎలర్జీలు, వైరల్ ఇన్ఫెక్షన్స్ రావు, వాపులు తగ్గుతాయి.
**కేన్సర్‌లు :** చుక్కకూరలోని ఆంటి కేన్సర్ గుణం వల్ల శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి రొమ్ము కేన్సర్ గుణంవల్ల శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి రొమ్ము కేన్సర్, సర్విక్స్ కేన్సర్, మలాశయ కేన్సర్, రెక్టల్ కేన్సర్‌ల్ని తగ్గిస్తాయి.
**స్త్రీలు:** బహిష్టు సమస్యలని, అధిక రక్తస్రావాన్ని నిరోధిస్తుంది. రక్తహీనతలు లేకుండా చేస్తుంది. ఇది గర్భిణీలకి, బాలింతలకి మంచిది. బాలింతలకి పాలు పడతాయి.
**పురుషులు:** చుక్కకూరలోని జింక్, విటమిన్ల వల్ల వీర్యవృద్ధి, వీర్యకణాల చలనం, లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. సంతానలేమి ఉన్నవారు దీన్ని వాడడం మంచిది.
**కన్ను :** చుక్కకూరలోని 'ఎ' విటమిన్ వల్ల రేచీకటి, దృష్టిలోపాలు తగ్గుతాయి. కంటిచూపు మెరుగవుతుంది. ఎదిగే పిల్లలకి చుక్కకూరని ఇవ్వడం వల్ల కంటి అద్దాలు వాడనవసరం లేదు. **యూరిన్ :** మూత్రంలో మంట, నొప్పి, చీము రావడాన్ని తగ్గించి మూత్ర విసర్జన సాఫీగా జారీ అయ్యేలా చేస్తుంది. మూత్రమార్గంలో ఏర్పడే ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తుంది. **డయాబెటిస్:** రక్తంలో చక్కెరస్థాయిల్ని తగ్గించి డయాబెటిస్‌ని కంట్రోల్‌లో ఉంచుతుంది. శరీర భాగాలకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగేలా చేసి అదనపు క్రొవ్వు, బరువుని తగ్గిస్తుంది.
**జాగ్రత్తలు:** చుక్కకూరని పచ్చిగా తినకుండా ఉంటేనే మంచిది. వండే తినాలి. దుంపకూరలు, పప్పుదినుసులతో ఈ ఆకు కలిపి వండితే త్వరగా జీర్ణం అయ్యేట్లు చేస్తుంది. శరీరంలో వేడి అధికంగా ఉన్నవారు వారానికి 2-3 సార్లు తినాలి. చుక్క కూరని సాధ్యమైనంతవరకు మాంసం కూరలో వేసి వండకూడదు. ఇది అధిక దాహాన్ని తగ్గిస్తుంది. చుక్కకూరలోని 'బి' కాంప్లెక్స్ విటమిన్స్ చిగుళ్ళవాపు, నోటి ఆరోగ్యానికి మంచిది. మ్యాజిక్‌లాంటి చుక్కకూరలోని విశిష్టమైన పోషకాలు శరీరానికి అందేలా చేస్తుంది. వారానికి 1-2 సార్లు మితంగా తీసుకోవడం మంచిది. చుక్కకూర ఎక్కువగా తింటే జననేంద్రియాలకు చెడు కల్గుతుంది. కిడ్నీస్టోన్స్, లివర్, కిడ్నీ, జీర్ణకోశానికి డామేజ్‌కల్గి ప్రాబ్లమ్ వస్తుంది. విరేచనాలు, పైత్యం కఫం ఎక్కువై వేడిచేస్తుంది. కడుపులో అనజీగా ఉండి ప్రేవుల కదలికల్ని ఎక్కువ చేస్తుంది. ప్రేవుల్లో కడుపులో మ్యూకస్, నీటిశాతం ఎక్కువై కడుపునొప్పి లాంటి సమస్యలు వస్తాయి. కొందరిలో ఆక్సాలేట్స్, ఒనిత్రక్వినోన్ వల్ల తుమ్ములు, దద్దుర్లు, వాంతులు కళ్ళు నీళ్ళుకారడం, బ్రీతింగ్ ప్రాబ్లమ్స్, బ్రాంకైటిస్, సైనసైటిస్ వంటి ఎలర్జీలు వచ్చే అవకాశముంది. ◻

# నామస్మరణ

ఎవరైనా, ఎంత గొప్పవారైనా ప్రారబ్ధ కర్మను అనుభవించి తీరాల్సిందే అని చాలమంది చెబుతుంటారు. అయితే భగవన్నామస్మరణ చేస్తే సూర్య కిరణాలకు మంచు కరిగినట్లుగా ప్రారబ్ధం కరిగి పోతుందని, బిల్వమంగళుని కథలోని పరమార్థం ఇదే అని అంటారు భగవాన్ సత్యసాయి. బిల్వమంళుడు 500 సంవత్సరాల క్రితం కేరళలో జీవించినవాడు. శ్రీకృష్ణుని భక్తుడు. ఎంత గొప్ప భక్తుడంటే ఆయన పిలిచిన వెంటనే శ్రీకృష్ణుడు ఆయన ముందు ప్రత్యక్షమయ్యేవాడు. ఒకసారి చాలా కాలంగా కడుపునొప్పితో బాధపడే ఒక వ్యక్తి బిల్వ మంగళునితో నా ఈ కడుపునొప్పిఎలా తగ్గుతుందో, ఎప్పుడు తగ్గుతుందో, ఎప్పుడు తగ్గుతుందో నీవు కృష్ణున్నీ అడిగి తెలుసుకొని చెప్పు అన్నాడు. అతని ప్రారబ్ధం అతడు అనుభవించ వలసినదే, కానీ దొర్లటం ఆగితే మాత్రం తగ్గి పోతుంది, అన్నాడు శ్రీకృష్ణుడు. దొర్లటం అంటే బాధ కల్గినపుడు అటు, ఇటు దొర్లటం అనుకున్నాడు ఆ దురదృష్టవంతుడు. ఒక జన్మనుంచి మరొక జన్మకు దొర్లటం అని అనుకున్నాడు బిల్వమంగళుడు.ఆ బాధపడేవ్యక్తి దొర్లకుండా ఉండటం దుర్లభమనుకొని ఇంకా గొప్ప జ్ఞానిని కలిసి నివారణా మార్గాన్ని కనుగొనటానికి కేరళనుండి కాశీకి వెళ్లదలిచాడు. దారిలో ఒకచోట కూరూరమ్మను కలిశాడు. ఆమె ఒక అన్నదాన సత్ర నిర్వాహకురాలు. ఆమెతో తన కష్టాన్ని తెలిపాడు తాను గంగానదిలో దూకి చావాలనుకొన్నట్లు చెప్పాడు. ఆమె అతనిని తెలివితక్కువతానికి నిందించి 'గోపీజన వల్లభాయి నమః' అను మంత్రాన్ని నిరంతరం స్మరించు, అన్ని బాధలు తొలగుతాయి అని చెప్పింది. అతడు అలాగే చేశాడు. ఆశ్చర్యంగా అతని బాధ అదృశ్యమైంది అతడు కాశీయాత్ర పూర్తి చేసికొని ఇంటికి తిరిగి వచ్చాడు. అది ఎలా సాధ్యం, కృష్ణుని మాటల అర్థం ఏమిటి? అనుకొన్నాడు బిల్వ మంగళుడు.కృష్ణుడి కనపడి ప్రాపంచిక విషయాల్లో మనసు దొర్లకుండా ఉండే తగ్గుతుందని తాను చెప్పినట్లు వివరించాడు. భగవన్నామ స్మరుణచేస్తూ అన్యచింతన లేక పోవటం వల్ల అతనికి నొప్పి తగ్గింది, ప్రారబ్ధకర్మ నశించింది.

- రాచమడుగు శ్రీనివాసులు.

ఆధ్యాత్మికం

# గోరు లాంటి కత్తి



కొత్తిమీర, పుదీనా, గోంగూర వంటివి గిల్లడానికి, మిరప కాయలు తొడిమెలు తీయ డానికి, ఉల్లి, వెల్లుల్లి, అల్లం లాంటివి పొట్టు తీయ డానికి బొటన వేలి గోరు వాడు తుంటాం. కానీ ఇలాంటి పనులు ఎక్కువ సేపు చేస్తే గోరు నొప్పెడు తుంది. అలాంటి బాధేం లేకుండా.. ఆ పనులు తేలిగ్గా చేసేందుకు సిలికాన్ థంబ్ ఫింగర్ నైఫ్ వచ్చేసింది. ఈ చిన్న తొడుగు వంటి సాధనాన్ని బొటనవేలుకు తగిలిస్తే చాలు చిట్టికత్తిలా సులువుగా పని చేసే స్తుంది. బంగాళదుంపల్ని కూడా పీల్ చేయకుండా దీంతోనే పొట్టు తీసే యొచ్చు. వీటిల్లో చూపుడు వేలుకు మరో తొడుగు ఉండే లాంటివీ దొరుకు తున్నాయి. ◻

# రంగులు మార్చే రుద్రాక్ష పూలు

ప్రకృతి అంతా పూలతో సింగారించుకుని మురిసిపోతుంది. అందుకే వేడుకల్లో పూలదే సందడి. వాటిల్లో రుద్రాక్ష పూలది ప్రత్యేక స్థానం. సాయంత్రం వేళ విచ్చుకునే ఈ పూలను తాజాగా కోసి.పూజకు ఉపయోగిస్తారు. వీటినే చంద్రకాంత, సాయంత్రం పూలని కూడా పిలుస్తారు. ఇవి ముదురు గులాబీ, పసుపు, ఎరుపు, కాషాయం వంటి ఎన్నో వర్ణాల్లోనూ విచ్చుకుంటాయి. అంతేకాదు, ఒకే మొక్కకి రెండు మూడు రంగుల్లోనూ పేలు వస్తాయి. అంతేకాదు, అప్పటివరకూ ఓ కలర్‌లో పూసిన మొక్కే కొన్నాళ్ల తరవాత మరో రంగులో పుష్పించడమూ వీటిల్లో చూడొచ్చు. ఈ రుద్రాక్ష పూలను మన సంస్కృతికి నెలవైన పలు పండగలు, ఈ కాలంలో పూజల్లో వాడతాం. అయితే, ఈ మొక్క పుట్టింది మాత్రం పెరూ దేశంలోనట. ఆహార రంగుల తయారీలో ఈ పూలను వినియోగిస్తారు. వీటికి ఔషధ గుణాలు ఎక్కువ. ముఖ్యంగా ఆయుర్వేద వైద్యంలో మూత్ర సమస్యలు, వాపులు తగ్గేందుకూ, గాయాలకు చికిత్సగానూ వాడతారు. వీటి వేర్లకు విరేచనాలను తగ్గించే శక్తి ఉందట. ముఖ్యంగా ఇందులోనికొన్ని రకాల వితనతనాలను కాస్మెటిక్



డైలుగానూ వినియోగిస్తారట. ◻

# వెస్టిండీస్ టెస్ట్‌లో.. భారత్ 286 రన్స్ ఆధిక్యం





### బౌలర్లపై విరుచుకుపడిన జురెల్, జడేజా
### ముగిసిన రెండో రోజు ఆట

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో భారత్ పట్టుబిగించింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదువికెట్ల నష్టానికి భారీగా 448 పరుగులు చేసింది. క్రీజులో రవీంద్రజడేజా (104), వాషింగ్టన్ సుందర్ (9)లు ఉన్నారు. భారత్ ప్రస్తుతం 286 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 162 పరుగులకే ఆలౌటైంది. ఓవర్ నైట్ స్కోరు 121/2తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్, మరో 327 పరుగులు జోడించి 3 వికెట్లు మాత్రమే కోల్పోయింది. ఓవర్ నైట్ బ్యాటర్లు గిల్ (18), కేఎల్ రాహుల్ (53) లు రెండో రోజు విండీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. హాఫ్ సెంచరీ సాధించిన తరువాత గిల్ (50) రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో జస్టిన్ గ్రేవ్స్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరుకున్నాడు. గిల్, రాహుల్ జోడీ 3వ వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

తొలి రోజు హాఫ్ సెంచరీ చేసిన రాహుల్ రెండో రోజూ పరుగులు రాబట్టి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే లంచ్ తర్వాత తొలి ఓవర్‌లో ఔటయ్యాడు. స్వల్ప వ్యవధిలో గిల్, రాహుల్ ఔటనప్పటికి వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఇద్దరూ పోటాపోటీగా పరుగులు సాధించారు. ధ్రువ్ జురెల్ (125) సెంచరీ సాధించిన అనంతరం ఖరీ పియర్ బౌలింగ్‌లో షై హోప్ క్యాచ్ అందుకోవడంతో పెవిలియన్‌కు చేరుకున్నాడు. జడేజా, ధ్రువ్ జురెల్ జోడి 5వ వికెట్‌కు 206 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జురెల్ ఔటైన కాసేపటికే జడేజా కూడా టెస్టుల్లో తన ఆరో సెంచరీని నమోదు చేశాడు. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి మరో వికెట్ పడకుండా రెండో రోజును ముగించారు.

# మహిళల వన్డేలో.. చిత్తుగా ఓడిన పాకిస్థాన్

### 7 వికెట్లు తేడాతో బంగ్లా సూపర్ విక్టరీ



**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ 2025లో పాకిస్తాన్ తమ తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాజయాన్ని చవిచూసింది. బంగ్లా దేశ్ మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించి అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. బంగ్లా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పాక్‌ను 38.3 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ చేశారు. బంగ్లాదేశ్ తరఫున 20 ఏళ్ల యువ పేసర్ మారుఫా అక్తర్ అద్భుతంగా రాణించింది. ఆమె తొలి ఓవర్లోనే ఓపెనర్ ఓమైమా సోహైల్, సిద్రా అమీన్‌ను డకౌట్ చేసి పాకిస్తాన్ పతనాన్ని ప్రారంభించింది. ఆ ఓవర్ ముగిసేసరికి పాకిస్తాన్ స్కోరు 2 పరుగులకే 2 వికెట్లుగా ఉంది. ఎడమచేతి స్పిన్నర్ నాహిదా అక్తర్ కూడా 19పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టి పాక్‌ను మరింత కష్టాల్లోకి నెట్టింది. బ్యాటింగ్‌లో ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో రాణించకపోవడంతో పాకిస్తాన్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. రమీన్ షమీమ్ (23) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఇక 130 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ కేవలం 31.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రూబియా హేదర్ 77 బంతుల్లో 8 ఫోర్లతో నాటౌట్ 54 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆమె కెప్టెన్ నిగర్ సుల్తానా (23) తో కలిసి మూడో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి బంగ్లాను సునాయాసంగా గెలుపు తీరాలకు చేర్చింది. గత 2022 ప్రపంచ కప్‌లో కూడా పాకిస్థాన్, బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోవడం గమనార్హం.



### ఐసిసిర్యాంకింగ్స్‌లో..
# అభిషేక్ వరల్డ్ రికార్డు
### బ్యాటర్ల ర్యాంకింగ్‌లో అగ్రస్థానం
### టాప్ బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి

**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో 7 మ్యాచ్‌లలో 314 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గెలుచుకున్న యంగ్ సెన్సేషన్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. తాజా ఐసీసీ పురుషుల టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్న అభిషేక్ ఏకంగా 931 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ఇది టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ పాయింట్లు. అభిషేక్ 2024లో టీ20 క్రికెట్‌లోకి అడుగుపెట్టినప్పటి నుండి కేవలం 15 నెలల్లోనే 849 పరుగులు చేసి సంచలనం కలిగించాడు. అతని స్ట్రైక్ రేట్ దాదాపు 200గా ఉంది. ఈ స్వల్ప కాలంలోనే అభిషేక్ రెండు సెంచరీలు కూడా నమోదు చేసుకున్నాడు. అభిషేక్ సాధించిన 931 పాయింట్లు, టీ20 క్రికెట్‌లో గతంలో ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలన్ 2020లో నెలకొల్పిన 919 పాయింట్ల రికార్డును బద్దలు కొట్టాయి. అంతేకాకుండా, గతంలో భారత నంబర్ వన్ బ్యాటర్లుగా ఉన్న సూర్యకుమార్ యాదవ్ (912 పాయింట్లు), విరాట్ కోహ్లీ (909 పాయింట్లు) రికార్డులను కూడా అభిషేక్ అధిగమించాడు. ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో అభిషేక్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో ఉన్నాడు. ఆసియా కప్ ఫైనల్‌లో అద్భుతంగా రాణించిన తిలక్ వర్మ మూడో స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్‌లో భారత్‌పై అద్భుతమైన సెంచరీ సాధించిన పథుమ్ నిస్సంక ఐదో స్థానానికి ఎగబాకాడు. ఇక టీ20 క్రికెట్‌లో వరుణ్ చక్రవర్తి టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అలాగే ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అనూహ్య మార్పు చోటు చేసుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న హార్దిక్ పాండ్యా తన స్థానాన్ని కోల్పోయాడు. పాకిస్తాన్ ఆటగాడు సైమ్ అయూబ్ హార్దిక్ పాండ్యాను అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో సైమ్ అయూబ్ బౌలింగ్‌లో మంచి ప్రదర్శన కనబర్చినప్పటికీ, బ్యాటింగ్‌లో మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు. ఏడు ఇన్నింగ్స్‌లలో నాలుగుసార్లు డకౌట్ అయి, కేవలం 37 పరుగులు మాత్రమే చేశాడు.



### వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్‌లో
# మీరాబాయికి రజతం

**న్యూఢిల్లీ:** ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ పతక విజేత, భారత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రజత పతకాన్ని సాధించింది. నార్వేలోని ఫోర్డ్‌లో శుక్రవారం జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా 48 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఈ రజతాన్ని గెలుచుకుంది. ఇది మార్యూ ఈవెంట్‌లో మూడవ పతకం. 2024 పారిస్ తర్వాత ఈ ఏడాది ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 48 కిలోల స్వర్ణం గెలుచుకోవడం ద్వారా తిరిగి పోటీలోకి దిగిన మీరా మొత్తం 199 కిలోలు (84 కిలోల స్నాచ్ + 115 కిలోలు క్లీన్ అండ్ జెర్క్) ఎత్తింది. ఇక ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్ గమ్ మొత్తం 213 కిలోల (91 కిలోలు + 122 కిలోలు) ఎత్తి స్వర్ణం గెలుచుకుంది. క్లీన్ అండ్ జెర్క్‌తో పాటు మొత్తం మీద కొత్త ప్రపంచ రికార్డులను సృష్టించింది. థాయిలాండ్‌కు చెందిన థాన్యాథోన్ సుక్చారోయెన్ మొత్తం 198 కిలోల (88 కిలోల స్నాచ్ + 110 కిలోలు క్లీన్ జెర్క్) ఎత్తి కాంస్యం గెలుచుకుంది.





### వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో..
# ధరమ్‌బీర్ రజతం, కౌశిక్ కాంస్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025లో భారత్ తన ఖాతాలో మరో రెండు పతకాలను జోడించింది. ధరంబీర్ నైన్, అతుల్ కౌశిక్ రజతం, కాంస్య పతకాలను దక్కించుకున్నారు. పారిస్ పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ధరంబీర్ పురుషుల ఎఫ్51 క్లబ్ త్రోలో తృటిలో స్వర్ణ పతకాన్ని కోల్పోయి రజతం గెలుచుకున్నాడు. 36 ఏళ్ల అతను తన చివరి ప్రయత్నంలో 29.71 మీటర్లు నమోదు చేశాడు. సెర్బియాకు చెందిన అలెగ్జాండర్ రాడిసిక్ 30.36 మీటర్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే పారాలింపిక్ పతక విజేత అయిన మరో భారతీయుడు ప్రణవ్ సూర్మా 28.19 మీటర్లు ఎగిరి ఐదవ స్థానంలో నిలిచాడు. పురుషుల డిస్కస్ త్రో ఎఫ్57లో, అతుల్ కౌశిక్ 45.61 మీటర్ల ప్రయత్నంతో కాంస్యం సాధించాడు. దానితో, యోగేష్ కథునియా తర్వాత ఈ విభాగంలో ప్రపంచ పతకం గెలుచుకున్న రెండవ భారతీయుడిగా నిలిచాడు. లిబియాకు చెందిన మహమూద్ రజాబ్ 46.73 మీటర్లతో గెలుచుకోగా, క్యూబాకు చెందిన గిల్లెర్మో వరోనా గొంజాలెజ్ 46.21 మీటర్లతో రెండవ స్థానంలో నిలిచాడు. మిగతా చోట్ల, భారత్ పతకాలను తృటిలో కోల్పోయింది. పురుషుల 400 మీటర్ల టీ47 ఫైనల్‌లో దిలీప్ గవిట్ సగం వరకు ఆధిక్యంలో నిలిచి, చివరి దశలో నాల్గవ స్థానానికి పడిపోయాడు. పురుషుల డిస్కస్ ఎఫ్37లో 19 ఏళ్ల హానీ తన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల అరంగేట్రంలో 51.22 మీటర్లతో పోడియం వెలుపల నాల్గవ స్థానంలో నిలిచాడు.



### ఇకపై అదేరోజు బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్సులు

**ముంబయి,అక్టోబరు 3:** బ్యాంకు కస్టమర్లకు ఇది శుభవార్త. చెక్కుల క్లియరెన్స్ కోసం ఇకపై రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. రిజర్వ్ బ్యాంకు తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, ఈనెల 4 నుంచి 'అదే రోజు చెక్ క్లియరెన్స్' విధానం అమల్లోకి రానుంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ సహా పలు బ్యాంకులు ఈ కొత్త విధానాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించాయి. ఈ నూతన విధానం వల్ల, కస్టమర్లు తమ ఖాతాలో జమ చేసిన చెక్కులు కేవలం కొన్ని గంటల్లోనే క్లియర్ అవుతాయి. చెల్లింపుల ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ ఈ మార్పులు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, చెక్కులు బౌన్స్ కాకుండా ఉండేందుకు ఖాతాదారులు తమ అకౌంట్లలో సరిపడా నగదు నిల్వలు ఉంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. అలాగే చెక్కులపై వివరాలను తప్పులు లేకుండా స్పష్టంగా నింపాలని కోరుతున్నాయి. చెక్కుల భద్రతను పెంచేందుకు 'పాజిటివ్ పే సిస్టమ్'ను తప్పనిసరిగా ఉపయోగించాలని బ్యాంకులు స్పష్టం చేశాయి. దీని ప్రకారం, రూ.50,000 కంటే ఎక్కువ విలువైన చెక్కులను బ్యాంకులో జమ చేయడానికి కనీసం 24 గంటల ముందు ఖాతాదారులు కొన్ని కీలక వివరాలను బ్యాంకుకు అందించాలి. అకౌంట్ నంబర్, చెక్ నంబర్, తేదీ, చెక్ మొత్తం, లబ్ధిదారుడి పేరు వంటి వివరాలను బ్యాంకుకు తెలియజేయాలి. ఈ వివరాలను రీజనల్ ఆఫీసులకు కేటాయించిన ఈమెయిల్ ఐడీలకు పంపించాల్సి ఉంటుంది. బ్యాంకులో చెక్కును సమర్పించినప్పుడు, ముందుగా అందించిన వివరాలతో సరిపోల్చి చూస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే చెక్కును క్లియర్ చేస్తారు. వివరాలు సరిపోలకపోతే ఆ చెక్కును తిరస్కరిస్తారు. రూ.5 లక్షలు దాటిన చెక్కులకు పాజిటివ్ పే విధానం తప్పనిసరి అని ఆర్‌బీఐ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం చెక్కుల క్లియరెన్స్ కోసం బ్యాంకులు చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్)ను వాడుతున్నాయి. దీనివల్ల ఏటీఎం లేదా డ్రాప్ బాక్సుల్లో వేసిన చెక్కులు క్లియర్ కావడానికి కనీసం రెండు రోజులు పడుతోంది. కొత్త విధానంతో ఈ జాప్యం పూర్తిగా తొలగిపోనుంది.

# ఆవిష్కరణల రంగంలో గ్లోబల్ లీడర్ 'భారత్'

### మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్

**సియాటెల్, అక్టోబరు 3:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, బిలియనీర్లలో ఒకరైన బిల్ గేట్స్ భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆవిష్కరణల రంగంలో భారత్ ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలుస్తోందని, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా ఉందని ఆయన కొనియాడారు. భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సులేట్ జనరల్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బిల్ గేట్స్ మాట్లాడుతూ. 'ఈ రోజు భారత్ ఆ వి ... ష్కరణల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను కాపాడి, మెరుగుపరిచే పరిష్కారాలను అందిస్తోంది. వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో భారత్‌తో మా భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. గాంధీజీ ఆశయాలైన సమానత్వం, గౌరవం తమ ఫౌండేషన్ పనికి పునాది వంటివని గేట్స్ పేర్కొ... న్నారు. ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. వాషింగ్టన్, సియాటిల్ నగర ప్రభుత్వాల నుంచి సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో ప్రస్తుత ప్రపంచంలో గాంధీ విలువల ప్రాముఖ్యత అనే అంశంపై యూఎస్ గ్లోబల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు జొనాథన్ గ్రానోఫ్ ప్రసంగం చేశారు. బెల్వ్యూ పబ్లిక్ లైబ్రరీ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, సియాటిల్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వాషింగ్టన్ స్టేట్ సెనేటర్ వందనా స్లాటర్ పుష్పాంజలి ఘటించారు. సియాటిల్, బెల్వ్యూ నగరాల్లో జరిగిన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భారతఅమెరికన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు గాంధీజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించినట్లు భారత కాన్సులేట్ కార్యాలయం వెల్లడించింది.



# బయటి సవాళ్లు తట్టుకునే సత్తా భారత్‌కే ఉంది..

### ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ప్రపంచ ఆర్థికవ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇలాంటి తరుణంలో బయటి నుంచి ఆకస్మికంగా తగిలే షాక్‌లను తట్టుకోవడంతో భారత్ సామర్థ్యం బలంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్2025లో ఆమె పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయని, ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి భారత్‌కు కూడా దెబ్బేనని, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్‌కు ఉందని అన్నారు. దేశ ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోందని నిర్మలాసీతారామన్ చెప్పారు. యుద్ధాలు, వ్యూహాత్మక పోటీలు, సంఘర్షణ సరిహద్దులను తిరగ రాస్తున్నాయని అన్నారు. గతంలో బలంగా ఉన్న సంబంధాలు ఇప్పుడు పరీక్షలు ఎదుర్కొంటున్నాయి, కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందని చెప్పారు.

# మూచువల్‌ఫండ్స్‌లో కొత్తగా 12 ఫండ్స్..

**ముంబయి, అక్టోబరు 3:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 12 కొత్త ఫండ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వాటితో పాటుగా 3 స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌ఎఫ్‌ఐ)లు సైతం ఉన్నాయి. ఇప్పటికే కొన్ని ఫండ్స్ కొనుగోళ్లు మొదలయ్యాయి. తమ కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న గ్యాప్స్ పూరించేందుకు కొత్త స్కీమ్స్ లాంచ్ చేస్తున్నట్లు మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ప్రకటించాయి. న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా మార్కెట్లకు కొత్త తరం ఫండ్స్ తీసుకొస్తున్నట్లు పేర్కొన్నాయి. ఎస్‌ఎఫ్‌ఐ స్కీమ్స్ క్యాసిఫ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలైంది. ఈనెల 9వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక అల్టివా హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్, మ్యాగ్నమ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈటీఎఫ్ స్కీమ్స్ కోటక్ నిఫ్టీ 200 మూమెంటమ్ 30 ఈటీఎఫ్, డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్విలిటీ 30 ఈటీఎఫ్ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల్ 6వ తేదీతో ముగుస్తోంది. జిరోధా నిఫ్టీ 50 ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీతో ముగుస్తుంది. వాటితో పాటుగా జియో బ్లాక్ రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్, ద వెల్త్ కంపెనీ ఫ్లెక్సీ క్యాప్ పండ్ సబ్‌స్క్రిప్షన్స్ వరుసగా ఈనెలలోనే 7వ తేదీ, 8వ తేదీల్లో ముగుస్తున్నాయి. సెక్టోరల్ ఫండ్ కేటగిరీలో మోతీలాల్ ఓస్వాల్ కన్సంప్షన్ ఫండ్, ఇన్వెస్కో ఇండియా కన్సంప్షన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల15, 17వ తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఎథికల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రూ కాంగ్లమరేట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 9, 17 తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఆర్బిట్రేజ్ ఫండ్, ద వెల్త్ కంపెనీ లిక్విడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 8వ తేదీన ముగుస్తుంది. జిరోధా నిఫ్టీ 50 ఇండెక్స్ పండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుంది. ఈ ఫండ్ హౌస్ అందిస్తోన్న ఏకైక డైరెక్ట్ ప్లాన్ ఇదే. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ హైరిస్క్ ఉంటుంది.



# వాణిజ్యం

## యూరోప్, ఆఫ్రికా దేశాలకు భారత్ చమురు ఎగుమతులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత్ తన ఇంధన ఉత్పత్తుల ఎగుమతులను వేగవంతం చేసింది. రష్యా రిఫైనరీలపై దాడులు తీవ్రం కావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో కొరత ఏర్పడింది. ఈ కొరతను భర్తీ చేయడానికి భారత్ ఎగుమతులను ముమ్మరం చేసింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ సంస్థలు బ్రెజిల్, టర్కీ, యూఏఈ, ఇంకా పలు ఆఫ్రికా దేశాలకు భారీగా ఎగుమతులు చేస్తున్నాయి. రష్యాలో శుద్ధి చేసిన ఇంధనంపై ఈ దేశాలు ఆధారపడ్డాయని చెబుతున్నారు. అయితే, చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతినడంతో రష్యా దేశీయ అవసరాలపైనే ఎక్కువగా దృష్టి సారించింది. సెప్టెంబర్ నెలలో రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ఇంధన ఎగుమతులను రష్యా తగ్గించిందని కెప్లర్ నివేదిక వెల్లడించింది. భారత్ నుంచి బ్రెజిల్‌కు శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు గణనీయంగా పెరిగి రోజుకు 97 వేల బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టులో ఈ సంఖ్య కేవలం 40 వేల బ్యారెళ్లుగా మాత్రమే ఉంది. టర్కీకి అంతకుముందు నెలతో పోలిస్తే 20 వేల బ్యారెళ్ల నుంచి 56 వేల బ్యారెళ్లకు ఎగుమతులు పెరిగాయి. గత ఏడాది మన దేశం నుంచి టర్కీకి చమురు ఎగుమతులు జరగలేదు. ప్రస్తుతం బ్రెజిల్, టర్కీ దేశాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ చమురును ఎగుమతి చేస్తోంది. యూఏఈకి భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతి పెరిగింది. ఆగస్టులో 1.4 లక్షల బ్యారెళ్ల ఇంధనం కొనుగోలు చేసిన యూఏఈ, సెప్టెంబర్‌లో 2.01 లక్షల బ్యారెళ్లకు పెంచింది. భారత్ నుండి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు సెప్టెంబర్ నెలలో 14 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

## 500 బిలియన్ డాలర్లతో మస్క్ టాప్ బిలియనీర్



**న్యూయార్క్, అక్టోబరు 3:** టెస్లా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఎలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో 500 బిలియన్ డాలర్ల నికర సంపద కలిగిన మొదటి వ్యక్తిగా నిలిచారు. టెస్లా షేర్లలో పెరుగుదల, ఇతర టెక్ కంపెనీల విలువల పెరుగుతున్న వేగంగా కారణంగా ఆయన రికార్డు సాధించారు. ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా ప్రకారం మస్క్ సంపద 500.1 బిలియన్లకు చేరింది. మస్క్ సంపదలో ఎక్కువ భాగం టెస్లాదే. సెప్టెంబర్ 15 నాటికి టెస్లా షేర్లలో 12.4 శాతానికి పైగా వాటా మస్క్‌కి ఉన్నది. ఈ సంవత్సరం ఇప్పటివరకు టెస్లా షేర్లు 14 శాతానికిపైగా పెరిగాయి. బుధవారం మరో 3.3 శాతం పెరగడంతో ఒకేరోజు మస్క్ సంపదకు 6 బిలియన్లకుపైగా వృద్ధి చెందింది. వాస్తవానికి ఈ ఏడాది ప్రారంభంలో టెస్లా షేర్లు దారుణంగా పడిపోయాయి. కానీ, ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. మస్క్ వ్యాపారంపై మళ్లీ దృష్టి పెట్టడం ప్రారంభించడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత పెరిగింది. టెస్లా డైరెక్టర్ల బోర్డు చైర్మన్ రాబిన్ డెన్‌హోమ్ గత నెలలో మస్క్ ఇప్పుడు కంపెనీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలిపారు. కొన్ని నెలలు వైట్ హౌస్ సంబంధిత పనుల్లో బిజీగా గడిపిన విషయం తెలిసిందే. మస్క్ దాదాపు బిలియన్ డాలర్ల విలువైన టెస్లా షేర్లను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇది టెస్లా భవిష్యత్తుపై బలమైన విశ్వాసాన్ని చూపించింది. కంపెనీ సాంప్రదాయ కార్ల తయారీదారుని దాటి ముందుకు సాగడానికి ఏఐ, రోబోటిక్స్ ప్రపంచంలో ప్రధాన శక్తిగా మారడానికి కృషి చేస్తోంది. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం రెండో బిలియనీర్‌గా ఒరాకిల్ కోఫౌండర్ లార్రీ ఎలిసన్ నిలిచారు. ఆయన నికర విలువ 351.5 బిలియన్ డాలర్లు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.